Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



ఏలూరు ELURU | సంపుటి : 03 | సంచిక : 19 | శనివారం | నవంబర్ 21, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 19 | Saturday | 21 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా భోగాది రమాదేవి..

రేసులో వున్నారని ముందుగానే చెప్పిన 'ప్రజాభూమి'..

(నందం రామారావు) :

కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా భోగాది రమాదేవిని, వైస్ చైర్‌పర్సన్‌గా దండమరి పూజితను కూటమి నాయకులు నిర్ణయించడంతో ఊహాగానాలకు తెరపడింది. కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికోసం నలుగురైదుగురు పోటీ పడ్డారు. బీజేపీకి చెందిన భోగాది రమాదేవిని ఎంపిక చేయడంవల్ల 'కాపు' సామాజిక వర్గానికి న్యాయం చేసినట్లయింది.



కూటమి ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 'కాపు' సామాజిక వర్గానికి న్యాయం జరగడంలేదని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని కాపులకు ఇవ్వాలని ఆ వర్గానికి చెందిన వారు పట్టుబడుతూ వచ్చారు. చివరకు అదే జరిగింది. అయితే, అవనిగడ్డకు చెందిన విక్కుర్తి శ్రీనివాసరావు సతీమణి (జయలక్ష్మి) (తెలుగుదేశం), కృత్తివెన్ను మండలం నుంచి గరికపాటి శ్రీలత (జనసేన), నాగాయలంక మండలం నుంచి భోగాది రమాదేవి (బీజేపీ) విజయం సాధించారు. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరికి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దక్కడానికి అవకాశాలు వున్నాయని 'ప్రజాభూమి'లో కథనం వచ్చింది. అదీగాక జిల్లా పరిషత్ చరిత్రలో 'కాపు' సామాజిక వర్గానికి చెందిన వారెవరూ ఇంతవరకూ చైర్మన్ పద వినీ అధిష్ఠించన వారెవరూ లేరు! ఎక్కువ మంది 'కమ్మ' సామాజిక వర్గానికి చెందిన వారే పాలన చేశారు.కృష్ణా జిల్లాలో ఇంతవరకూ బీజేపీకి చెందిన వారెవరికీ సరైన న్యాయం జరగలేదన్న అభిప్రాయం ఆ పార్టీలోని వారికి ఉంది. ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత కలిగిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని భోగాది రమాదేవిని ఎంపిక చేయడంతో కొంతమేరకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయగలిగింది! ఇది కాపు సామాజిక వర్గానికి సంతోషం కలిగించేదే!



భారీ లాభాలతో ముగిసిన మార్కెట్లు..

- 25,800 దాటిన నిఫ్టీ - సెన్సెక్స్ 898 పాయింట్లు, నిఫ్టీ 286 పాయింట్లు జంప్
- తిరిగి 25,800 స్థాయిని విజయవంతంగా అధిగమించిన నిఫ్టీ 50 సూచీ
- బ్యాంకింగ్ షేర్లలో భారీ కొనుగోళ్లు టాప్ గెయినర్‌గా హెచ్‌డీఎఫ్‌సీ
- నవంబరులోనే 12 బిలియన్ డాలర్లకు పైగా కుమ్మరించిన విదేశీ ఇన్వెస్టర్లు
- రూపాయి బలోపేతం, క్రూడాయిల్ ధరలు తగ్గడం మార్కెట్లకు ఊతం

2 పేజీలో..



పసిడి ధరకు భారీ షాక్..

- ఒక్కరోజే రూ.5,300 పతనం ! - వెండి ధరలోనూ భారీ కోత.. - కిలోకు రూ.10 వేలకు పైగా తగ్గుదల


బిజినెస్ : దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా దిగివ చ్చాయి. ముఖ్యంగా బంగారం ధర ఒక్కరోజులోనే భారీగా తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. హైదరాబాద్ మార్కెట్లో శు క్రవారం ఉదయం 9.30 గంటల సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.5,300 తగ్గి రూ.1,27,900కు చేరింది. గురు వారం ముగింపు సమయానికి ఈ ధర రూ.1,33,200గా ఉంది. దీంతో పసిడి ధర రూ.1.30 లక్షల దిగువకు పడిపోయింది.

- మిగతా 2లో..

త్వరలో ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు

- ఒడిశా, జార్ఖండ్ బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటున్న ఏపీఎండీసీ - గనుల శాఖపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష - ఏపీఎండీసీ ఐపీవోకు వెళ్లేందుకు ముఖ్యమంత్రి ఆమోదం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సాయం కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో ఖనిజ వనరుల విలువ పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, మన వనరులు...మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెచ్చేలా ప్రయత్నించాలని సీఎం అన్నారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనగా చూడకుండా...భవిష్యత్ ఆస్తిగా మార్చడమే లక్ష్యం కావాలన్నారు.



రాష్ట్రంలో 209 క్లస్టర్లుగా ఖనిజ నిక్షేపాలు

రాష్ట్రంలో 74,860 చ.కి.మీ. పరిధిలో మొత్తం 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలు గుర్తించి, 209 క్లస్టర్లుగా విభజించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది డిసెంబర్ లక్ష్యంగా ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేలా ఐపీఓ కార్యాచరణ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లేలా సీఎం నిర్దేశించారు. ఖనిజ నిర్వహణ కోసం

2 పేజీలో..



స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- ఆక్వా తుపాను ప్రభావం ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం
- వేంపల్లి పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కట్టుబిట్టమైన భద్రత

2 పేజీలో..

తుఫాన్లతో ఏపీలో ఉద్యాన పంటలకు రూ.1,092 కోట్ల నష్టం

- అర్నబ్, మురసు తుఫానులతో నష్టపోయిన ఉద్యాన రైతాంగం - ఉద్యాన పంటల పునరుద్ధరణకు రూ.96 కోట్ల అదనపు సాయానికి వినతి - కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : రెండు వరుస తుఫాన్ల కారణంగా దెబ్బ తిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనపు సాయం అందించాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుపానుల కారణంగా రాష్ట్రంలో ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందని లేఖలో ముఖ్యమంత్రి తెలిపారు.



ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2, తేదీలలో వరుసగా ఏపీని తాకిన ఈ రెండు తుపానుల ధాటికి 18 జిల్లాల్లోని 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. అర్నబ్ తుఫాను కారణంగా 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు వివరించారు. ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిందని

2 పేజీలో..

విజ్ఞానార్జనకు పుస్తకాలే సోపానాలు





ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ : విద్యార్థుల విజ్ఞానార్జనకు పుస్తకాలే సోపానాలని, పుస్తక అధ్యయనం సమాజానికి వికాసాన్ని విజ్ఞానాన్ని అందిస్తుందని కాకినాడ జిల్లా పౌర సంబంధాల అధికారి బి పద్మజ అన్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద పార్క్‌లో గల గాంధీ నగర్ శాఖ గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవముల ముగింపు సభకు ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా పౌర సంబంధాల అధికారి బి.పద్మజ విచ్చేసి వారోత్సవముల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రములు అందజేశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా పౌర సంబంధాల అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు జ్ఞానాభివృద్ధికి పుస్తక పఠనమే సోపానమని విద్యార్థులు సెల్ ఫోను వినియోగాన్ని తగ్గించి పుస్తక పఠనము పెంపొందించుకోవాలని అన్నారు.ప్రపంచ వీక్షణానికి పుస్తకం తొలిమెట్టు అని పుస్తకం వలన ప్రపంచాన్ని ఉన్నచోటి నుండే చూడగలం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వారోత్సవముల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి ఆధ్యాత్మికవేత్త గునుపూడి సావిత్రి ప్రసాద్ డ్రాయింగ్ ఉపాధ్యాయులు తాటిపూడి జయరాం, గ్రంథాలయ పాఠకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గాంధీనగర్ శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు.



స్పైస్‌జెట్‌కు డిజిసిఎ షోకాజ్ నోటీసులు

గురుగ్రామ్ : తీవ్ర సంక్షోభంలో ఉన్న స్పైస్ జెట్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) షోకాజ్ నోటీసులిచ్చింది. ఏడు రోజుల్లోగా నోటీసులపై స్పందన తెలియ జేయాల్సిం దిగా ఆదేశించింది. ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్ 1937, కింద చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణనివ్వాలని కోరింది.

- మిగతా 2లో..





జడ్పీపై కూటమి జెండా రెపరెపలు!



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నవ్యశ్రీ, రామకృష్ణంరాజులకు పగ్గాలు

- రాష్ట్రవ్యాప్తంగా 28 జడ్పీ చైర్మన్ స్థానాల్లో 27 కూటమి ఖాతాలోకి.. వైసీపీకి ఒక్క స్థానమే! - రాజకీయ వారసత్వంతో ఇద్దరు నేతల ప్రస్థానం.. - ఉత్సాహభరిత వాతావరణంలో ప్రమాణ స్వీకారాలు

ప్రజాభూమి - రీజనల్ బ్యూరో : రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్ చైర్మన్ల ఎన్నికల ప్రక్రియ ముగియడంతో జడ్పీ పీఠాలపై కూటమి జెండా రెపరెపలాడింది. మొత్తం 28 జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 27 స్థానాలను కూటమి కైవసం చేసుకోగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తెలుగుదేశం పార్టీ 22, జనసేన పార్టీ 4, బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కూటమి ఆధిపత్యాన్ని మరోసారి చాటిచెప్పాయి.


ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు కొత్త జిల్లాల పరిషత్ చైర్మన్ పీఠాలను కూటమి ఏకగ్రీవంగా దక్కించుకుంది. ఏలూరు జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె సాయి నవ్యశ్రీ, పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా గణపవరం జడ్పీటీసీ స్థానం నుంచి ఎన్నికైన ఇందుకూరి రామకృష్ణంరాజు బాధ్యతలు స్వీకరించారు.రెండు జిల్లాల్లోనూ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్లకు అభినందనలు తెలిపారు.

2 పేజీలో..

ప్రజాభూమి
శనివారం, నవంబర్ 21, 2026

సంపాదకీయం

డిజిటల్ విలవిల..



ఒక చిన్న సాంకేతికలోపం లేదా సైబర్ దాడి ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రణాళికలను తలకిందులు చేసే ముప్ప ఉండటం ఆందోళనకరం. ఐదు రోజుల వ్యవధిలో ప్రజలు సర్వసాధారణంగా భావించే సేవల నుంచి అమెరికా సహా వివిధ దేశాల ప్రభుత్వాలు అత్యంత రహస్యంగా భావించే నెట్‌వర్క్‌ల వరకూ ఒకదాని తర్వాత ఒకటి కుప్పకూలడం డిజిటల్ వ్యవస్థల కేంద్రీకరణ, కార్పొరేట్ గుత్తాధిపత్యం, ప్రత్యామ్నాయ వ్యవస్థలు లేకపోతే తలెత్తే ఉపద్రవాలను ముందుకు తెచ్చాయి. అమెరికాలోని మైక్రోసాఫ్ట్, అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ), జెపి మోర్గాన్ చాజ్, ఆపిల్, ఎన్ఎస్ఎ, మారియట్ సహా తొమ్మిది సంస్థల్లో సాంకేతిక అంతరాయాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. మైక్రోసాఫ్ట్ 365కి అంతరాయం కలగడంతో అవుట్‌లుక్ ఇ - మెయిల్స్, టీమ్స్, షేర్ పాయింట్, కో పైలట్ వంటి సేవలన్నీ ప్రభావితమై 75 దేశాల్లో 45 కోట్లకుపైగా పెయిడ్ సబ్‌స్క్రైబర్లు ప్రభావితమయ్యారు. వివిధ సంస్థలతోపాటు మనదేశం, రాష్ట్రం సహా వివిధ దేశాల్లోని అనేక విభాగాలు పెయిడ్ సబ్‌స్క్రైబర్లుగా ఉండటంతో ఉద్యోగులు, ప్రజానీకం బాధితులుగా మారడం విషాదం. ఇమెయిల్, ఫైల్ షేరింగ్, ఎఐ సాధనాల వినియోగం సహా కార్యకలాపాలన్నీ నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులు, వ్యాపారాలు సహా పలు సేవలు కుప్పకూలాయి. ప్రపంచంలోనే అత్యంత సురక్షి?తంగా చెప్పబడే ఆపిల్ సంస్థకు సంబంధించిన బక్లైడ్, యాప్ స్టోర్, ఆపిల్ మ్యూజిక్‌సహా పలు సేవలు బుధవారం ఆగిపోయాయి. కొత్త డివైజ్‌ను యాక్టివేట్ కాకపోవడం, ఖాతాల్లో లాగిన్ కాలేకపోవడం సహా అనేక సమస్యలు తలెత్తాయి. తమ అంతర్గత అప్‌డేట్ వల్లే ఈ సమస్య వచ్చిందని ఆ సంస్థ ప్రకటించింది. ఎఫ్ఎఎ నెట్‌వర్క్‌లో సాంకేతిక సమస్యతో అగ్రరాజ్యం అమెరికాలో విమానాల ప్రయాణంపై తాత్కాలిక నిషేధం అమలైంది. 15 లక్ష?లమందికిపైగా ప్రయాణికుల ప్రణాళికలు తలకిందులయ్యాయి. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై అధిక డేటా ఒత్తిడే కారణమన్నది ప్రాథమిక నిర్ధారణ. 7 కోట్ల 80 లక్ష?లమంది వరకూ డిజిటల్ కస్టమర్లున్న అమెరికాలోని అతిపెద్ద బ్యాంకు జెపి మోర్గాన్ చేజ్ డిజిటల్ సేవల్లో అంతరాయానికి సాఫ్ట్‌వేర్ బగ్ కారణమన్నది ప్రాథమిక నిర్ధారణ. దాదాపు తొమ్మిది సంఘటనలకూ ఒక దానితో ఒకటి సంబంధం ఉందని కానీ, సైబర్ దాడుల వల్లేనని కానీ ఆధారాలు లేవు. ఈ ఘటనలతో అమెరికా అతలాకుతలమైంది. కృత్రిమ మేధ (ఎఐ) గుర్తించిన లోపాలను సరిదిద్దే క్రమంలోనే ఈ అంతరాయాలు కలిగాయని అమెరికా నిఘా విభాగాధిపతి కాంగ్రెస్ సభ్యులకు చెప్పినట్లు సమాచారం. అసలు కారణాలు ఏమిటో ఇంకా నిర్ధారించలేదు. 2024లో సైబర్ భద్రతా సంస్థ క్రౌడ్ స్ట్రైక్ ఘటన ప్రపంచానికి తొలి హెచ్చరిక. ఈ సంస్థ తన ఫాల్కన్ సాఫ్ట్‌వేర్‌కి విడుదల చేసిన తప్పుడు అప్‌డేట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఉన్న 85 లక్ష?లకుపైగా కంప్యూటర్లు, పరికరాలను ప్రభావితం చేసిందన్నది మైక్రోసాఫ్ట్ అంచనా. మనం ఉపయోగించే సాఫ్ట్‌వేర్ ఎంత ఆధునికమైనా, దానిలోని ఒక చిన్నలోపం కోట్లాదిమంది జీవితాలపై ప్రభావం చూపుతుందని, అంతర్జాతీయ సంక్షోభానికి కారణమవుతుందన్న స్పృహ ప్రభుత్వాలకు మరింత అవసరం. మన దేశంలో రోజురోజుకూ డిజిటల్ సంస్థల గుత్తాధిపత్యం పెరిగిపోతోంది. ఆ సంస్థల పెయిడ్ సబ్‌స్క్రైబర్లలో మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలు కూడా ఉన్నాయి. కేంద్రప్రభుత్వ ఐటి మంత్రిత్వశాఖ అనుమతించిన ప్రభుత్వ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లలో మైక్రోసాఫ్ట్ ఒకటి. గూగుల్ సెర్చ్‌కి ప్రత్యామ్నాయంగా బైడూ, మైక్రోసాఫ్ట్ విండోస్, ఆఫీస్‌కు ప్రత్యామ్నాయంగా డబ్లుపిఎస్ ఆఫీస్, వాట్సాప్‌కు ప్రత్యామ్నాయంగా వుయ్ చాట్, గూగుల్‌పేకు బదులు వుయ్‌చాట్ పే లాంటి దేశీయ ప్రత్యామ్నాయాలెన్నింటినో చైనా అభివృద్ధి చేసుకుంది. అందువల్ల అక్కడి ప్రజలందరికీ డిజిటల్ సేవలు ఉచితంగా లేదా చౌకగా అందుబాట్లో ఉన్నాయి. అమెరికా సాఫ్ట్‌వేర్ సమస్యలతో అత్యవసర చర్యలు తీసుకున్నా... చైనాలో ఎటువంటి ప్రభావమూ ఉండదు. అందుకు భిన్నంగా కొద్దిమంది టెక్నాలజీ బిగ్గజాల సేవలపై ఆధారపడిన ఏ దేశానికైనా అధోగతే. దేశీయ టెక్నాలజీ పరిశోధనలకు భారీగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వరంగ సంస్థలకు స్వదేశీ సాఫ్టవేర్ వినియోగంలో ప్రోత్సాహాన్ని అందించడం, విదేశీ సంస్థలకు మార్కెట్ ప్రవేశంపై, డేటా నిర్వహణపై కఠిన నిబంధనలు అమలు చేయడం లాంటి చర్యలు ఏ దేశానికైనా స్వయంప్రతిపత్తికి ఆధారం. సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, ఆయా దశల్లో ప్రతిదానికీ ప్రత్యామ్నాయాలు కూడా ఏర్పాటు చేసుకోవాలి. అలాగే సైబర్ దాడులను తట్టుకుని, తిప్పికొట్టే సమర్థవంతమైన వ్యవస్థల్ని నిర్మించుకోవాలి. దేశీయ సంస్థలను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతున్న మోడీ సర్కారు ఏలుబడిలో డిజిటల్ స్వయంప్రతిపత్తి అత్యాశే.

జడ్పీపై కూటమి జెండా రెపరెపలు!

ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్లు

తొలుత ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియను అధికారులు చేపట్టారు. చైర్మన్ పదవులకు ఇతరుల నుంచి పోటీ నామినేషన్లు దాఖలు కాకపోవడంతో సాయి నవ్యశ్రీ, ఇందుకూరి రామకృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఇద్దరూ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయి నవ్యశ్రీకి జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇందుకూరి రామకృష్ణంరాజు బాధ్యతలు చేపట్టారు.

రాజకీయ వారసత్వంతో నవ్యశ్రీ అరంగేట్రం

ఏలూరు జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సాయి నవ్యశ్రీ రాజకీయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ, ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టడం మాత్రం ఆమెకు కొత్త అనుభవం. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తెగా ప్రజలకు పరిచయమైన ఆమె, తన తండ్రి ప్రోత్సాహంతో జడ్పీటీసీ ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించడమే కాకుండా జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని అధిరోహించారు.

చింతమనేని కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. ఆమె తాత గ్రామ సర్పంచిగా పనిచేయగా, తండ్రి చింతమనేని ప్రభాకర్ దెందులూరు ఎమ్మెల్యేగా ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ రాజకీయ వారసత్వంలో మూడో తరం ప్రతినిధిగా నవ్యశ్రీ రాజకీయ రంగప్రవేశం చేశారు.

రాజకీయాల్లోకి రాకముందు నుంచే సామాజిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి కనబరిచిన ఆమె, చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్‌తో పాటు పొలిటికల్ సైన్స్, సోషియాలజీలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె, సివిల్ సర్వీసులకు సైతం సిద్ధమయ్యారు. గ్రామీణాభివృద్ధి, సామాజిక అంశాలపై ఆసక్తి కలిగిన నవ్యశ్రీకి ఇప్పుడు జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రజాసేవ చేసే అవకాశం లభించింది. రాజకీయ అనుభవం కొత్త అయినప్పటికీ, ప్రజలకు చేరువగా ఉంటూ జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

అనుభవానికి పట్టం కట్టిన రామకృష్ణంరాజు

పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇందుకూరి రామకృష్ణంరాజు రాజకీయ ప్రస్థానం మాత్రం సుదీర్ఘమైనది. 2008లో విప్పర్ర గ్రామం నుంచి తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన, అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ ప్రజాప్రతినిధి పదవులను నిర్వహించారు. గతంలో ఎంపీపీగా, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా కొనసాగుతున్నారు. స్థానిక రాజకీయ పరిస్థితులు, పరిపాలనా వ్యవహారాలపై అనుభవం కలిగిన ఆయనకు తెలుగుదేశం పార్టీ నాయకత్వం ప్రాధాన్యతనిస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలను అప్పగించింది.

ఇదిలా ఉండగా, ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కూటమిలోకి వచ్చిన నరసింహరాజు సైతం జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కోసం చివరి వరకు ప్రయత్నాలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే కూటమి నాయకత్వం నుంచి ఆయనకు ఆశించిన స్థాయిలో మద్దతు లభించలేదు. స్థానికంగా కూడా ఇటీవల పార్టీ మారిన వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెట్టడంపై ఏకాభిప్రాయం ఏర్పడకపోవడంతో చివరకు రామకృష్ణంరాజుకే అవకాశం దక్కింది. ఈ పరిణామం కూటమిలోని అంతర్గత రాజకీయ సమీకరణాలకు అద్దం పట్టింది.

అభినందనల వెల్లువ

రెండు జిల్లాల్లోనూ నూతన చైర్మన్లు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందనలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నవ్యశ్రీని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం ఆమె తండ్రి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

మొత్తంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు జిల్లా పరిషత్ చైర్మన్ పదవులూ ఏకగ్రీవంగా కూటమి ఖాతాలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు రాజకీయ వారసత్వంతో నవ్యశ్రీ కొత్త బాధ్యతలు చేపట్టగా, మరోవైపు రాజకీయ అనుభవంతో రామకృష్ణంరాజు పగ్గాలు అందుకున్నారు. ఇద్దరు చైర్మన్ల ముందున్న అసలైన సవాలు జిల్లా పరిషత్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడం. వారి పాలనలో జిల్లాల అభివృద్ధి ఏ మేరకు వేగం పుంజుకుంటుందో వేచి చూడాలి.

భారీ లాభాలతో ముగిసిన మార్కెట్లు..

ముంబయి : బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 897.96 పాయింట్లు (1.08 శాతం) ఎగబాకి 83,919.71 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 286.30 పాయింట్లు (1.12 శాతం) పెరిగి కీలకమైన 25,800 మైలురాయిని అధిగమించి 25,800.60 వద్ద ముగిసింది.ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.47 శాతం లాభపడి మార్కెట్ ర్యాలీకి నాయకత్వం వహించింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.59 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 2.16 శాతం, యాక్సిస్ బ్యాంక్ 2.12 శాతం చొప్పున రాణించాయి. దీంతో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీ 3.01 శాతం, నిఫ్టీ బ్యాంక్ 2.49 శాతం లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు కూడా సూచీల జోరుకు తోడయ్యాయి. మరోవైపు టైటాన్ (1.71 శాతం), టాటా స్టీల్ (1.69 శాతం), ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాలతో ముగిశాయి.ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) నిధుల ప్రవాహం, రూపాయి విలువ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడం మార్కెట్లకు కలిసొచ్చాయి. నవంబరు నెలలోనే ఎఫ్ఐఐలు ఏకంగా 12 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులను భారత ఈక్విటీలలోకి తీసుకొచ్చారు. అయితే ఈ ర్యాలీ ప్రధానంగా లార్జ్ క్యాప్ షేర్లకే పరిమితమైంది. స్మాల్ క్యాప్, మైక్రో క్యాప్ సూచీలు నష్టాల్లో ముగియడంతో పాటు మార్కెట్ ఒడుదొడుకులను సూచించే ఇండియా 'విక్స్' 7.52 శాతం పెరిగి 17.32 వద్దకు చేరడం మదుపర్లలోని అప్రమత్తతను స్పష్టం చేస్తోంది.





పసిడి ధరకు భారీ షాక్..

మొదటి పేజీ తరువాయి

వెండి ధర కూడా భారీగా తగ్గింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,65,000 నుంచి రూ.1,54,680కు దిగివచ్చింది. అంటే ఒక్కరోజులోనే కిలో వెండిపై రూ.10,000కు పైగా తగ్గుదల నమోదైంది.

అంతర్జాతీయ మార్కెట్లోనూ అదే పరిస్థితి

దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడి, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3,546 డాలర్ల వద్ద కొనసాగుతోంది. గతంలో 4,000 డాలర్లకు పైగా ఉన్న బంగారం ధర కొద్ది రోజుల వ్యవధిలోనే 500 డాలర్లకు పైగా పడిపోయింది. స్పాట్ వెండి ఔన్సు ధర 41.84 డాలర్లుగా నమోదైంది. ఇక కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబరు డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ.1.22 లక్షల వద్ద, కిలో వెండి ధర రూ.1.49 లక్షల వద్ద కొనసాగుతున్నాయి.

ధరల పతనానికి కారణాలివే !

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలపై అమెరికా డాలర్ బలోపేతం ప్రభావం చూపుతోంది. డాలర్ విలువ పెరగడంతో ఇతర దేశాల కొనుగోలుదారులకు బంగారం కొనుగోలు మరింత ఖరీదుగా మారుతోంది. దీంతో పసిడికి డిమాండ్ తగ్గుతోంది. మరోవైపు అమెరికా ట్రెజరీ బాండ్లపై ప్రతిఫలాలు పెరుగుతుండటంతో పెట్టుబడిదారులు బంగారంలో పెట్టుబడులను తగ్గించి బాండ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాలను మించి నమోదవడం, ఆర్థిక గణాంకాలు బలంగా ఉండటం కూడా బంగారం ధరలపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాలతో డిసెంబరులో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చనే అంచనాలు బలపడుతున్నాయి. డాలర్ విలువ పెరగడం, బాండ్లపై రాబడులు అధికం కావడం, అమెరికా వడ్డీ రేట్లపై మారుతున్న అంచనాలు వెరసి అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరల భారీ పతనానికి దారితీస్తున్నాయి

త్వరలో ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేకంగా ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్ఈజ) ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, వాటికి విలువ పెంచడమే లక్ష్యం కావాలన్నారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియ వేగవంతం చేసేలా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పరిష్కారానికి గడువు పొడిగింపు ప్రతిపాదనలపై సమీక్షలో చర్చించారు. పెండింగ్ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంతో ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాగే, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా కోసం ఒడిశా, జార్ఖండ్‌లో మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. మూడు బొగ్గు బ్లాకుల్లో మొత్తం 1,774.6 మిలియన్ టన్నుల మేర బొగ్గు నిల్వలు ఉన్నాయి. సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తుఫాన్లతో ఏపీలో ఉద్యాన పంటలకు
రూ.1,092 కోట్ల నష్టం

వివరించారు. మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న తోటల పునరుద్ధరణ, రైతులను ఆదుకునేందుకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల సాయం అందించాలని సీఎం కోరారు. అత్యధికంగా అరటి పంట తీవ్రస్థాయిలో దెబ్బతిందని దానిని పునరుద్ధరించేందుకు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్మెంట్ స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు అందించాలని కోరారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఎండుమిర్చి, కూరగాయల పంటలను ఆదుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అలాగే కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, బాపట్ల, తదితర జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. తోటల పునరుద్ధరణ, దీర్ఘకాలిక ఆర్థిక నష్టాలను తగ్గించేందుకు త్వరితగతిన సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

స్పైస్‌జెట్‌కు డిజిసిఎ షోకాజ్ నోటీసులు

విమానాల రద్దు, కార్యకలాపాల్లో అంతరాయాలతో పాటు పలు ఉల్లంఘనలకు పాల్పడినట్లు నవంబర్ 17న డిజిసిఎ జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రూట్ డిస్పర్సల్ గైడ్‌లైన్స్ (ఆర్‌డిజి) నిబంధనలు సహా పలు నిబంధనలను తరుచుగా ఉల్లంఘించిందని పేర్కొంది. విమానాల ఆలస్యం, రద్దుతో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసిందని, అలాగే చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని నోటీసుల్లో తెలిపింది.

స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా,
ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ : రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావ రణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లికార్జున, శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్ రెడ్డి, ఐజీ బి. రాజకుమారి లతోపాటు వైఎస్సార్ కడప, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రధాన ఆదేశాలు

సమన్వయం & నిఘా

» ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి.

» సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ఎన్నికలను ప్రభావితం చేసే శక్తులపై నిరంతరం నిఘా ఉంచాలి.



స్వేచ్ఛాయుత వాతావరణం

అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకుని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలి.

వేంపల్లి గ్రామ పంచాయతీలో ప్రత్యేక ఏర్పాట్లు

వేంపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు సమగ్ర పోలీసు భద్రత కల్పించాలని కమిషనర్ సూచించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయ ప్రాంగణంలోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించడం, తప్పనిసరిగా సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించి, గౌరవ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆక్వా తుపాను ప్రభావంపై ముందస్తు జాగ్రత్తలు

శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై 'ఆక్వా తుపాను' ప్రభావం, వాతావరణ పరిస్థితుల వివరాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, ప్రతికూల వాతావరణం ఏర్పడినా ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలగకుండా విపత్తు నిర్వహణ, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పోలింగ్ సిబ్బంది, ఓటర్లు, ఎన్నికల సామగ్రి రవాణా మరియు పోలింగ్ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.


ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శనివారం, నవంబర్ 21, 2026
3

జై భవానీ నినాదాలతో మార్మోగిన ఇంద్రకీలాద్రి









అమ్మవారి సన్నిధిలో భవానీ దీక్షల ఆరంభం.. భక్తులతో కిటకిటలాడిన కొండ!

ఎర్ర వస్త్రధారణలో భవానీలు.. భక్తిశ్రద్ధలతో మండల దీక్షల ప్రారంభం!

ప్రజాభూమి ప్రతినిధి ఇంద్రకీలాద్రి

కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఈరోజు ఉదయం మహా మండపం 6వ అంతస్తులో శ్రీ భవాని అమ్మవారి ప్రతిష్టాపనతో దీక్షా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ భవాని అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రధాన ఆలయం నుండి మహా మండపం ఆరవ అంతస్తులోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు వి.శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విశేష పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వికె శీనా నాయక్ పాల్గొ న్నారు. పూజా కార్య క్రమాల అనంతరం దేవస్థా నం ఉప ప్రధాన అర్చకులు నాగరాజు శాస్త్రి భక్తులకు భవాని దీక్షా మాలాధారణ చేశారు. తొలిరోజే వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన వందలాది మంది భక్తులు భవాని దీక్షలను స్వీకరించడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు భవాని నామస్మరణతో, దీక్షాధారులతో కిటకిటలాడాయి.భవాని మండల దీక్షలు స్వీకరించదలచిన భక్తులు నవంబర్ 20 నుండి నవంబర్ 24 వరకు ఇంద్రకీలాద్రిపై మండల దీక్షా మాలాధారణతో స్వీకరించవచ్చునని దేవస్థానం వైదిక కమిటీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలమండలి సభ్యులు బి. ధర్మారావు,ఉప ప్రధాన అర్చకులు కోట రవికుమార్,సహాయకార్యనిర్వహణాధికారి ఎన్. రమేష్ బాబు, కే. గంగాధర్, వేదపండితులు పాల్గొన్నారు.

నేడే రంగడి రథోత్సవం

ప్రజాభూమి రీజనల్ రిపోర్టర్ కృష్ణా: కలియుగంలో భక్తులకోసం సాక్షాత్కరించిన భగవంతుడు పాండురంగ స్వామి. పాండురంగస్వామి ఉత్సవాలు ఐదు రోజులపాటు ఘనంగా చిలకలపూడిలో ప్రతి ఏటా నిర్వహిస్తారు. చిలకలపూడి పాండురంగస్వామి రథోత్సవం నేడు అనగా శనివారం ఉ.9 గం.లకు పాండురంగ స్వామి దేవాలయం నుంచి బయలుదేరి పుర వీధులలో భక్తులకు దర్శన మిస్తూ అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులం దరూ పాండురంగస్వామి రథోత్సవంలో పాల్గొని స్వామి వారికృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు టేకి నరసింహం తెలిపారు. పాండురంగ స్వామి ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. కోలాటం, భజనలు, కూచిపూడి నృత్యం ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతిరోజూ భక్తులను అలరించడానికి ఆలయ నిర్వాహకులు అనేక ఏర్పాట్లు చేశారు. కార్తీక పౌర్ణమినాడు వేలాదిగా భక్తులు రంగడి దర్శనానికి తరలివస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా రంగడి దర్శనానికి కావలసిన ఏర్పాట్లు చేసినట్లు టేకి నరసింహం తెలిపారు.





హోటళ్లు, జ్యూస్ స్టాళ్లపై ముమ్మర తనిఖీలు





పరిశుభ్రత ప్రమాణాలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు

సుమారు 50 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్వాధీనం

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఏ. రవీంద్రరావు ఆదేశాల మేరకు జోనల్ కమిష నర్ శ్రీనివాస్, ప్రజారోగ్య అధికారులు మరియు సిబ్బంది తో నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, జ్యూ స్ స్టాళ్ల లో పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాల అమలుపై ప్రజారోగ్య విభాగం అధికారులు విస్తృ తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని శ్రీ బాలాజీ షిర్డీ హోట ల్, శ్రీ బాలాజీ షిర్డీ మిలటరీ హోటల్ మరియు జ్యూస్ స్టాల్‌లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో గోడలు, ఇతర ప్రదేశాల్లో బూజు ఏర్పడటం, అపరిశుభ్రమైన వాతావరణంలో ఆహార తయా రీ, నాణ్యమైన తాగునీటిని వినియోగించకపోవడం, మురుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వంటగది తలుపులకు ఈగలు, కీటకాలు ప్రవేశించకుండా తగిన రక్షణ ఏర్పాట్లు లేకపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. అదేవిధంగా వంటగది నుంచి వెలువడే మురుగునీరు, ఇతర వ్యర్థ జలాలను సైడ్ డ్రైన్లలోకి వదలడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించడం, రిఫ్రిజిరేటర్లను పరిశుభ్రంగా నిర్వహించకపోవడం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు తగిన డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయకపోవడం, త్రాగునీటి శుద్ధి ప్రక్రియ సక్రమంగా లేకపోవడం, శుద్ధి చేసిన త్రాగునీటిని వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు.జ్యూస్ స్టాళ్లలో తనిఖీల సందర్భంగా గడువు ముగిసిన పాల ప్యాకెట్లను వినియోగించడం, జ్యూస్ తయారీ కోసం పండ్లను ముందుగానే అధిక మొత్తంలో కట్ చేసి డీప్ ఫ్రీజర్‌లో నిల్వ చేయడం వల్ల అవి కుళ్లిపోయిన స్థితిలో ఉండటం, జ్యూస్ తయారీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం, జ్యూస్ తయారీకి ఉపయోగించే ఐస్‌ను పరిశుభ్రమైన, తగిన పాత్రల్లో నిల్వ చేయకపోవడం వంటి లోపాలను గుర్తించారు.

అంతేకాకుండా హోటళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి వారి ఆరోగ్య స్థితిని నిర్ధారించే చెల్లుబాటు అయ్యే మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకపోవడాన్ని కూడా గుర్తించారు. ఈ తనిఖీల సందర్భంగా నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను సుమారు 50 కిలోల మేర స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా జ్యూస్ స్టాళ్లలో నిల్వ ఉంచిన కుళ్లిపోయిన సపోటా పండ్ల గుజ్జును గుర్తించి స్వాధీనం చేసుకుని, నిబంధనల ప్రకారం ధ్వంసం చేయడం జరిగింది. గడువు ముగిసిన పాల ప్యాకెట్లను కూడా ధ్వంసం చేయడం జరిగింది.తనిఖీల్లో గుర్తించిన లోపాలపై సంబంధిత హోటల్, జ్యూస్ స్టాల్ యాజమాన్యాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా గుర్తించిన లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకొని, పరిశుభ్రత, ప్రజారోగ్యం మరియు ఆహార భద్రత కు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. గడువులోగా లోపాలను సరిచేయని యాజమాన్యాలపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైతే ట్రేడ్ లైసెన్సులను రద్దు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించే బాధ్యతను ప్రతి హోటల్, రెస్టారెంట్ మరియు జ్యూస్ స్టాల్ యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని నగరపాలక సంస్థ అధికారులు సూచించారు. ఈ తనిఖీలలో శానిటరీ సూపర్‌వైజర్లు డి. సోమరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి. యోగేంద్ర కుమార్, కె. కృష్ణ, జి. శ్రీనివాసరావు, కె. గోపయ్య మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఇనుకుదురు పోలీస్ స్టేషన్‌లో ఘనంగా గార్మి జెండా పండుగ వేడుకలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధిః

ఇనుకుదురు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన గార్మి జెండా పండుగ వేడుకలకు కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానిక ముస్లిం మత పెద్దలు, ప్రజల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు, ప్రజలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవం సమాజంలో మరింత బలోపేతం కావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, మత పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు అస్వస్థత

విజయవాడ ఆసుపత్రికి తరలింపు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :

మాజీ ఎంపీ, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికలలో కొనకళ్ల బ్రదర్స్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అవిశ్రాంతంగా కృషిచేశారు. కొనకళ్ల నారాయణకు సరైన విశ్రాంతి లేకపోవడంవల్ల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంత్రి లోకేష్ కొనకళ్ల నారాయణ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వారు త్వరగా కోలుకోవాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

జడ్పీ చైర్మన్ భోగాది రమాదేవికి శుభాకాంక్షలు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధిః



ఎంతో రాజకీయ చరిత్ర గలిగిన నాగాయలంక మండల జడ్పీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా విజయం సాధించిన భోగాది రమాదేవి కి ఎన్డీఏ కూటమి ధర్మంలో భాగంగా కృష్ణాజిల్లా చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసి జడ్పీ చైర్మన్ ఛాంబర్ లో అడుగుపెట్టిన శుభ సందర్భంగా కూటమి నాయకత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా బీజేపీ అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ జిల్లా ఇంచార్జ్ భోగి రెడ్డి ఆదిలక్ష్మి రాష్ట్ర అధికార ప్రతినిధ చిరువోలు బుచ్చిరాజు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు జిల్లా కార్యదర్శి అయోధ్య రాము తదితరులు జడ్పీ చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలసిన నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధిః మచిలీపట్నం రూరల్ మండలం తాళ్లపాలెం-2 ఎంపీపీ గా ఎన్నికైన కూనపరెడ్డి ప్రసాద్, వైస్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన కాకర్ల భవాని ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర ని, జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీటీసీలకు మంత్రి కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు.





అభివృద్ధే అజెండా.. 55వ డివిజన్ను మోడల్ డివిజన్గా మారుస్తా: పెద్ది రమేష్!



❖మోడల్ డివిజన్గా 55వ డివిజన్.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!

❖55వ డివిజన్ అభివృద్ధికి కార్పొరేటర్ ప్రత్యేక కార్యాచరణ.. ప్రజల వద్దకే పెద్ది రమేష్!❖ప్రజా సమస్యలపై ప్రత్యక్ష పర్యటన.. 55వ డివిజన్ అభివృద్ధికి పెద్ది రమేష్ కృషి!

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

55వ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్పొ రేటర్ పెద్ది రమేష్ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా జెండా చెట్టు ఏరియా, పాత మనీదు ప్రాంతం, సచివాలయం వీధిలో పర్యటించి స్థానిక ప్రజలను నేరుగా కలిసి వారి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానికులు ప్రధానంగా సైడ్ డ్రైనేజీ కాలువలు, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, పారిశుద్ధ్య సమస్యలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల బెడద పెరుగుతోందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రజలు తెలిపిన సమ స్యల పై వెంటనే స్పందించిన కార్పొరేటర్ పెద్ది రమేష్.. విజయవాడ మున్సిపల్ కా ర్పొరేషన్ (వీఎంసీ), మలేరియా విభాగం అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరి తగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిం చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 55, 56 క్లస్టర్ ఇన్‌చార్జ్ ధనేకుల వెంకట సుబ్బారావు, 55వ డివిజన్ అధ్యక్షులు పెద్దిన శ్యామ్ సుందర్, సీనియర్ నాయకులు బసవేశ్వరరావు, కే. శేషారావు, యూనిట్ ఇన్‌చార్జ్ కప్పిరెడ్డి రాజు, కో-యూనిట్ ఇన్‌చార్జ్ షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



48వ డివిజన్‌లో కాలువల పూడికతీత పనులు..

దగ్గరుండి పర్యవేక్షించిన కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)





ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ 48వ డివిజన్ పరిధిలో పారి శుద్ధ్య సమ స్యల పరిష్కారానికి కా ర్పొ రేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు (చంటి) ప్రత్యేక చర్యలు చేపట్టారు. డివిజన్‌లోని మానికొండ వారి వీధి, స్టీల్ ప్యాలెస్, రమ ణయ్య కూల్ డ్రింక్స్ ప్రాంతాల్లో మురు గు కాలువల పూడికతీత పనులను వీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితో చేపిం చారు.ఈ సందర్భంగా కాలువల్లో పేరు కుపోయిన పూడికను తొల గించి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. పనులు జరుగుతున్న తీరు ను కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) దగ్గరుండి పర్యవేక్షించారు.డివిజన్‌లో పారి శుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలు

మచిలీపట్నం,

ప్రజాభూమి ప్రతినిధిః



కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథా లయం, మచిలీపట్నంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ హరికథకులు మడమల రాం బాబు ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమైంది. జక్కుల శిరీష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో ప్రముఖ కథా రచయిత్రి మేరీ కృపాబాయి, అరుదైన నవలల రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి సాహిత్య రచనలు, వారి జీవిత విశేషాల గురించి ప్రసంగించారు.భాషా క్రీడా కారిణి, కథా రచయిత్రి గుడిపూడి రాధికారాణి మచిలీపట్నంలో జన్మించి నటిగా విశేష గుర్తింపు పొందిన నిర్మలమ్మ జీవిత విశేషాలను, ఆమె సాధించిన ఉన్నతిని వివరించారు.తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య కార్యవర్గ సభ్యురాలు జంపాని చంద్రిక గొప్ప సాహసవంతురాలు, విప్లవకారిణి దుర్గాదేవి జీవిత చరిత్రను సభికులకు పరిచయం చేశారు. అనంతరం ఆంధ్ర సారస్వత సమితి ఆధ్వర్యంలో ప్రముఖ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు శ్రీ అంబటిపూడి సుబ్రహ్మణ్యం నిర్వహ ణలో సాహిత్య క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా మూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమాలను తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు పైడిపాటి రామదేవ్, ఆంధ్ర సారస్వత సమితి కార్యదర్శి అప్పినేడి పోతురాజు, వ్యాయామ ఉపా ధ్యాయులు ఎర్రపోతు నాగ వెంకట సురేష్ బాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ శ్రీ బీరం వెంకటరమణ, పలువురు సాహితీ ప్రియులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొ న్నట్లు జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకట రమణ తెలిపారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 21 నవంబర్ 2026



మేయర్ రెడ్డి అప్పలనాయుడుకు
అభినందనల వెల్లువ

ప్రజాభూమి ఏలూరు

నగర నూతన మేయర్‌గా ఎన్నికైన జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడుకు అభినందనలు వెల్లువెత్తాయి.మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా నగర ప్రముఖులు,వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి, జనసేన పార్టీ కార్యాలయానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జనసేన కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది.తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ రెడ్డి అప్పలనాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఏలూరు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అందరినీ కలుపుకొని నగర అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు.

44వ డివిజన్‌లో
గుడ్ మార్నింగ్ కార్పొరేటర్ కార్యక్రమం



ప్రజాభూమి ఏలూరు

ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాల మేరకు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.ఇందులో భాగంగా 44వ డివిజన్‌లో కార్పొరేటర్ పలివేల అంబిక హేమంత్ బాబు ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ కార్పొరేటర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తడి,పొడి చెత్త సేకరణ,కాలువల శుభ్రత,దోమల నివారణకు మందుల పిచికారీ వంటి పనులను పరిశీలించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు.ప్రజలు కూడా తడి,పొడి చెత్తను వేర్వేరుగా అందించి పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కార్పొరేటర్ అంబిక హేమంత్ బాబు కోరారు.

వృద్ధులకు వాకర్స్ క్లబ్ పాలకొల్లు కళ్లజోళ్ల పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు పట్టణం గుత్తులవానిపేట ప్రాంతానికి చెందిన 31 మంది వృద్ధులకు మరియు పేద మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించి 18 వేల రూపాయల విలువైన కళ్లజోళ్లను వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు శుక్రవారం క్లబ్ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, మల్లిపూడి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖులు చంద్రరావు కన్నుమూత

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆగిరిపల్లి ఆర్యవైశ్య ప్రముఖులు యండూరు చంద్రశేఖర వెంకటరత్నం (90) గురువారం వయోభారంతో స్వగృహంలో కన్నుమూశారు. మండల ప్రజలకు ఆయన చంద్రరావుగా సుపరిచితులు. సత్యసాయి బాబా సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్న ఆయన, గతంలో ఆగిరిపల్లి మండల సత్యసాయి సేవా కన్వీనర్‌గా సేవలందించారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న ఆగిరిపల్లి గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు స్వగృహానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా
59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- విజేతలకు బహుమతుల ప్రదానం..
- ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, లైబ్రేరియన్‌కు ఘన సన్మానం

ప్రజాభూమి ఏలూరు



శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 20 వరకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.కళాశాల చైర్మన్ నల్లమెల్లి శేషారెడ్డి, సెక్రటరీ డా. ఎన్. సుగుణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా. బి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మక రంగాల్లోనూ రాణించాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.వారోత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ జి. చంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ వి. సుభాష్ రావు, లైబ్రేరియన్ పి.రామ్ గణేష్‌లను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా అధ్యాపకులు పుస్తక పఠనం ప్రాముఖ్యతను,విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో గ్రంథాలయాల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గారావు, అనిల్ బాబు,దుర్గాప్రసాద్, మంజూష, జ్యోతి, రోహిత్, మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసం





- ఆర్‌వీఆర్ఎన్ఆర్ఐ విశ్వవిద్యాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి సమీపంలోని డాక్టర్ ఆర్‌వీఆర్ఎన్ఆర్ఐ సాంకేతిక విశ్వవిద్యాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులపతి డాక్టర్ ఆర్. వెంకట్రావు విద్యార్థులకు, అధ్యాపకులకు పుస్తక పఠనం, పరిశోధనల ప్రాధాన్యతను వివరించారు. ఉపకులపతి డాక్టర్ కె. ఆర్.ఎస్. సాంబశివరావు, రిజిస్ట్రార్ డాక్టర్ బి. రాఘవరావు, సహ ఉపకులపతి డాక్టర్ సి. నాగభాస్కర్, పరిశోధన విభాగ సంచాలకులు డాక్టర్ కె.వి. సాంబశివరావు పరిశోధనల అభివృద్ధికి ఆధునిక గ్రంథ వనరులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 19, 20 తేదీల్లో విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, అధ్యాపకులు సందర్శించారు. గ్రంథపాలకులు ముత్యాల వెంకట శేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు

ప్రజాభూమి ఏలూరు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి.ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు సభాధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్,అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఎం.జె. అభిషేక్ గౌడ్ పాల్గొన్నారు.వారం రోజుల పాటు విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ ఏలూరు,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, సాహిత్య మండలి, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, రసన సాహితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు, వి. శిరీష, జి. అచ్యుత, ఉషా, ఎం.జె. సుజయ కృష్ణ, కె. సోమ్లా నాయక్, ఎం.అజయ్ బాబు,పి.రత్నాకరరావు, పి.పురుషోత్తమరావు,పి. సత్యవాణి పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



అనుమతి లేని శ్రీ చైతన్య పాఠశాల భవనం
సీజ్ చేయాలి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు ఆరు నెలలు కావస్తున్నప్పటికీ నేటికీ జిల్లాలో ఇంకా అనుమతి లేని పాఠశాలలు కొనసాగుతున్నాయని నాని అన్నారు. శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంబంధించినటువంటి మరొక బ్రాంచ్ ఏలూరు నగరంలో అనుమతులు లేకుండా క్లాసులు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఇదే విషయం జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లే దాకా తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని కాకి నాని తెలిపారు. అదేవిధంగా ఏలూరు జిల్లాలో ఉన్నటువంటి శ్రీ చైతన్య ప్రైవేట్ పాఠశాలలు సొంత నిబంధనలు రూపొందించుకొని ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి ఇష్టా రీతిన పాఠశాలలు నడుపుతున్నారని ఇదే విషయం అనేకసార్లు ఎంఈఓ దృష్టికి రాతపూర్వకంగా తీసుకెళ్లినప్పటికీ కూడా కేవలం షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని నాని తెలిపారు. అదేవిధంగా శ్రీ చైతన్య పాఠశాలల్లో టెన్త్ క్లాస్ విద్యార్థులకి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినములలో యదేచ్ఛగా క్లాసులు నిర్వహిస్తున్న ఇదే విషయం ఏలూరు జిల్లా ఉపా విద్యాశాఖ అధికారి ఎన్ రవీంద్ర భారతి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆ యొక్క పాఠశాలకు అనుకూలంగా మాట్లాడుతున్నారు తప్ప, వాటిపైన చర్యలు తీసుకోవడానికి మాత్రం వెనకడుగు వేస్తున్నారని కావున విధులలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని నాని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని పాఠశాలలు నడుపుతున్నటువంటి శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం పైన విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈరోజు పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకట లక్ష్మమ్మకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏం. మహేష్, ఎస్. క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు ఆడపడుచుగా పట్టణ అభివృద్ధికి అంకితమవుతా!

- మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో ప్రజలకు నిస్వార్థ సేవలందించడమే నా లక్ష్యం
- పట్టణాభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నాను-
- మున్సిపల్ చైర్‌పర్సన్ కూటమి అభ్యర్థి ఆబోతుల ఉషారాణి

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



పాలకొల్లు పట్టణంలో పుట్టి పెరిగిన ఆడపడుచుగా, ఈ ప్రాంత ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తిగా పట్టణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని పాలకొల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కూటమి అభ్యర్థి ఆబోతుల ఉషారాణి తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలందించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు . స్థానిక వర్తక మస్తాల సంఘ త్యాగరాజ భవనంలో ఆమె తన భర్త, పట్టణ టిడిపి అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు (జీవి) తో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఉషారాణి మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తాను బీసీ తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళనని, పాలకొల్లు తన సొంత ఊరని తెలిపారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగానని, తన తల్లి కూడా పాలకొల్లుకు చెందిన వారేనని చెప్పారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీవి గారి మేనత్త కుమార్తెగా తమ కుటుంబానికి ఈ ప్రాంతంతో ఎంతోకాలంగా అనుబంధం ఉందన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం రాజమండ్రిలో ఉండాల్సి వచ్చిందని, అక్కడ ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి చేరి ప్రాంతంలోనే 30 ఏళ్లుగా పనిచేస్తున్నానన్నారు. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ పొందిన అనంతరం పూర్తిస్థాయిలో ప్రజాసేవలోకి రావాలని గతంలోనే నిర్ణయించుకున్నానని, అయితే ప్రస్తుతం ప్రజలకు సేవ చేసే అవకాశం రావడంతో తన ఆలోచనను మరింత ముందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడం, మంత్రి నిమ్మల రామానాయుడు తమ కుటుంబానికి అవకాశం కల్పించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ బాధ్యతను స్వీకరించేందుకు ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడించారు. ప్రజలు నన్ను దీవించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

మంత్రి నిమ్మల నాయకత్వంలో మరింత అభివృద్ధి.....

పాలకొల్లు పట్టణ అభివృద్ధిపై మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఉషారాణి పేర్కొన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, మరెన్నో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుధ్యం, వీధి దీపాలు, పట్టణ సుందరీకరణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మంత్రి రామానాయుడు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ కౌన్సిల్ ద్వారా పూర్తి సహకారం అందించాలన్నదే తన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేయడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడటం తన ప్రాధాన్యతలుగా ఉంటాయని వివరించారు.

అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటా....

చైర్‌పర్సన్‌గా అవకాశం లభిస్తే కేవలం ఒక సామాజిక వర్గానికో, ఒక ప్రాంతానికో పరిమితం కాకుండా పాలకొల్లు పట్టణంలోని అన్ని కులాలు, మతాలు, వర్గాల ప్రజలను సమానంగా గౌరవిస్తూ పనిచేస్తానని ఉషారాణి తెలిపారు. మహిళలు, వృద్ధులు, యువత, నిరుపేదలు, వ్యాపారులు, కార్మికులు ఇలా ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మున్సిపల్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండేలా, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో తూర్పు కాపు సామాజిక వర్గానికి అవకాశం లభించడం పట్ల ఆ వర్గానికి చెందిన ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని సామాజిక వర్గ గౌరవంగా మాత్రమే కాకుండా, పాలకొల్లు ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తున్నానన్నారు.

పదవి కాదు.. ప్రజాసేవే ముఖ్యం...

రాజకీయాల్లోకి రావడం తనకు పదవుల కోసం కాదని, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం చూపించాలన్న సంకల్పంతోనే ముందుకు వచ్చానని ఉషారాణి స్పష్టం చేశారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు సేవలందించిన అనుభవం, సమాజం పట్ల ఉన్న బాధ్యతాభావం ప్రజా జీవితంలోనూ తనకు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు మార్గదర్శకత్వంలో, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాలకొల్లు పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తనపై ఉంచే నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, చైర్‌పర్సన్‌గా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని, పాలకొల్లు పట్టణానికి మంచి పేరు తీసుకురావడమే తన ఆకాంక్షని ఆబోతుల ఉషారాణి వెల్లడించారు. జీవి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి మంత్రి నిమ్మల రామానాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆయన బాటలోనే మేము నడుస్తామన్నారు. పట్నంలో దీర్ఘకాలిక సమస్యలైన డంపింగ్ యార్డ్, తాగునీరు , వంటి సమస్యలను. శాశ్వత పరిష్కారంగా కొట్లాది రూపాయలతో అభివృద్ధి పరుస్తున్నారని తెలిపారు. కూటమి అభ్యర్థిగా బలపరిచిన ఉషారాణిని ప్రజలందరూ మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రజాభూమి

కోనసీమ


5

శనివారం 21 నవంబర్ 2026

ప్రత్తిపాడు నియోజకవర్గంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

- సమస్యాత్మక గ్రామాల్లో 100 మంది పోలీసులతో కవాతు

ప్రజాభూమి,ప్రత్తిపాడు



గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సీఐ బి. సూర్య అప్పారావు ఆధ్వర్యంలో ఒమ్మంగి, ధర్మవరం, పెద్దనాపల్లి గ్రామాల్లో సుమారు 100 మంది పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం, ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు సమక్షంలో పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఈ సందర్భంగా సీఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ అల్లర్లు సృష్టించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

అన్నవరం సర్పంచ్ అభ్యర్థిగా మడ్డు కాంతం వీరబాబు

- ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులతో ఎన్డీఏ కూటమి మద్దతు

ప్రజాభూమి, ప్రత్తిపాడు (అన్నవరం)



అన్నవరం గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన అధికారిక అభ్యర్థిగా మడ్డు కాంతం వీరబాబు ఎన్నికల బరిలో నిలుస్తున్నారని మాజీ వైస్ ఎంపీపీ బొమ్మిడి సత్తిబాబు, అన్నవరం ఎంపీటీసీలు పసుపులేటి చక్రి, పలివెల శ్యామల సతీష్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులతో, కూటమి మద్దతుతో మడ్డు కాంతం వీరబాబు పోటీ చేస్తున్నారని వెల్లడించారు. కూటమి మద్దతుతో పోటీ చేస్తున్నామని ఇతరులు చేసుకుంటున్న ప్రచారాన్ని నమ్మవద్దని వారు ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బలపరిచిన అభ్యర్థి మడ్డు కాంతం వీరబాబు మాత్రమేనని స్పష్టం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి వీరబాబుకు అత్యధిక మెజారిటీతో విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నవరం టౌన్ నాయకులు వీర్ల సూరిబాబు, ఎంపీటీసీ రాయవరపు గంగాభవాని శ్రీను, బండారు రాంబాబు, బండారు సురేష్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



కార్తీక శుక్రవారం.. ఆలయాల్లో విశేష పూజలు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లిలో కార్తీక మాస శుక్లపక్ష ఏకాదశి, శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. స్వయంభు బ్రహ్మసూత్ర సహిత శ్రీ దుర్గాపార్వతీ సమేత మల్లికార్జున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచామృత, ఫలరస అభిషేకాలతో పాటు అన్నాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని శ్రీ గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిపి, ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వరాహ పుష్కరిణి సమీపంలోని స్వయంభు శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో లలితా సహస్రనామ కుంకుమార్చన తదితర పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. సాయి తెలిపారు.

మోడ్రన్లో విద్యార్థులకు వర్క్ షాప్

ప్రజాభూమి ప్రతినిధి, రామాంద్రపురం



విద్యార్థుల యందు సైన్స్ పట్ల అభిరుచి ఆసక్తి పెరగడం కొరకు రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోడరన్ విద్యాసంస్థల్లో కాంతి సంబందించిన కెల్లిడియోస్కోపు, పెరిస్కోప్, పిన్ హోల్ కెమెరా ,మ్యాజిక్ బాక్స్ వంటి అంశాలపై విద్యార్థులకు వర్క్ షాప్ జరిగింది. విద్యార్థుల యందు శాస్త్రీయ అవగాహన పెరుగట కొరకు వివిధ రకాల సైన్స్ అంశాలపై వర్క్ షాప్ లు అవసరమని,సైన్స్ అంటే అనుభవ పూర్వక జ్ఞానం పాఠ్యాంశాలలోని అనే విషయాలను సులువుగా అర్థం చేసుకుంట కొరకు సైన్స్ వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్లు రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె. శ్రీకృష్ణ సాయి పేర్కొన్నారు. విద్యార్థులు సైన్సునుఉత్సాహంగా ,ఉల్లాసంగా నేర్చుకొంటూ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని మోడరన్ విద్యాసంస్థల అధినేత జివి రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆర్. ఉమా దేవి, ప్రధానోపాధ్యాయులు ఎం చిట్టిబాబు సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో ముగిసిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు.



ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ వంగ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వంగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించుకుంటామని తెలిపారు. గ్రంథాలయాలు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని, ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు పోటీపరీక్షలకు అవసరమైన పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల లైబ్రేరియన్ పుప్పాల వీరభద్రరావు మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా మంచి ఆలోచనా విధానం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడతాయని, ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని తన జ్ఞానాభివృద్ధికి వేదికగా చేసుకోవాలని కోరారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన మరియు క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం, 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో విశేష కృషి చేసిన కళాశాల లైబ్రేరియన్ పుప్పాల వీరభద్రరావుని ఆదిత్య విద్యాసంస్థల యాజమాన్యం ఘనంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందించింది. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా. ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డా. ఎన్. సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా. బి.వి.వై.ఎల్. నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.వి.వి. ఫణికుమార్, లైబ్రేరియన్ పుప్పాల వీరభద్రరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. హరిబాబు, కల్చరల్ కోఆర్డినేటర్ పి. సౌభాగ్యలక్ష్మి, ఆంగ్ల విభాగాధిపతి ఎన్. అనురాధ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

మొట్టమొదటి జెడ్పీ చైర్‌పర్సన్‌గా గొల్లపల్లి అమూల్య

ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మొట్టమొదటి జిల్లా పరిషత్ (జెడ్పీ) చైర్‌పర్సన్‌గా గొల్లపల్లి అమూల్య పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా జెడ్పీ చైర్మన్ పీఠాన్ని అధిరోహించబోతున్న వ్యక్తిగా అమూల్య నిలవనున్నారు. ఈ పదవికి సంబంధించిన అధికారిక ఎన్నిక ప్రక్రియ నేడు అమలాపురంలో జరగనుంది. అధిష్ఠానం నిర్ణయంతో ఆమె ఎన్నిక దాదాపు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉండటంతో, జిల్లా ప్రజాప్రతినిధులు మరియు పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కోలంక కూటమి అభ్యర్థిగా బొండా వెంకన్న.



ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు

కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న కోలంక గ్రామ పంచాయతీ కూటమి అభ్యర్థిగా కోలంక పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసారు.ఈ మేరకు శుక్రవారం ఆయన తన అనుచరులతో కలిసి వెళ్ళి తన నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేసారు. ఈ కార్యక్రమంలో కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, కూటమి నాయకులు, జనసైనికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో అయ్యప్ప భక్తికి ఆధ్యాత్మిక శ్రీకారం

- నూతన ధర్మశాస్త్ర ఆలయంలో తొలిసారిగా ఇరుముడి సమర్పణ





ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ ప్రాంగణంలో దేవా గణేష్ స్వామి నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో తొలిసారిగా ఇరుముడి సమర్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పరస నాగరాజు ఆలయంలోని 18 పవిత్ర మెట్లు ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకుని ఇరుముడి సమర్పించారు. ఈ కార్యక్రమానికి గురుస్వామిగా నక్కనబోయిన శ్రీమన్నారాయణ వ్యవహరించారు. ఆయన గత 22 సంవత్సరాలుగా ఏటా సుమారు 50 మంది అయ్యప్ప మాలధారులను రెండు బస్సుల్లో శబరిమలకు తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో దేవా గణేష్ స్వామి నిర్మించిన నూతన ధర్మశాస్త్ర ఆలయం ఆగిరిపల్లి అయ్యప్ప భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ఇప్పటివరకు గొల్లపూడి ధర్మశాస్త్ర ఆలయంలో మాలధారణ చేసుకుంటున్న భక్తులు ఇకపై ఆగిరిపల్లిలోనే మాలధారణతో పాటు ఇరుముడి సమర్పణ కూడా చేసుకోవచ్చని తెలిపారు.

నూజివీడు కూటమిలో ముసలం!

- ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలతో జనసేన – టీడీపీ మధ్య చిచ్చు!

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

చాట్రాయి, ముసునూరులో జనసేనకు అన్యాయం జరిగిం దంటూ జనసైనికుల ఆగ్రహం.. కూటమి ధర్మానికి తూట్లు పొడిచారంటూ మండిపాటు! మంత్రి పార్థసారథి జోక్యం చేసుకోవాలని డిమాండ్.. జనసేన అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామంటున్నజనసైనికులు! నూజివీడు నూజివీడు నియోజక వర్గంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు కూటమి పార్టీల మ ధ్య రాజకీయ వేడిని రాజేశాయి. కూటమి ధర్మంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన పదవులను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టించుకోలేదని, తమ పార్టీకి తీవ్ర అన్యాయం చేశారని జనసైనికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ మిత్రపక్షాల మధ్య నెలకొన్న ఈ విభేదాలు ఇప్పుడు నియోజకవర్గ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. కూటమి ఒప్పందం ఏమైందికూటమి ధర్మంలో భాగంగా నాలుగు ఎంపీపీ పదవుల్లో ఒక ఎంపీపీ పదవిని జనసేన పార్టీకి కేటాయించగా, చాట్రాయి మండల ఎంపీపీ పదవిని జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. అదేవిధంగా నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్ల మండలాల్లో మూడు వైస్ ఎంపీపీ పదవులను జనసేనకు కేటాయించినట్లు జనసైనికులు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో పాటు పార్టీ బీ-ఫారాలు కూడా అందజేసినట్లు చెబుతున్నారు. చాట్రాయిలో టీడీపీ ఏకగ్రీవం.. జనసేనకు మొండిచేయి?చాట్రాయి మండలంలో జనసేనకు ఎంపీపీ పదవి కేటాయించినప్పటికీ, తెలుగుదేశం పార్టీ నాయకులు నామినేషన్లు వేసి ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులను ఏకగ్రీవంగా దక్కించుకున్నారని జనసైనికులు ఆరోపిస్తున్నారు.

కూటమి నిర్ణయం ఉన్నప్పటికీ జనసేనకు అవకాశం ఇవ్వకుండా టీడీపీ నాయకులు వ్యవహరించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ముసునూరులోనూ అదే పరిస్థితి! ముసునూరు మండలంలో వైస్ ఎంపీపీ పదవిని జనసేనకుకేటాయించినప్పటికీ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి నిర్ణయాన్ని గౌరవించకుండా జనసేనకు అన్యాయం చేశారని జనసైనికులు మండిపడుతున్నారు. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి బీ-ఫారాలు ఇచ్చినప్పటికీ ఎన్నికల సమయంలో తమకు న్యాయం జరగకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నూజివీడు, ఆగిరిపల్లిలో కూటమి ధర్మం పాటింపు!ఇమరోవైపు నూజివీడు, ఆగిరిపల్ల మండలాల్లో మాత్రం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం, జనసేన పార్టీలు పరస్పర సమన్వయంతో కూటమి ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగడంతో ఎలాంటి సమస్యలు తలెత్తలేదని తెలుస్తోంది. అయితే చాట్రాయి, ముసునూరు మండలాల్లోనే వివాదం తలెత్తడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.మంత్రి పార్థసారథి స్పందన ఏంటి? ఈ వ్యవహారంపై రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి జోక్యం చేసుకుని జనసేనకు జరిగిన అన్యాయంపై స్పందించాలని జనసైనికులు డిమాండ్ చేస్తున్నారు. కూటమి పెద్దలు కుదుర్చుకున్న ఒప్పందాలను స్థానిక నాయకులు ఉల్లంఘిస్తే ఎలా? మిత్రపక్షాలకు ఇచ్చిన హామీలకు విలువ లేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు.ఈ అంశంపై జనసేన పార్టీ అధిష్టానానికి అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు జనసైనికులు వెల్లడిస్తున్నారు. తమకు కేటాయించిన పదవుల విషయంలో న్యాయం జరిగే వరకు తమ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.స్థానిక పంచాయతీ ఎన్నికలపై ప్రభావం ఉంటుందా?ఇప్పటికే ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు రాబోయే స్థానిక పంచాయతీ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది. చాట్రాయి, ముసునూరు మండలాల్లో జనసైనికుల అసంతృప్తి రాబోయే రోజుల్లో రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి. మొత్తానికి.. నూజివీడు నియోజకవర్గంలో కూటమి ఐక్యతకు చాట్రాయి, ముసునూరు ఘటనలు పరీక్షగా మారాయి. ఒకవైపు నూజివీడు, ఆగిరిపల్లిలో సజావుగా సాగిన కూటమి సమన్వయం.. మరోవైపు చాట్రాయి, ముసునూరులో రగిలిన అసంతృప్తి! ఈ రాజకీయ రగడకు మంత్రి పార్థసారథి ఎలాంటి పరిష్కారం చూపుతారు? జనసేన అధిష్టానం ఎలా స్పందిస్తుంది? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.



ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 21 నవంబరు 2026

ప్రజాస్వామ్య బలోపేతంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకం

- 18 సం.లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా బాధ్యతగా నమోదు చేసుకోవాలనే అవగాహన కలిగి ఉండాలి
- ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాల ప్రదానం
- ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపు
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఏర్పాటు ఆవశ్యకత, ఓటరుగా నమోదు కావడం, బాధ్యతగా వినియోగించుకోవడం వంటి పలు అంశాలపై విస్తృత అవగాహన కొరకు క్విజ్, వ్యాస రచన పోటీలు కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఈఎల్సి అవగాహన పోటీ కార్యక్రమాల్లో క్విజ్ పోటీలలో 10 మందికి, వ్యాస రచన పోటీల విజేతలకు 10 మంది విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల నందు విద్యార్థిని విద్యార్థులకు ఓటరు నమోదు, ఓటింగ్ ప్రాముఖ్యతపై నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించగా, అందులో ప్రతిభ కనబరచిన 83 మందికి జిల్లా స్థాయిలో (ఆర్ట్స్ కళాశాల నందు) విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా



కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పాఠశాల, కళాశాల స్థాయి నుండే విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయడం ఎంతో అవసరమని అన్నారు. 8వ తరగతి నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులలో 18 ఏళ్లు నిండిన వారు ఇప్పటికే ఓటర్లుగా నమోదయ్యారని, మిగిలిన వారు కూడా రాబోయే 3 నుండి 5 సంవత్సరాలలో ఓటు హక్కు పొందనున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా, కచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎటువంటి డబ్బులు, ప్రలోభాలు లేదా ద్వేషాలకు లోనుకాకుండా, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగల సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులంతా ఓటు హక్కు ఆవశ్యకతను తమ తోటి స్నేహితులకు, సమాజానికి తెలియజేసే బాధ్యత తీసుకోవాలని ఆకాంక్షించారు. మరింత మంది కొత్త విద్యార్థులు ఈ ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్స్ నమోదు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని విద్యార్థులు కలెక్టర్ తో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ణ=ా) మలోలా, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనక రాజ్, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్యుల్, వివిధ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు

సిద్దరాంపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

ప్రజా భూమి శింగనమల



విశాఖపట్నం జిల్లా నక్కపల్లిలో డిసెంబర్ నెల 5, 6, 7 తేదీలలో జరగబోయే అండర్-17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు సిద్దరాంపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన హారిక, మునీంద్ర ఎంపికవ్వగా, వర్షిత స్టాండ్-బైగా ఎంపికైనారు. ఈ వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరజ వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గట్టు నాగరాజుతో పాటు ఉపాధ్యాయ బృందం నాగేంద్ర ప్రసాద్, కోటప్ప, ఆదినారాయణ, బాలకృష్ణ, కమల, మధుబాల, ఉమాబాయి మరియు తోటి విద్యార్థులు అభినందించారు. రాబోయే టోర్నమెంట్‌లో కూడా వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శింగనమల లో భారీ జనసందోహంతో నామినేషన్ దాఖలు -టిడిపి బలపరిచిన అభ్యర్థి చంద్రిక

ప్రజాభూమి -- శింగనమల



శింగనమల మండల కేంద్రంలో టీడీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కోడిగుడ్ల చంద్రిక బ్యాండ్ లతో భారీ జనసందోహం మధ్య నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభ్యర్థి చంద్రికకు మద్దతుగా పార్టీ శ్రేణులు భారీగా తరలిరావడంతో నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్యకర్తలు, అభిమానుల సందడితో మండల కేంద్రంలో ఎన్నికల కోలాహలం నెలకొంది. భారీగా తరలివచ్చిన జనసమూహం టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. దీంతో శింగనమలలో గ్రామపంచాయతీ ఎన్నికల రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

యోగశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని

రైల్వేరోడ్డులో ఆర్యవైశ్య మారుతి యోగ వ్యాయామ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. నరహరి సద్గురు ఆశ్రమ పీఠాధిపతి రాజారాం సాంప్రదాయబద్ధంగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. భవన నిర్మాణానికి అమెరికాలో నివసిస్తున్న కట్టా సురేష్ ఆర్థిక సహాయం అందిస్తున్నారని అధ్యక్షులు బద్రీ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామశాల కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు దొంతి భీమరాజు, కోశాధికారి ప్రదీప్ కుమార్, కౌన్సిలర్లు నిమ్మకాయల రాము, ఆదర్శ కుమార్, సహన రాఘవేంద్ర ,ఆర్.ఎస్.ఎస్ జిల్లా సంఘ చాలక్ రామాంజనేయులు, దేవాంగం శంకరప్ప, యోగసాధకులు పాల్గొన్నారు.

మాదిగ సంఘాల నూతన కమిటీల నిర్మాణానికి బాధ్యుల నియామకం

-ఈ నెల 26లోగా కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి

--డాక్టర్ వై.కె. విశ్వనాథ్ మాదిగ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి, మాదిగల ఆత్మగౌరవ సాధన లక్ష్యంగా సంఘాల నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ వై.కె. విశ్వనాథ్ మాదిగ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా హిందూపురం నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామీణ మండలాల్లో నూతన కమిటీల నిర్మాణానికి బాధ్యులను నియమించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అణగారిన వర్గాలకు సముచిత అవకాశాలు కల్పించడంతో పాటు సామాజిక న్యాయం సాధించేందుకు సంఘటిత పోరాటాలు అవసరమన్నారు. మహాజన సంఘాల ఐక్యతతోనే సమాజంలో సమానత్వం, సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మాదిగల అభ్యున్నతి కోసం సంఘాల నిర్మాణాన్ని పటిష్టంగా చేపట్టాలని సూచించారు. ఈ మేరకు హిందూపురం పట్టణ బాధ్యుడిగా వేల్పుల వెంకటమధుర మాదిగ, హిందూపురం గ్రామీణ మండల బాధ్యుడిగా కదిరప్ప నరసింహులు మాదిగ, లేపాక్షి మండల బాధ్యుడిగా హరిజన నారాయణప్ప మాదిగ, చిలమత్తూరు మండల బాధ్యుడిగా జాలప్పగారి అశ్వర్థప్ప మాదిగలను నియమించినట్లు తెలిపారు. నియమితులైన బాధ్యులు తమ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి సంఘ సభ్యులను సమీకరించాలని, అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయ స్ఫూర్తితో పనిచేస్తూ నూతన కమిటీల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. ఈ నెల 26వ తేదీలోగా కమిటీల నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసి నివేదిక అందజేయాలని డాక్టర్ వై.కె. విశ్వనాథ్ మాదిగ ఆదేశించారు.

బోణి కొట్టిన సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ పుచ్చకాయల రాధ

పెరవలి గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన రాధ

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం పెరవలి గ్రామపంచాయతీ సర్పంచ్ గా గ్రామ పెద్దలు గ్రామస్తులు పుచ్చకాయల రాదను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పెరవలి పంచాయితీ నుండి సర్పంచ్ గా ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో పి.రాధ ఏకగ్రీవంగా,ఎంపికైనట్లయింది. పంచాయతీ సర్పంచ్ తో పాటు వార్డులు కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలియజేశారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ ముగింపు కార్యక్రమంలో ఎంపీ అంబిక

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం





అనంతపురం నగరంలోని జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ ముగింపు కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించారు. పుస్తకాలు మంచి స్నేహితులతో సమానం అని అన్నారు. భారతీయ సంస్కృతి, చరిత్ర, విజ్ఞానం వంటి ఎన్నో విలువైన విషయాలను పుస్తకాల ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. నేటి యువత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు, దినపత్రికలు చదివే అలవాటును పెంపొందించుకోవాలి అన్నారు. తద్వారా విజ్ఞానం పెరగడంతో పాటు మొబైల్ వినియోగం వల్ల కలిగే కంటి మరియు ఇతర ఆరోగ్య సమస్యలను కూడా తగ్గించుకోవచ్చు అన్నారు. జిల్లా గ్రంథాలయం ఎంతోమంది విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరింత మెరుగైన సౌకర్యాలతో స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వడ్డే వెంకట, గ్రంథాలయ సెక్రెటరీ శివప్రసాద్, హాస్పిటల్ కమిటీ మెంబర్స్ మెంబర్స్ నరసింహులు, రవికాంత్ క్యారెక్టర్ రమణ, సహాయ లైబ్రరీ అధికారి కంపన్న, గుంతకల్ రైల్వే డి ఆర్ సి నెంబర్ వెంకటేశ్వర రెడ్డి, పాఠశాల బాల బాలికలు, ఉపాధ్యాయులు, లైబ్రరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పుస్తక పఠనం ఒక బలమైన పునాది. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరుకుంటున్నానన్నారు.

వక్తృత్వ పోటీల్లో మదీహకు ప్రథమ బహుమతి

-యూత్ పార్లమెంట్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని

-అభినందించి సర్టిఫికెట్లను ప్రదర్శించిన ప్రిన్సిపాల్

ప్రజాభూమి,

హిందూపురం టౌన్



స్థానిక ఎన్ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఏ. మదీహ జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచిందని ప్రిన్సిపాలధ డాక్టర్ ఎల్.అంజలీ దేవి పేర్కొన్నారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో భాగంగా నిర్వహించిన యూత్ పార్లమెంట్ పోటీల్లో మదీహ ఈ ఘనత సాధించినట్లు ఆమె తెలిపారు. సత్యసాయి జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలలధ విద్యార్థులకు జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో మదీహ తన వక్తృత్వ ప్రతిభతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. గతంలోనూ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం తరఫున అంతర్జాతీయ స్థాయి శిబిరంలో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ అంజలీ దేవి విద్యార్థిని మదీహను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె సాధించిన విజయాలకు సంబంధించిన సర్టిఫికెట్లను తన చాంబర్‌లో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్రదర్శించారు. విద్యార్థినిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేందుకు ప్రేరణ కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యశోదా రాణి, అధ్యాపకులు డాక్టర్ హరీష్ బాబు, ప్రకాష్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు పాల్గొన్నారు.

డీఎస్సీ-2026 అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

డీఎస్సీ--2026 పరీక్షకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, విజయవాడ ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా వెల్లడించిన వివరాల ప్రకారం ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. దరఖాస్తుదారులు బీసీ కేటగిరీకి చెందిన వారై ఉండాలి. అలాగే జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సాధికారత అధికారి, శ్రీ సత్యసాయి జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, టెట్ అర్హత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి. ఈ నెల 25వ తేదీ నుంచి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమం ప్రారంభం కానుంది. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకొని డీఎస్సీ--2026 పరీక్షకు సన్నద్ధం కావాలని అధికారులు కోరారు. మరిన్ని వివరాలకు 9989980701, 9392141545 నంబర్లను సంప్రదించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మరియు సాధికారత అధికారి కె. రాఘవేంద్ర రెడ్డి సూచించారు.

గ్రామీణ ప్రతిభకు జాతీయ స్థాయి గుర్తింపు

-పంజాబ్‌లో జరిగే పోటీల్లో ప్రతిభ చాటనున్న ప్రవస్తి

-ఆర్థిక సహాయం అందించిన దాతలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

గ్రామీణ ప్రాంతంలో చదువుకుంటూనే క్రీడారంగంలో తన ప్రతిభను చాటుకున్న కె. బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఏ.ప్రవస్తి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై సత్తా చాటింది. ఈ నెల 25 నుంచి 29 వరకు పంజాబ్ రాష్ట్రంలోని సంగ్రూరు పట్టణంలో జరగనున్న పోటీల్లో పాల్గొననుంది. ఓ గ్రామీణ విద్యార్థిని జాతీయస్థాయి వేదికకు చేరుకోవడం పాఠశాలతో పాటు గ్రామానికే గర్వకారణంగా నిలిచింది. ఈ విషయాన్ని అనంతపురం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి యాసిన్ మాలిక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్. రవీంద్రరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు కె. సురేష్ కుమార్, అరుణ పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రవస్తిని శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రతిభను అభినందిస్తూ ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి యాసిన్ మాలిక్‌ను క్రీడాకారుల తరఫున, పాఠశాల తరఫున సత్కరించారు. ప్రవస్తికి ప్రోత్సాహంగా డాక్టర్ వెంకటరమణ రూ.5,000, యాసిన్ మాలిక్ రూ.1,500 ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలోనూ ప్రవస్తి ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డితో పాటు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రక్త పరీక్షతో ఫైలేరియా ముప్పు గుర్తింపు

-మోడల్ కాలనీలో 350 మంది రక్త నమూనాల సేకరణ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఫైలేరియా (బోదకాలు) వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేకఫు చర్యలు చేపట్టింది. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మోడల్ కాలనీలో నైట్ బ్లడ్ సర్వే నిర్వహించారు. మలేరియా అసిస్టెంట్ రఘు నాయుడు నేతృత్వంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15 ఏళ్లు పైబడిన వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా రఘు నాయుడు మాట్లాడుతూ, ఫైలేరియా వ్యాధికి కారణమయ్యే మైక్రోఫైలేరియా సూక్ష్మజీవులు రాత్రి వేళల్లోనే రక్తప్రవాహంలోకి వస్తాయని, అందుకే రాత్రి 7.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేకంగా రక్త నమూనాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి లక్షణాలు బయటపడక ముందే ప్రాథమిక దశలోనే క్రిములను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ఎంతో ముఖ్యమన్నారు. చిన్న దోమకాటు ద్వారా శరీరంలోకి ప్రవేశించే సూక్ష్మక్రిములు క్రమంగా బోదకాలు వ్యాధికి కారణమై జీవితాలను ఇబ్బందులకు గురిచేస్తాయని వివరించారు. ముందస్తు పరీక్షలతో వ్యాధి ముప్పును గుర్తించవచ్చని, చిటికెడు రక్త నమూనా ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే అనేక నమన్యలను నివారించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ సర్వేకు సహకరించాలని కోరారు. దోమల నివారణకు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 350 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి, ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఉషారాణి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న పర్యవేక్షించారు. ముస్తఫా, లక్ష్మణ్‌తో పాటు ఆరోగ్య కార్యకర్తలు తిమ్మక్క, ఎర్రమ్మ, గౌసియా, అశ్విని, పద్మలీల, సౌభాగ్య, రత్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. రాత్రి వేళల్లోనూ సర్వేకు సహకరించిన మోడల్ కాలనీ ప్రజలకు వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

పలువురు సోమఘట్టవాసులు టీడీపీలో చేరిక

-కండువా కప్పి ఆహ్వానించిన కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరుతోంది. చిలమత్తూరు మండలం సోమఘట్ట గ్రామ పంచాయతీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. శుక్రవారం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పి. తిప్పారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోమఘట్టకు చెందిన ఎన్. రవీంద్రరెడ్డి, బి. కృష్ణారెడ్డి, వి. రాజేష్, మాజీ స్టోర్ డీలర్ వి. శివప్పతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరితో పాటు వారి అనుచరులు సైతం పెద్ద సంఖ్యలో పార్టీ కండువాలు కప్పుకుని తెలుగుదేశం పార్టీలో చేరడం విశేషం. ఈ సందర్భంగా శ్రీనివాసులు పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శనివారం 21 నవంబరు 2026

యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన కల్పించిన వైద్యులు

- 11వ పోలీస్ బెటాలియన్‌లో వరల్డ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమం



ప్రజాభూమి, సిద్ధవటం: యాంటీబయాటిక్స్ మందులను వైద్యుల సూచనల మేరకే వినియోగించాలని, అవసరం లేకుండా యాంటీమైక్రోబియల్ మందులను ఉపయోగించడం వల్ల తీవ్ర అనర్థాలు సంభవించే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. వరల్డ్ ఎయంఆర్ అవేర్‌నెస్ వీక్--2026లో భాగంగా సిద్ధవటం మండలం భాకరాపేటలోని 11వ పోలీస్ బెటాలియన్ లెక్చర్ హాల్లో శుక్రవారం యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 11వ పోలీస్ బెటాలియన్ గౌరవనీయులైన గ్రూ (చీజ)/కమాండెంట్ శ్రీ కె. ఆనంద రెడ్డి ఆదేశాల మేరకు బెటాలియన్ యూనిట్ మెడికల్ ఆఫీసర్, ప్రభుత్వ వైద్య కళాశాల--ప్రభుత్వ ఆసుపత్రి కడప సూక్ష్మజీవశాస్త్ర విభాగం వైద్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్ రెడ్డి, సూక్ష్మజీవశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ షాహిద్, డాక్టర్ భాజామొహిద్దీన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ విజయవర్ధన్ రెడ్డి పాల్గొని సిబ్బందికి ఎయంఆర్ పై అవగాహన కల్పించారు. యాంటీబయాటిక్స్‌ను స్వయంగా తీసుకోకుండా వైద్యుల సలహా మేరకు మాత్రమే వినియోగించాలని, వైద్యులు సూచించిన మందుల కోర్సును మధ్యలో నిలిపివేయకుండా పూర్తిచేయాలని వైద్యులు సూచించారు. మందులను అనవసరంగా లేదా తప్పుగా వినియోగించడం వల్ల సూక్ష్మ జీవులు మందులకు లొంగని స్థితికి చేరుకోవడం, తద్వారా సాధారణ ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడం కూడా కష్టతరమవుతుందని వివరించారు. అదేవిధంగా ఎయంఆర్ వల్ల కలిగే ఆరోగ్యపరమైన నష్టాలు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం గురించి వైద్యులు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎయంఆర్ పై రూపొందించిన అవగాహన వీడియోలను సిబ్బందికి ప్రదర్శించి అంశంపై మరింత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ పి.ఎన్.డి. ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ కాన్వాయ్ పై పెట్రోల్ బాంబుల దాడి - పులివెందులలో ఉద్రిక్తత

తమ అభ్యర్థులతో నామినేషన్ వేయించేందుకు వెళ్తే వందల మందితో అడ్డుకున్నారు - అది హత్యాయత్నమే అన్న అవినాష్ రెడ్డి

ఫిర్యాదు విషయంలో ఎంపీ, డీఎస్పీ మధ్య మాటల యుద్ధం -పోలీసులు దగ్గరుండి దాడి చేయించారని ఆరోపణ

ప్రజాభూమి, పులివెందుల



పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఉద్రిక్తంగా మారింది. వైఎస్సార్సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కాన్వాయ్ పై టిడిపి వర్గీయులు రాళ్లు, పెట్రోల్ బాంబులతో దాడికి పాల్పడ్డారు. దీంతో పులివెందులలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పంచాయతీ ఎన్నికల రెండో దశ నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, తమ పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థులను ఎంపీ అవినాష్ రెడ్డి తన వాహనాల్లో నామినేషన్ కేంద్రాలకు తీసుకెళ్తున్న నేపథ్యంలో అంకాలమ్మగూడూరు వద్దకు రాగానే టిడిపి వర్గీయులు కాన్వాయ్ ను అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడి చేశారు. కాన్వాయ్ పై పెట్రోల్ బాంబులు కూడా విసిరినట్లు సమాచారం. ఈ దాడిలో కొన్ని వాహనాలు ధ్వంసమయ్యాయి. అయితే ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమికంగా తెలిసింది.పంచాయతీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను అధికార కూటమి నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటోందని, హైకోర్టును ఆశ్రయించగా, అభ్యర్థులకు భద్రత కల్పించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలో ఎంపీ అవినాష్ రెడ్డి నామినేషన్ వేయించేందుకు సీఐ, ఎస్ఐలకు సమాచారం ఇచ్చి అభ్యర్థులతో కలిసి వెళ్తుండగా అంకాలమ్మగూడూరు వద్ద టిడిపి వర్గీయులు ఒక్కసారిగా రాళ్ల వర్షంతో కాన్వాయ్ ను వెంబడించారు.దీంతో ఎంపీ అవినాష్ రెడ్డి, దుష్యంత్ రెడ్డితో కలిసి పులివెందుల పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. ఎంపీ కాన్వాయ్ పై దాడి జరిగిన సంఘటన తెలియగానే నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయడానికి వచ్చి వెనుతిరిగి వెళ్తున్న ఎంపీని డీఎస్పీ మురళీ నాయక్ అడ్డుకున్నారు. ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. తమకు పోలీసుల మీద నమ్మకం లేదని, తాను ఫిర్యాదు చేయనని ఎంపీ అవినాష్ రెడ్డి ససేమిరా అన్నారు. దీంతో మురళీ నాయక్ ఎంపీని అరెస్ట్ చేస్తా అని చెప్పడంతో కొద్దిసేపు తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

విధుల నిర్వహణపై నిక్కచ్చిగా ఉంటా

విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటానని డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. ఎంపీ అవినాష్ రెడ్డి కేవలం మీడియా ముందు ఆరోపణలు చేయడం కాకుండా, ఘటనలపై ఇప్పటి వరకు ఎందుకు రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వలేదని డీఎస్పీ ప్రశ్నించారు. ఎంపీ అయినా లేదా మరెవరైనా సరే, తాను చట్ట ప్రకారం తన విధిని నిర్వహిస్తానని డీఎస్పీ మురళీ నాయక్ స్పష్టం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయవద్దు

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- పీజీ విద్యార్థులకు కూడా పథకాలు వర్తింపజేయాలి - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు కూడా ఈ పథకాలను వర్తింపజేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ, పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం జీవో 77 ద్వారా పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను రద్దు చేసిందన్నారు. జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా ఈ పథకాలను వర్తింపజేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.6 వేల కోట్లు, వసతి దీవెన కింద రూ.3,300 కోట్లు కలిపి మొత్తం రూ.9,300 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తుండటంతో పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగ అవకాశాలను పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రూ.9,300 కోట్ల బకాయిలను విడుదల చేయడంతో పాటు జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను అమలు చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రాణాలకు తెగించి నామినేషన్ వేయాల్సిన దుస్థితి - పులివెందులలో ప్రజాస్వామ్యం ఏది

హైకోర్టు ఆదేశాలు కూడా పట్టించుకోని పరిస్థితి - పోలీసులపై నమ్మకం లేదు, ఫిర్యాదు చేయనన్న ఎంపీ

ప్రజాభూమి, పులివెందుల



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా నామినేషన్లు వేయాలంటే ప్రాణాలను పణంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తీసుకొచ్చినా పరిస్థితుల్లో మార్పు లేదని ఆయన ఆరోపించారు.బలపనూరు, వై కొత్తపల్లి, చెర్వోపిపల్లి, హిమకుంట్ల గ్రామాలకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, అభ్యర్థులతో దగ్గరుండి నామినేషన్లు వేయించాలని జిల్లా ఎస్పీకి సూచించినప్పటికీ అమలు కావడం లేదని అన్నారు. టిడిపి నేతలు, వారి అనుచరులు నామినేషన్ కేంద్రాల వద్ద గుంపులుగా చేరి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను సైతం వక్రీకరిస్తున్నారని విమర్శించారు. సింహాద్రిపురం, బలపనూరుకు చెందిన ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులను పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్తున్న సమయంలో బిటెక్ రవి, జోగిరెడ్డి, ప్రభాకర్ అనుచరులు తమ వాహనాలపై దాడి చేశారని ఎంపీ ఆరోపించారు. రాళ్లు, పెట్రోల్ బాంబులతో దాడులకు తెగబడి వాహనాలను ధ్వంసం చేశారని ఆయన తెలిపారు.సింహాద్రిపురంలోని అంకాలమ్మ గుడి వద్ద తమ వాహనాలను అడ్డగించి, పోలీసుల సమక్షంలోనే ధ్వంసం చేశారని ఆరోపించారు. నామినేషన్ల ప్రక్రియలో ఇలాంటి దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా, ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహించడం ఎందుకని ఎంపీ అవినాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసులపై నమ్మకం లేదు – ఫిర్యాదు చేయను

సింహాద్రిపురంలో తమ కాన్వాయ్ పై టిడిపి గుండాలు రాళ్ల దాడులు, పెట్రోల్ దాడులు చేసినప్పటికీ తాను ఫిర్యాదు చేయనని, పోలీసులపై నమ్మకం లేదని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు.తాను ముందుగానే సీఐ, ఎస్ఐలకు సమాచారం ఇచ్చి వెళ్లినప్పటికీ, పోలీసుల సమక్షంలోనే ఈ దాడులు జరిగాయని ఆయన మండిపడ్డారు. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని, వారిపై తనకు నమ్మకం లేదని పేర్కొన్నారు.ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేస్తూ నామినేషన్ల ప్రక్రియలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కడప జిల్లా వైద్య అధికారి సమక్షంలో ప్రథమ చికిత్సకారుల అవగాహన సదస్సు

ప్రథమ చికిత్స కారుల సంఘం అధ్యక్షులు ఏ రమణయ్య

ప్రజా భూమి, కడప సిటీ:




శుక్రవారంకడప టౌన్ చిన్న చౌక్ లోని కెమిస్ట్ భవన్లో కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉపేంద్ర సూచన మేరకు ఫస్ట్ఎయిడ్ సెంటర్స్వెల్ఫేర్అసోసియేషన్ అధ్యక్షులు ఆ. రమణయ ఆధ్వర్యంలో కడపజిల్లా ఆర్ ఎం పి సోదరుల అవగాహా నా సదస్సు విజయవంతం అయిందని ఆయన తెలిపా రు.ఈ సందర్భంగా డెమో భారతిమాట్లాడుతూ ఆర్ ఎం పి సోదరులు ప్రథమ చికిత్స మాత్రమే చెయ్యాల ని,పరిధిని దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. డి ఎం హెచ్ ఓ ఉపేంద్ర మాట్లాడుతూఆర్ ఎం పిలు విధి విధానాల మీద సూచనలు సలహాలు ఇచ్చి, మీరు చేయవలసిన వైద్య సలహాలు కు మించి అధిక యాంటీబయాటిక్స్, ఇంజక్షన్స్, సెలైన్లు, స్టిచ్ వేయడం ఇలాంటి వైద్యం చేయటం సట్టారీత్యా నేరం కాబట్టి మీరు మాకు సహా కరించి మా ఆజ్ఞలను పాటిం చి, అతిక్రమించకుండా మీ వృత్తిమీరుకొనసాగించుకున్నట్లయితేమీకుగవర్నమెంట్ తరపున మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అని అన్నారు. ఆర్.ఎం.పి సంఘం అధ్య క్షులు రమణయ్య మాట్లాడ తూ సమాజంలో ప్రతి ఒక్క రూ చిన్న చిన్న వైద్యాలు చేసుకునే మమ్ములను బెది రించే వాళ్ళు తయారయ్యా రు. వృత్తి ధర్మం ప్రకారం ఎ టువంటితప్పుచేయకపోయినప్పటికీ, బ్లాక్ మెయిల్ చే యడానికి ఇచ్చే పిర్యాదులు పరిగణలోకి తీసుకోకుండా సహృదయంతోపరిశీలించాలని డిఎంహెచ్ఓనుకోరారు. జిల్లా ఆర్ యం పి సంఘ అ ధ్యక్షులకు కమిటీ వారికి, జి ల్లా వైద్య అధికారులకు వై ద్య సిబ్బందికి ప్రథమ చికిత్స చేయుచున్న సోదరీ, సోదరీమణులు అందరూ సహకరించాలని ఏ రమణ య్య అన్నారు.

గొడవలకు అవినాష్ రెడ్డే కారణం - బిటెక్ రవి

మాపై నిందలు వేయడం సరికాదు - శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపణ

ప్రజాభూమి, పులివెందుల



సింహాద్రిపురంలో జరుగుతున్న గొడవలకు అవినాష్ రెడ్డి, దుష్యంత్ రెడ్డిలే కారణమని టిడిపి నేత బిటెక్ రవి ఆరోపించారు. తాము నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటుండగా, తమపై దౌర్జన్యం చేసినట్లు సాక్షి పత్రికలో కథనాలు ప్రచురించడం సరికాదన్నారు. కసనూరు, సింహాద్రిపురం క్లస్టర్ లో నామినేషన్ కార్యక్రమం ఉండటంతో తాను, తన సోదరుడు అక్కడే ఉన్నామని తెలిపారు. నూట నలభై నాలుగు సెక్షన్ అమల్లో ఉన్న సమయంలో అవినాష్ రెడ్డి ముప్పై నుంచి యాభై వాహనాలతో సింహాద్రిపురానికి రావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఆయన మున్సిపల్ ఓటరు కాదని, నామినేషన్ ప్రక్రియలో ప్రతిపాదకుడు కూడా కాదని పేర్కొన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించి తమపై నిందలు వేయాలనే ఉద్దేశంతోనే సింహాద్రిపురానికి వచ్చారని ఆరోపించారు. అక్కడికి వచ్చి, తిరిగి తమపై దాడి చేసినట్లు కథనాలు రాయించుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో మున్సిపాలిటీలో జరిగిన ఘర్షణలు, ప్రస్తుతం సింహాద్రిపురంలో చోటు చేసుకున్న ఘటనలకు కూడా అవినాష్ రెడ్డే కారణమని విమర్శించారు.దుష్యంత్ రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేయడంతో తమ కార్యకర్తలకు గాయాలయ్యాయని, వారిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ కు వచ్చినట్లు తెలిపారు. అవినాష్ రెడ్డిని మొదటి నిందితుడిగా, దుష్యంత్ రెడ్డిని రెండో నిందితుడిగా పేర్కొంటూ, పులివెందులలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బిటెక్ రవి కోరారు.

ఎంపీటీసీ అవ్వారు రవిశంకర్ దంపతులకు ఘన సన్మానం

- మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించిన కూటమి నాయకులు



ప్రజాభూమి, సిద్ధవటం: ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికై గురువారం ప్రమాణస్వీకారం చేసిన అవ్వారు రవిశంకర్ దంపతులను శుక్రవారం మాధవరం-1 సర్పంచ్ అభ్యర్థి ప్రతినిధి జింకా శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ యువనాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవిశంకర్ నివాసానికి చేరుకున్న నాయకులు నూతనంగా ఎంపీటీసీగా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందనలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో శ్రీ నలంద విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ప్రజాభూమి, సిద్ధవటం: 32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (చీజాజ) జిల్లా స్థాయి పోటీలలో సిద్ధవటంలోని శ్రీ నలంద విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడపలోని సైన్స్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో శ్రీ నలంద పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎన్. వెంకట అవినాష్ రెడ్డి, 6వ తరగతి విద్యార్థి ప్రదీప్ కలిసి రూపొందించిన 'చెత్తను విలువైన సంపదగా ఎలా మార్చవచ్చు' అనే ప్రాజెక్టును ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా యన్ సి యన్ సి కోఆర్డినేటర్ సుబ్బానాయుడు, పీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు జిల్లా స్థాయి బహుమతిని అందుకున్నారు. ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా త్రివేణి వ్యవహరించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటేష్, మండల విద్యాశాఖ అధికారులు అరుణ, నాగరత్నమ్మ, వెంకటసుబ్బయ్యతో పాటు అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

దాడి ఘటనతో పులివెందులకు తరలివచ్చిన వైఎస్సార్సీపీ సీనియర్ నేతలు

ఎంపీని పరామర్శించి సంఘీభావం తెలిపిన అంజాద్ భాష బృందం - బెదిరింపులకు భయపడం అని స్పష్టీకరణ



ప్రజాభూమి, పులివెందుల

సింహాద్రిపురం వద్ద ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కాన్వాయ్ పై రాళ్లు, పెట్రోల్ బాంబులతో దాడి జరిగిన నేపథ్యంలో వైఎస్సార్సీపీ సీనియర్ నేతలు పులివెందుల పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఎంపీని పరామర్శించారు.మాజీ ఉప ముఖ్యమంత్రి, కడప మాజీ ఎమ్మెల్యే అంజాద్ భాషతో పాటు సీఈసీ సభ్యులు సురేష్ బాబు, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఎంపీని కలిసి జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. దాడిలో ఎంపీకి ఎలాంటి గాయాలు కాకపోవడం ఊరటనిచ్చిందని, అయినా ఇది తీవ్రంగా ఖండించాల్సిన ఘటన అని అన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయాలు ప్రజల మద్దతుతో చేయాలే తప్ప దాడులు, బెదిరింపుల తో కాదని అన్నారు. ప్రజాప్రతినిధిపై దాడి చేసి భయపెట్టాలని చూడటం దుర్మార్గమని, ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పా రు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా దాడులు, అరాచకాలు, కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని, వాటిని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేయాల ని చూస్తే ప్రజలే సరైన సమయంలో గట్టి సమాధానం చెబుతారని హెచ్చరించారు.ప్రజల కోసం నిలబడే నాయకుల గొంతును దాడులతో నొక్కలేరని, బెదిరింపులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ప్రజల హక్కుల కోసం పోరాడటం తమ పార్టీ కొనసాగిస్తుందని తెలిపారు.ఈ పరామర్శలో జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి టెకోలి రమేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున, నాయకులు ఎల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, బండి ఉమా, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ఉపసంహరణకు నేడు తెర

- బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాపై ఆసక్తి



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం క్లస్టర్ పరిధిలోని గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలతో ఉపసంహరణకు గడువు ముగియనుందని ఆర్ఓ ఎస్. జావిదా ఖానం తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సిద్ధవటం, నేకనాపురం, మూలపల్లి, మాచుపల్లి గ్రామాలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు సిద్ధవటం గ్రామంలో ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు, నేకనాపురం గ్రామంలో ఆరవ వార్డుకు చెందిన పలువురు వార్డు సభ్యులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను అధికారులు ప్రకటించనున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో తుది పోటీపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థుల్లో ఆసక్తి నెలకొంది. కార్యక్రమంలో ఏఆర్ఓ హెచ్. అబ్దుల్ బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 21 నవంబరు 2026

తిరుపతి జిల్లా తొలి జెడ్పీ చైర్మన్‌గా హేమలత ఎన్నిక.. బట్టా రమేష్ యాదవ్ అభినందనలు



ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా నూతన జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా హేమలత ఎన్నిక కావడం తమకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని బి.ఎన్. కండ్రిగ మాజీ ఎంపీపీ, బిసీ స్టేట్ సెక్రటరీ బట్టా రమేష్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జెడ్పీ చైర్మన్ హేమలతను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. తిరుపతి జిల్లా ఏర్పడిన అనంతరం జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా హేమలత ఎన్నిక కావడం విశేషమని బట్టా రమేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య,వైద్యం వంటి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారుజిల్లా పరిషత్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి ఫలాలుఅందేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారి సేవల సింగపూర్ మంత్రి



ప్రజా భూమి ప్రతినిధి తిరుచానూరు

తిరుచానూరు శ్రీ వద్మావతి అమ్మవారిని శుక్రవారం సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్, ఏవీఎస్ఓ శ్రీహరిరావు, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న సింగపూర్ మంత్రి కి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీ పద్మావతి అమ్మవారికి వెండి స్ఫటిక పాత్ర విరాళం



ప్రజా భూమి ప్రతినిధి
తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, కుటుంబ సభ్యులు రూ. 5 లక్షల విలువైన వెండి స్ఫటిక పాత్రను అమ్మవారికి విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దాత శ్రీధర్ వర్మ ఆలయ అర్చకులు బాబు స్వామి ఆలయ ఏఈవో దేవరాజులు, ఏవీఎస్ఓ శ్రీహరిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ లకు అందదేశారు.

శ్రీరంగం శ్రీరంగనాథస్వామికి టీటీడీ ఈవో పట్టువస్త్రాల సమర్పణ



ప్రజా భూమి
ప్రతినిధి,తిరుమల

తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ వైష్ణవ దివ్యక్షేత్రమైన శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామివారికి శుక్రవారం టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీరంగం ఆలయానికి చేరుకున్న టీటీడీ ఈవోకు ఆలయ జాయింట్ కమిషనర్ ప్రకాష్, ప్రధానార్చకులు సుందరభట్టర్ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఊరేగింపుగా స్వామివారి సన్నిధికి తీసుకెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అధికారులు ఈవోకు తీర్థప్రసాదాలు అందజేశారు.తమిళ కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని 2006 నుంచి టీటీడీ ప్రతి ఏటా శ్రీరంగం శ్రీ రంగనాథ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తోంది. ప్రాచీన శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. అదేవిధంగా, తిరుమల శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం సందర్భంగా శ్రీరంగం ఆలయం నుంచి కూడా ప్రతి ఏటా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ బొక్కసం ఇన్‌చార్జి గురురాజస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి 4వ వార్డులో జనసేన--టీడీపీ కూటమి ఎన్నికల ప్రచారం జోరు : దండి నరేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 4వ వార్డులో జనసేన పార్టీ అభ్యర్థి ఇసుకమట్ల బాలసుబ్రమణ్యం తో పాటు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పేట బాలాజీ కి మద్దతుగా నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది.గతంలో ఇదే వార్డు నుంచి కౌన్సిలర్‌గా సేవలందించిన తిరుపతి పార్లమెంట్ జనసేన సమన్వయకర్త మిద్దెల హరి కి స్థానిక ప్రజలతో ఉన్న ఆత్మీయ అనుబంధం ఈ ప్రచారంలో స్పష్టంగా కనిపించింది. ప్రజలు సాదరంగా స్వాగతిస్తూ తమ మద్దతును తెలియజేయడం ఎంతో సంతోషాన్నిచ్చింది.స్థానిక నాయకులు దేవలం గిరి సమన్వయం, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, టీడీపీ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయం.ఈ అపూర్వ స్పందనతో 4వ వార్డులో జనసేన--టీడీపీ కూటమి విజయంపై మరింత విశ్వాసం ఏర్పడిందని, ప్రచారంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర పేర్కొన్నారు.



జిల్లా మొట్టమొదటి జెడ్పి చైర్ పర్సన్ గాహెచ్. హేమలత వైస్ చైర్మన్ గా ఎ. కిషన్ రెడ్డి ల ప్రమాణ స్వీకారం

ఏకగ్రీవంగా ఎంపికైన జెడ్పి చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లతో ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్





ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

తిరుపతి జిల్లా మొట్టమొదటి జెడ్పి చైర్ పర్సన్ మరియు వైస్ చైర్మన్ లు గా ఎంపికైన హెచ్.హేమలత, ఎ. కిషన్ రెడ్డి లతో ప్రిసైడింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ డా. ఎన్. వెంకటేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించి ధృవ పత్రాలు అందించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థానిక సంస్థల సాధారణ వరిశీలకులు ఎం. వరప్రసాద్ సమక్షంలో జిల్లాలో నూతనంగా ఎంపికైన జెడ్పిటిసిల తో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లా కలెక్టర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఇందులో భాగంగా నూతనంగా ఎంపికైన 35 జెడ్పిటిసి లలో 30 మంది ప్రత్యేక సమావేశానికి హాజరు కాగా వీరందరితో సభ్యుల అంగీకారం మేరకు జిల్లా కలెక్టర్ సామూహిక ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం తెలుగు దేశం పార్టీ నుండి అధ్యక్ష పదవికి నాగలాపురం జెడ్పిటిసి హెచ్. హేమలత నామినేషన్ అందగా సభ్యుల ఆమోదంతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా హెచ్.హేమలత ద్వారా ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ చైర్మన్ పదవికి భారతీయ జనతా పార్టీ నుండి సూళ్ళూరుపేట జెడ్పిటిసి ఆరణి కిషన్ రెడ్డి నామినేషన్ అందగా సభ్యుల ఆమోదం మేరకు వైస్ చైర్మన్ గా జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన జెడ్పి చైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ మరియు ఇతర జెడ్పిటిసి లకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎం ఎల్ సి బి.కళ్యాణ్ చక్రవర్తి, సూళ్ళూరపేట, కోడూరు ఎం ఎల్ ఏ లు నెలవల విజయశ్రీ, అరవ శ్రీధర్ జెడ్పిసిఈఓ టిఎన్ శోభన్ బాబు, డిప్యూటీ సిఈఓ రమణ ప్రసాద్, జెడ్పి అధికారులు మరియు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన జెడ్ పి టి సి ల వివరాలు:

టిడిపి :

1. అనిత సన్నా రెడ్డి, వాకాడు
2. కననెమ్మ తుపాకుల, నాయుడు పేట
3. కవిత కీర్తి పాటి, ఓబులవారి పల్లె
4. కొండే పాటి మధుమతి, చంద్రగిరి
5. పి. గిరిబాబు, నారాయణవనం
6. గోనుగోడుగు సురేష్, బాలాయపల్లి
7. చింతల శివరాజి, వెంకటగిరి
8. చేతన పనబాక, శ్రీ కాళహస్తి
9. జీవ అంబాకం, తడ
10. తిరుమల రెడ్డి మేకల, రామచంద్రా పురం
11. తుపాకుల శశి రేఖ, ఓజిలి
12. నంగ పద్మజ రెడ్డి, పాకాల
13. పూల మునిరాజ, ఏర్పేడు
14. పేళ్లురు సౌజన్య, చిట్టమూరు
15. ముద్దా సుభాష్ రెడ్డి, పుల్లంపేట
16. మొగిలి కల్పన, కే వి బి పురం
17. రావిళ్ళ ముని రాజా నాయుడు, తొట్టంబేడు
18. టి. వెంకతమ్మ, బుచ్చి నాయుడు కండ్రిగ
19. వేమసాని సుభాషిణి దొరవారి సత్రం
20. సర్వే పల్లి రత్నయ్య, దక్కిలి
21. ఎం. సుజాత, పుత్తూరు
22. వి. సుమలత, పిచ్చాటూరు
23. హెచ్ సోనియా, సత్యవేడు
24. పి. హేమావతి, వడమాలపేట

వై ఎస్ ఆర్ సి పి

1. అంబటి మురళి, కోడూరు
2. సుప్రజా దువ్వూరి, పెనగలూరు

జనసేన పార్టీ

1. తాత శ్రీనివాసులు, వరదయ్యపాలెం

స్వతంత్ర అభ్యర్థి

1. గుత్తి నరసింహులు, చిట్వేల్

రామచంద్రాపురంలో టీడీపీకి బిగ్ షాక్

- వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ వైస్ ఎంపీపీ
- మండల రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా మధుసూదన్ రెడ్డి
- సాదరంగా ఆహ్వానించిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి





ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండలంలో పచ్చ పార్టీకి భారీ వికెట్ పడింది. ఎమ్మెల్యే పులివర్తి నాని ఏకపక్ష వైఖరి, నాయకత్వ లోపాలతో విసిగిపోయిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. రెండు రోజుల క్రితమే టీడీపీకి రాజీనామా చేసిన ఆయన, శుక్రవారం భారీ అనుచరగణంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా మధుసూదన్‌రెడ్డి తన అనుచరులతో దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. సుమారు గ్రామంలో 40 కి పైగా కుటుంబాలు, మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.

-నైతిక విలువలు లేని చోట ఉండలేను

నియోజకవర్గంలో టీడీపీ నాయకత్వంపై నమ్మకం కోల్పోయిన సీనియర్లు వరుసగా రాజీనామాలు చేసి బయటకు వస్తుండటంపై నియోజకవర్గంలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, పార్టీ సిద్ధాంతాలను నమ్మి వచ్చిన మధుసూదన్‌రెడ్డికి తగిన ప్రాధాన్యం ఇచ్చి గౌరవంగా చూసుకుంటామని హామీ ఇచ్చారు. జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి సర్పంచ్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకొని, నాయకులు ఈశ్వర్ రెడ్డికి కానుక ఇవ్వాలని పిలుపునిచ్చారు.మండల ట్రబుల్ షూటర్ మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరడంతో నెన్నూరు పంచాయతీ సహా మండలంలో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు లేని చోట రాజకీయం చేయలేమని, నియోజకవర్గంలో పార్టీ పురోభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల భారీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తానని, ఇన్నేళ్లు నైతిక విలువ లేని తెలుగుదేశం పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొన్నానన్నారు. ఇంత భారీ ఎత్తున చెవిరెడ్డి కుటుంబం సమక్షంలో వైయస్సార్సీపీలో చేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించేందుకు సాయశక్తుల కృషి చేస్తానని స్పష్టం చేశారు.

వైభవంగా పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి ● పంచమి తీర్థానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి- టీటీడీ జేఈవో డా. ఏ. శరత్

-బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు- జిల్లా ఎస్పీ.ఎల్. సుబ్బారాయుడు



ప్రజా భూమి ప్రతినిధి తిరుచానూరు

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ జేఈవో డా. ఏ. శరత్ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ, పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. శుక్రవారం టీటీడీ సీవీఎస్ఓ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి జేఈవో బ్రహ్మోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, వాహన సేవలతో పాటు భక్తులందరికీ అమ్మవారి మూలమూర్తి దర్శనం సజావుగా కల్పించేలా క్యూ లైన్లు, దర్శన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత, రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసు, టీటీడీ విజిలెన్స్ విభాగాల సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పంచమి తీర్థం రోజున భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. అంతకుముందు అధికారులు వాహన మండపం, ఆలయ నాలుగు మాడ వీధులు, క్యూ లైన్లు, పద్మ పుష్కరిణిని పరిశీలించారు. పూడి రోడ్డులో ఏర్పాటు చేస్తున్న షెల్టర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నవజీవన్ ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేయనున్న హోల్డింగ్ పాయింట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ మనోహరం, ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

మృతురాలి ఆచూకీ తెలిసినవారు సమాచారం అందించాలి.రేణిగుంట మండలం: కరకంబాడు రైల్వే గేట్ సమీపంలో కడప వైపు వెళ్లే రైల్వే మార్గంలో గుర్తుతెలియని రైలు కింద పడి సుమారు 60 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి రేణిగుంట జీఆర్పీ పోలీసులు వివరాలు వెల్లడించారు. మృతురాలి రెండు చేతులపై ముగ్గు డిజైన్‌తో కూడిన పచ్చబొట్లు ఉన్నాయని, ఆమె బ్లూ కలర్ చీర, జాకెట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు లేదా ఆమె కుటుంబ సభ్యులు ఎవరైనా గుర్తించినట్లయితే రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ మధుసూదన్ రావును 9247575621 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు. మృతురాలి ఆచూకీ గుర్తించేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బాలసుబ్రమణ్యం కి ఘన సన్మానం



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీ కాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి జెడ్ .పి.బాలుర ఉన్నత పాఠశాల లో బాలల దినోత్సవం రెండవ శనివారము శెలవు రావడంతో ఈ రోజు నిర్వహించారు.ఈ వేడుకలో ప్రత్యేక అతిథిగా ఉపాధ్యాయులు, మిమిక్రీ కళాకారులు కయ్యూరు బాలసుబ్రమణ్యం ప్రదర్శించిన మిమిక్రీ విద్యార్థుల్ని ఆకట్టుకుంది.వివిధ రకాల వాహనాలు,పక్షులు, జంతువులు,సినీ కళాకారులు గొంతులు అనుకరించి చేసిన హాస్యవల్లరి అందరిని ఆనంద పరిచింది.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య ,సహచర సిబ్బంది బాలుని ఘనంగా సత్కరించారు.

ఆర్ సి పురంలో సర్పంచులకు122,... 80 వార్డు సభ్యులకు 313 నామినేషన్లు

ఆర్సీపురంలో ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ ఘటం



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం

మండలంలో 10 గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల రెండో విడత ఎన్నికలకు మూడు నామినేషన్ కేంద్రాలలో చివరి రోజు సర్పంచ్ లకు 122, వార్డు సభ్యులకు 313 మంది అభ్యర్థులు నామినేషన్ లో వేసినట్లు ఎన్నికల అధికారులు మోహన్ బాబు, బాలాజీ, సుజాతాలు తెలిపారు. బ శుక్రవారం సి రామాపురం, కమ్మ కండ్రిగ, నెత్త కుప్పం నామినేషన్ కేంద్రాలలో సాయంత్రం 5 గంటలకు నామినేషన్ ల ప్రక్రియ ముగిసిందని ఎన్నికల అధికారులు తెలిపారు ఈ నామినేషన్ల ఘటంలో అనుపల్లె =17, సి రామాపురం=15 కొత్త వేపకుప్పం=22 నడవలూరు =9, నెన్నూరు =10 రాయల చెరువు =13, సి కె పల్లి =8, గంగిరెడ్డిపల్లి =12, కమ్మ కండ్రిగ =5, పివిపురం =11 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 10 పంచాయతీలకు సంబంధించిన 80 వార్డులకు గాను 313 నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు 21వ తారీఖున ఉదయం 8 గంటల నుండి నామినేషన్ కేంద్రాల వద్ద నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్ల పరిశీలనకు అభ్యర్థులు, ప్రతిపాదకులు కచ్చితంగా హాజరుకావాలని వారు కోరారు. కమ్మ కండ్రిక గ్రామంలో కాకర్ల రాజేంద్ర నాయుడుని నామినేషన్ వేయనీకుండా కిడ్నాప్ చేశారని వైసిపి నాయకులు సోషల్ మీడియాలో పుకార్లు చేశారు. దీనిపై కాకర్ల దేవరాజు నాయుడు స్పందిస్తూ నన్ను ఎవరు కిడ్నాప్ చేయలేదని, సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లానని, నేను సర్పంచ్ పదవికి నామినేషన్ వేసి ఆలోచనలో లేనని వీడియో రిలీజ్ చేశారు. దీంతో రాజేంద్ర నాయుడు కిడ్నాప్ హైడ్రామకు సుఖాంతమైంది. పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. నెత్తకుప్పం నామినేషన్ కేంద్రం వద్ద సాయంత్రం 6 గంటల సమయంలో 50 మంది వైసిపి నాయకులు నామినేషన్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు భారీగా చేరుకున్నారు. ఇరువర్గాలను పోలీసులు సర్దుబాటు చేసి నామినేషన్ కేంద్రం నుండి పంపించేశారు. చంద్రగిరి డిఎస్పి జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో మూడు నామినేషన్ల కేంద్రాల వద్ద 60 పోలీసులతో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పై భక్తవత్సలం తెలిపారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు
9
శనివారం 21 నవంబరు 2026

అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ గా గంజే నాగరాజు -: వైస్ చైర్ పర్సన్ గా వెన్నపూస లలిత

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జిల్లా ప్రజా పరిషత్, అనంతపురము చైర్ పర్సన్ ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్ మరియు ప్రిసైడింగ్ అధికారి ఓ.ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 1:00 గంటలకు ప్రారంభించబడినది. ఈ సమావేశమునకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మి నారాయణ, అనంతపురము అర్బన్ శాసన సభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, కళ్యాణదుర్గం శాసన సభ్యులు అమిలినేని సురేంద్ర బాబు, రాయదుర్గం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, సింగనమల శాసనసభ్యులు బండారు శ్రావణిశ్రీ, తదితరులు హాజరవ్వడం జరిగినది. ఈ సమావేశమునకు అనంతపురము జిల్లా నందు ఎన్నిక కాబడిన 31 మండలాల్ప్రాజ సభ్యులు హాజరవ్వడము జరిగింది. అనంతరము జిల్లా కలెక్టర్, అనంతపుర్మ్రాజ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించడమైనది.



ప్రాజ సభ్యుల ప్రమాణ స్వీకారం తర్వాత జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్, అనంతపుర్మ్రాజ సభ్యులను తమ ప్రతిపాదనలను తెలపవలసిందిగా కోరారు. అందులో భాగంగా వేలూరు రంగయ్య, యాడికి ప్రాజ సభ్యులు గార్లదిన్నె ప్రాజ సభ్యులైన గంజే నాగరాజుని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ పదవికి ప్రతిపాదించగా, తాడిపత్రి ప్రాజ సభ్యులు అయిన రాజేంద్ర ప్రసాద్ బలపరిచారు. జిల్లా ప్రజా వరిషత్ చైర్ పర్సన్ పదవికి ఒకటి ప్రతిపాదన వచ్చినందున బి.సి. సామాజిక వర్గానికి చెందిన గార్లదిన్నె ప్రాజ సభ్యులైన గంజే నాగరాజుని జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్, అనంతపురము చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించినారు. జిల్లా ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులుగా ఎల్లనూర్ప్రాజ నభ్యులు అయిన వెన్నవూన లలితని బ్రహ్మసముద్రంప్రాజ అయినా. శ్రీరాములు ప్రతిపాదించగా పెద్దవడుగూర్ప్రాజ అయిన స్వరూపరాణి బలపరిచారు. జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్ పర్సన్ పదవికి ఒకటి ప్రతిపాదన వచ్చినందున జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్ పర్సన్ గా ఎల్లనూర్ప్రాజ సభ్యులు అయిన వెన్నవూన లలిత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించినారు. అనంతరము జిల్లా కలెక్టర్, ఎన్నిక కాబడిన అధ్యక్షులు, ఉపాధ్యక్షుల చేత ప్రమాణ స్వీకారం చేయించడమైనది. ఈ విధంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియను జిల్లా కలెక్టర్, అధ్యక్షతన నిర్వహించి, ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడమైనది.

చీకట్లో కాలవలో పూడికలు రోడ్డుపై ఇబ్బందులు పడుతున్న మహిళలు, చిన్నారులు



ప్రజా భూమి ప్రతి నిధి శ్రీకాళహస్తి టౌన్

పురపాలక సంఘం 19వ వార్డు మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ఎం ఎం వాడ లో మరియు మంచినీళ్ళ గుంట కట్టపై వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సాయంత్రం కాగానే ఆ ప్రాంతమంతా చీకటిమయం అవుతోందని, దీంతో మహిళలు, చిన్నపిల్లలు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అన్ని వీధులు శుద్ధి చేశామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా, ఆ వీధుల్లోకి వచ్చి పరిస్థితిని ప్రత్యక్షంగా చూడటం లేదని, కేవలం ఫోటోలు తీసుకుని వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు.ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకుని, వెలగని వీధి దీపాలను మరమ్మతు చేయించి, వీధులను శుభ్రం చేయించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నాయకుడు పాలూరి రాజా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



గ్రామ అభివృద్ధే లక్ష్యంగా గడ్డంనాగేపల్లిలో సర్పంచ్ ఎన్నికల పోరు!

బరిలో రొల్లపాటి వెంకట్ నాయుడు, రేగటి చిన్న రామయ్య.. గ్రామ భవిష్యత్తుపై ఓటర్లలో ఆసక్తి





ప్రజా భూమి -- నార్పల:

నార్పల మండల పరిధిలోని గడ్డం నాగేవల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల సందడి నెలకొంది. సర్పంచ్ పదవికి రొల్లపాటి వెంకట్ నాయుడు, రేగటి చిన్న రామయ్య పోటీ పడుతుండటంతో గ్రామంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉండటంతో గ్రామంలో రాజకీయ చర్చలు జోరందుకున్నాయి.గ్రామ అభివృద్ధే ప్రధాన అజెండాగా సర్పంచ్ ఎన్నికలు ఆసక్తికరంగా మారుతున్నాయి. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలపై గ్రామ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.ఎన్నికల్లో గెలిచిన వారు గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. గ్రామంలోని ప్రతి వీధికి అభివృద్ధి ఫలాలు అందేలా, ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేసే నాయకత్వం రావాలని ఆశిస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో ఓటర్ల మద్దతు ఎవరికి లభిస్తుందన్న అంశం గ్రామంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామ అభివృద్ధి దిశగా ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో తెలుసుకోవాలంటే ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

ఘనంగా ఉద్దాన ఏకాదశి వేడుకలు

యోగ నిద్ర నుంచి మేలుకొన్న శ్రీమహావిష్ణువు

మాయాపూర్ గౌడీయ మధ్వ శాఖ వారి దీపదానం



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఉద్దాన ఏకాదశి పురస్క రించుకొని శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.కార్తీక మాస ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు యోగ నిద్ర నుంచి మేల్కొంటాడని, దీనినే ఉద్దాన ఏకాదశి అని పిలుస్తారని అర్చకులు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు తలముడిపి వెంకట నవీన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి.ఈ సందర్భంగా మాయాపూర్ ఇస్కాన్ గౌడీయ మధ్వ శాఖ ప్రతినిధి స్వరూప ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాధాకృష్ణులకు ప్రత్యేక హారతి, దీపదానం పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతిరోజు జరుగుతున్న ఆకాశ దీప కార్యక్రమాన్ని ఈ రోజు కూడా ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రమణ, శ్రీ చైతన్య విద్యా సంస్థల అధిపతి ఆరవేటి నారాయణరెడ్డి, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈవో సీనియర్ జర్నలిస్ట్ అల్లం రంగనాయకులు రాయల్, రొటేరియన్ నాగేశ్వర్ రెడ్డి, మహా టీవీ జయరాం రెడ్డి, శ్రీకాంత్, వీరనారాయణ స్వామి అందుల ఆశ్రమ నిర్వాహకుడు రామ్మోహన్, ట్రస్ట్ సభ్యుడు ఆలమూరు రమేష్ తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నివేదితమోరే, చైర్మన్ అభ్యర్థిగా పేట.బాలాజీ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ తరఫున 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నివేదితమోరే, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పేట బాలాజీ రెడ్డి పోటీ చేస్తున్నారు.ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచార కార్యక్రమాన్ని 18 వ వార్డు ఎస్టి కాలనీలోని గంగమ్మగుడి లో పూజలు నిర్వహించి అనంతరం ప్రచారం ప్రారంభించారు.ఈ నెల 26వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అభ్యర్థి నివేదితమోరే,చైర్మన్ అభ్యర్థి పేట.బాలాజీ రెడ్డికి ప్రజలు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో లక్ష్మనేని.మధు నాయుడు,మాభాష,చానబాషా, గిరి నాయుడు,కోట చంద్రశేఖర్, బీమాల భాస్కర్ ముదిరాజ్, చిల్లకూరు బాలసుబ్రమణ్యం,గాజుల భగత్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు.. ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ప్రజా భూమి -- నార్పల:

నార్పల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగేష్, జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగప్ప, ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠాలతో పాటు గ్రంథాలయాల్లో లభించే వివిధ దినపత్రికలు, వారపత్రికలు, కథల పుస్తకాలు, చరిత్ర పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు, సమాజంలోని వివిధ అంశాలపై అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం తదితర అంశాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన మొత్తం 30 మంది విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.అదేవిధంగా వారోత్సవాల నిర్వహణకు సహకరించి కార్యక్రమాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.డి. షరీఫ్, ఇందిర, గ్రంథాలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో సుమారు 50 మంది విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ శాఖా గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఏ. కావేరి కృతజ్ఞతలు తెలిపారు.

బి. పప్పూరు సర్పంచ్‌గా పులసాని త్రివేణి ఏకగ్రీవం!

ఒకే ఒక్క నామినేషన్ దాఖలు.. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది



ప్రజా భూమి -- నార్పల:

నార్పల మండల పరిధిలోని బి. పప్పూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి స్వతంత్ర అభ్యర్థి పులసాని పెద్దిరెడ్డి సతీమణి పులసాని త్రివేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఏర్పడింది. సర్పంచ్ పదవికి ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవం ఖాయమైనట్లు తెలుస్తోంది. సర్పంచ్ పదవికి మరెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో పులసాని త్రివేణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా భావిస్తున్నారు. అయితే ఎన్నికల అధికారులు పరిశీలన అనంతరం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అధికారిక ప్రకటనపై గ్రామ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నార్పల మండలవ్యాప్తంగా ముగిసిన రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

తమ గ్రామాల నుంచి సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు.. సంబంధిత సచివాలయాల్లో నామినేషన్ల సమర్పణ

ప్రజా భూమి – నార్పల:

నార్పల మండలవ్యాప్తంగా రెండో విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ తమ గ్రామాలకు సంబంధించిన సచివాలయాల్లో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో మండలంలోని గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది. సర్పంచ్ పదవులను ఆశిస్తున్న అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను దాఖలు చేశారు. గ్రామాల వారీగా అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది.నామినేషన్ల స్వీకరణ పూర్తికావడంతో తదుపరి ఎన్నికల ప్రక్రియపై అభ్యర్థులు, గ్రామ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది. దీంతో మండలవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి మొదలైంది.

జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సునేత్రకు ఘన సన్మానం

-ఎంపికపై నవీన్ నిశ్చల్ హర్షం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సునేత్రకు హిందూపురంలో ఘన స్వాగతం, సన్మానం లభించింది. ఈ సందర్భంగా తనను వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసినందుకు జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త నవీన్ నిశ్చల్‌ను కలిసి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నవీన్ నిశ్చల్ సునేత్ర దంపతులను ఘనంగా సన్మానించి, మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సునేత్రకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్ సునేత్ర దంపతులకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నిమ్మకాయల రాముతో పాటు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సునేత్ర దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు

-నాలుగు కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ

-ఈ నెల 23 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం

-వివరాలు వెల్లడించిన ఎంపీడీవో దామోదరమ్మ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు హిందూపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి దామోదర మ్మ వెల్లడించారు. శుక్రవారం ఆమె ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ, హిందూపురం రూరల్ మండల పరిధిలో మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి సంబంధించి నాలుగు కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాలంపల్లి, చలివెందల, మలుగూరు, మణేసముద్రం గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను చలివెందుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వీకరించనున్నారు. ఈ నాలుగు పంచాయతీలకు ఎన్నికల అధికారిగా మహేష్ నాయక్‌ను నియమించారు. పూలకుంట, బీరేపల్లి, కొటిపి, కగ్గల్లు గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను పూలకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి హనుమాన్ నాయక్ స్వీకరిస్తారు. కిరికెర, బేవినహళ్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను కిరికెర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి వేణు స్వీకరించనున్నారు. అలాగే తూముకుంట, గోళ్లాపురం, సంతేబిదనూరు, చౌళూరు గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను తూముకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి గంగప్ప స్వీకరిస్తారని ఎంపీడీవో వివరించారు. ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని, 24వ తేదీన నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపారు. 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తామని, అదే రోజు సాయంత్రం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎంపీడీవో దామోదరమ్మ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత.



ప్రజా భూమి ప్రతినిధి

శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ నేడు యువత కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షణీయం అని,దేశంలో ప్రజలు మార్పుని కోరుకుంటున్నారని రాబోయేది కాంగ్రెస్ పార్టీనేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సుధా యాదవ్,శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, పార్టీ చేరినవారిలో అఖిల్,హేమంత్,మల్లికార్జున,నితిన్, శ్యామ్, దిలీప్,అభినాష్, నాని మరియు నాయకులు నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్,తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు వైఎస్ఆర్సిపి ప్రచారం జోరు

కాటంరెడ్డి పవిత్ర రెడ్డి

చైర్మన్ అభ్యర్థి జ్ఞానాంబా వారి దాస్

18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పఠాన్ మాముల

2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి అప్పిని దేవిక

3వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి జయశ్రీ



ప్రజా భూమి ప్రతినిధి

శ్రీ కాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 18వ వార్డు,2వ వార్డ్ , 3వ వార్డ్ లో గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు. ఈ సందర్భంగా ప్రతిగడపకు గతంలో జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాలను అలాగే శ్రీకాళహస్తి పట్టణంలో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించి మీ అందరి ఆశీర్వాదాలు మన అభ్యర్థులపై ఉండి మీ అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు.

శింగనమల సర్పంచ్ అభ్యర్థిగా జెల్లీ శ్రీనివాసులు నామినేషన్ దాఖలు..

భారీ ర్యాలీతో తరలివచ్చిన వైయస్సార్సీపి శ్రేణులు



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండలం వైఎస్ఆర్సిపి నాయకులు మాజీమంత్రి సాకే శైలజనాథ్ మద్దతుతో శింగనమల గ్రామపంచాయతీ జెల్లీ శ్రీనివాసులు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్ ఆర్సిపి నాయకులు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్ఆర్సిపి శ్రేణులు, అభిమానులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చి జెల్లీ శ్రీనివాసులు కు సంఘీభావం తెలిపారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం మధ్య ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న జెల్లీ శ్రీనివాసులు ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని, గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. గ్రామంలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేస్తూ, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.మాజీమంత్రి నాకే శైలజనాథ్ నాయకత్వం, సహకారంతో శింగనమల గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఓటర్ మహాసేయులు,ప్రజల ఆశీర్వాదం, మద్దతుతో గ్రామానికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 10

శనివారం 21 నవంబర్ 2026



సమర్థవంతమైన ఎన్నికల నిర్వహణపై
పోలింగ్ సిబ్బందికి శిక్షణ


ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

డిసెంబర్ 2వ తేదీన ఆగిరిపల్లి మండలంలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ అధికారులు (పీఓలు), సహాయ పోలింగ్ అధికారులు (ఏపీఓలు)కు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ విధులు, ఓటర్ల గుర్తింపు, ఓటు వేసే విధానం, బ్యాలెట్ పత్రాల నిర్వహణ, పోలింగ్ కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలు, ఎన్నికల సామగ్రి వినియోగం, పోలింగ్ ముగిసిన అనంతరం చేపట్టాల్సిన ప్రక్రియలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించేలా అధికారులు పలు సూచనలు చేశారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం..

- యువకుడికి ఏడాది జైలు.. రూ.20 వేల జరిమానా!
- పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి యువతిని మోసగించిన నిందితుడికి న్యాయస్థానం శిక్ష ఖరారు
- 2020 నాటి కేసులో విశాఖ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు : దర్యాప్తు అధికారిగా ప్రస్తుత జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజాభూమి ప్రతినిధి అనకాపల్లి / ఎస్.రాయవరం



ప్రేమ, పెళ్లి పేరుతో యువతిని నమ్మించి మోసగించిన నిందితుడికి న్యాయస్థానం ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన కేసులో విశాఖపట్నంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం ఈ తీర్పు వెలువరించింది. కేసు వివరాల ప్రకారం.. ఎస్.రాయవరం మండలం భీమవరం గ్రామానికి చెందిన గనిశెట్టి త్రినాథ్ (తండ్రి: చక్రధరరావు), యలమంచిలి మండలంలోని ఓ డిగ్రీ కళాశాలలో చదువుతున్న అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధించాడు. కుల, ఆర్థిక అంతరాలు ఉన్నాయని యువతి తొలుత నిరాకరించినప్పటికీ, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. అనంతరం పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా, కులం పేరుతో నిరాకరించి మోసగించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 16.06.2020న ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 479/2020గా ఐపీసీ 417, 376 సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదైంది.

ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో పక్కా దర్యాప్తు

ఈ కేసులో అప్పట్లో నర్సీపట్నం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహించిన ప్రస్తుత అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. నిందితుడిని 22.06.2020న అరెస్టు చేసి, అవసరమైన శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు.

విచారణ సందర్భంగా సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం (11వ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు) నిందితుడు గనిశెట్టి త్రినాథ్‌ను ఐపీసీ 417వ సెక్షన్ కింద దోషిగా నిర్ధారించింది. నేర విచారణ ప్రక్రియ సంహితలోని 235(2)వ సెక్షన్ ప్రకారం ఏడాది జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది.

పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు

ఈ కేసులో న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది బి.మీనాను జిల్లా ఎస్పీ అభినందించారు. అలాగే సాక్ష్యులను సకాలంలో న్యాయస్థానానికి హాజరుపరచడంతో పాటు కేసు విచారణలో సహకరించిన ఎస్.రాయవరం పోలీసు సిబ్బంది, కోర్టు విధులు నిర్వహించే సీఎంఎస్ సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

జెడ్పీటీసీగా గూడపాటి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం జెడ్పీటీసీ సభ్యుడిగా గూడపాటి శ్రీనివాసరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అమలాపురంలో నిర్వహించిన జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల అనంతరం జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడపాటి శ్రీనివాసరావు జెడ్పీటీ సీ సభ్యుడిగా ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో ఆత్రేయపురం మండలం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గూడపాటి శ్రీనివాసరావు భారీ మెజారిటీతో విజ యం సాధించి జెడ్పీటీసీగా ఎన్నికైన విషయం తెలిసిందే. తాజాగా ప్రమాణ స్వీకారంతో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.



ఆగిరిపల్లి పంచాయతీ బరిలో టీడీపీ అభ్యర్థిగా పామర్తి నరసింహారావు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

డిసెంబర్ 2వ తేదీన జరగనున్న ఆగిరిపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆగిరిపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు పామర్తి నరసింహారావును పార్టీ ప్రకటించింది. గత పదేళ్లుగా పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నరసింహారావు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, అందరినీ కలుపుకొని పార్టీ కార్యక్రమాలను ముందుకు నడిపించిన అనుభవం ఆయనకు ఉంది. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో ఆగిరిపల్లి ఒకటి, రెండు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ



అభ్యర్థులు విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మరోవైపు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో ఆగిరిపల్లి మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు కూడా స్థానిక రాజకీయ వాతావరణంలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో ఆగిరిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు ఎంపీపీగా ఎన్నిక కావడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ పరిణామాల నేపథ్యంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ అభ్యర్థి తరఫున పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామ ప్రజల తీర్పు ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

పుస్తక పఠనంతోనే విజ్ఞాన వికాసం



ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి విశ్రాంత బ్యాంకు ఉద్యోగి బి. జయరాజు, సరస్వతి విద్యాలయం ప్రధానోపాధ్యాయులు నిమ్మకూరు కొండయ్య, ఉపాధ్యాయులు నిమ్మకూరు స్వాతి, పామర్తి మానస ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కొండయ్య మాట్లాడుతూ మొబైల్ వినియోగం తగ్గించి పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం వారోత్సవాల్లో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో 30 నామినేషన్ల ఉపసంహరణ

- వార్డు సభ్యులవి 25.. సర్పంచ్ అభ్యర్థులవి 5
- పోలింగ్ సిబ్బందికి శనివారం శిక్షణ

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



తాళ్లపూడి మండలంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్లలో మొత్తం 30 నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకున్నట్లు ఏఆర్వో, ఎంపీడీవో బి. అమ్మిరాజు తెలిపారు. వీటిలో వార్డు సభ్యుల అభ్యర్థుల నుంచి 25 నామినేషన్లు, సర్పంచ్ అభ్యర్థుల నుంచి ఐదు నామినేషన్లు ఉపసంహరణకు వచ్చినట్లు వెల్లడించారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన పోలింగ్ సిబ్బందికి శనివారం మధ్యాహ్నం వేగేశ్వరపురం హైస్కూల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి. అమ్మిరాజు తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియపై సిబ్బందికి అవసరమైన సూచనలు, శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన పరుగుల రారాజు

- బంగారు పథకాన్నిగంగరాజును అభినందించిన చైతన్యరాజు

ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు,





62 వసంతాల వయసులో పరుగులో రారాజుగా నిలుస్తు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో తన సత్తా చాటుతున్న గాదిరాజు గంగరాజు 2007 జనవరి 28 నుండి 31 వరకు థాయిలాండ్ ఫెచ్ బన్ రాజభట్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు హాజరు కానున్నారు. రాష్ట్రస్థాయి నుండి జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన గంగరాజు పాలకొల్లు నియోజకవర్గం కీర్తి ప్రతిష్టలను చాటుతున్నారు. ఎలమంచిలి మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన గాదిరాజు గంగరాజు సత్యనారాయణరాజు–సుభద్రమ్మ పుణ్య దంపతులకు 1964 సెప్టెంబర్ 29న మట్లపాలెంలో జన్మించారు. మట్లపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించిన గంగరాజు దొడ్డిపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నారు. పాలకొల్లు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పాసయ్యారు. చిన్నప్పటినుంచి క్రీడలపట్ల ఆసక్తి చూపుతూ పరుగు పందాల్లో పలు బహుమతులను సాధించారు. ఈ క్రమంలో 2024 డిసెంబర్లో కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన 44వ ఆంధ్ర రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో 60 సంవత్సరాల పైబడిన విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించి బంగారు పతకాన్ని అందుకున్నారు. అదేవిధంగా 5000 మీటర్ల నడక పోటీలో కాంస్య పథకాన్ని కైవసం చేసుకున్నారు. 2025 ఫిబ్రవరిలో రాజస్థాన్ ఆల్వార్లో జరిగిన 44వ జాతీయ స్థాయిలో మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో 5000 మీటర్లు నడక పోటీలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించి ఆంధ్ర ప్రదేశ్ కు గుర్తింపు తీసుకొచ్చారు. అదేవిధంగా 2025 డిసెంబర్ 13, 14 తేదీల్లో గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన 45వ ఆంధ్రరాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో 60 సంవత్సరాల పైబడిన విభాగంలో ఐదువేల మీటర్లు నడక పోటీలో బంగారు పతకం, 800 మీటర్లు పరుగు పందెంలో రజిత పథకం, జావిలెన్ త్రో పోటీలో కాంస్య పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు గంగరాజు. 2026 ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్ నగరంలో గోకల్ పూర్ గవర్నమెంట్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 45వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గాదిరాజు గంగరాజు తన సత్తాను మరోసారి నిరూపించుకుని 5 కి. మీ నడక పోటీలో రజితం, 800 మీ. పరుగులో కాంస్యం, 400 మీ రిలే లో రజిత పథకం సాధించారు. ఇటీవల నవంబర్ 14 15 తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి 46వ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో 5 కి. మీ నడక పోటీలో బంగారు పతకాన్ని, జావెలిన్ త్రో పోటీలో బంగారు పతకాన్ని, 800 మీ పరుగులో రజితం, 400 ఇ 100 మీ. రిలే పోటీలో కాంస్య పథకాలను గంగరాజు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. 2027 జనవరి 1, 2, 3 తేదీల్లో గుజరాత్ హిమాయత్ నగర్ సబర్ స్టేడియంలో నిర్వహించు ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ 46వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలకు గాదిరాజు హాజరు కానున్నట్లు మీడియాకు వెల్లడించారు. అదేవిధంగా 2027 జనవరి 28 నుండి 31 వరకు థాయిలాండ్ ఫెచ్ బన్ రాజభట్ యూనివర్సిటీ స్టేడియంలో జరుగు థాయిలాండ్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలకు హాజరుకానున్నట్లు గంగరాజు మీడియాకు వెల్లడించారు. తన సతీమణి బేబీకుమారి, కుమార్తెలు సౌమ్య, సృజన ప్రోత్సాహంతో క్రీడాపోటీల్లో పాల్గొంటున్నట్లు గంగరాజు తమ అభిప్రాయాలను ఆంధ్రప్రభ ప్రతినిధికి తెలియజేశారు. 2027 జనవరిలో జరుగుతున్న జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మన రాష్ట్రానికి గాదిరాజు గంగరాజు పలు పతకాలు సాధిస్తారని ఆశిద్దాం.

ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో
ఆహార భద్రతపై అవగాహన సదస్సు

- కల్తీ ఆహారం నియంత్రణ సంపూర్ణ ఆరోగ్యానికి తొలిమెట్టు
- మానవ ఆరోగ్యానికి మంచి ఆహారపు అలవాట్లు అత్యంత ఆవశ్యకం
- శ్రీధర్ రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

ప్రజాభూమి ప్రతి నిధి, పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం విద్యార్థులకు పశ్చిమగోదావరి జిల్లా శ్రీధర్ రెడ్డి గారితో ఆహార భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నేడు కల్తీ మరియు ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు మార్కెట్లలో విచ్చలవిడిగా లభించుట చేత పిల్లలనుండి పెద్ద వారి వరకు వాటిని అలవాటు చేసుకుంటున్నారని తద్వారా ఆరోగ్య సమస్యలతో అకాలంగా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని రుచుల కోసం టెస్టింగ్ సాల్ట్ మరియు ఎక్కువసార్లు మరిగించిన నూనెలతో వంటకాలు వండటం వాటినివినియోగదారులకు అందించడం, నాణ్యత ప్రమాణాలను పాటించకుండా మార్కెట్లలో కల్తీ ఆహార పదార్థాలు విచ్చలవిడిగా అమ్ముచున్నారని వినియోగదారులు అటువంటి వాటిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని విద్యార్థి దశలో మంచి ఆహారపు అలవాట్లు పై అవగాహన అత్యంత ముఖ్యమని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ కె.వి నరసింహారావు మాట్లాడుతూ నేడు యువత పిజ్జా, బర్గర్, ప్రాసెస్ ఫుడ్, జంక్ ఫుడ్స్, చిప్స్, నూనెలో వేయించిన ఫుడ్స్, బేకరీ ఐటమ్స్, చక్కెర ఎక్కువగా ఉన్న ఆహారం, సాఫ్ట్ డ్రింక్స్ ఎక్కువగా సమయపాలన లేకుండా తీసుకోవడం ఒక అలవాటుగా చేసుకుంటున్నారని తద్వారా వివిధ రకాల క్యాన్సర్స్ బారిన పడుతున్నారని మంచి ఆహార బలవాట్లు ఒక చక్కని సంతోషదాయక జీవితాన్ని ఇస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కల్తీ ఆహార నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని కఠిన నియమాలు అమలు చేసిన వ్యక్తి నైతికంగా వాటికి



దూరంగా ఉన్నప్పుడు సంపూర్ణ ఆరోగ్యకర సమాజం నెలకొల్ప వచ్చునని అందుకు ఇటువంటి అవగాహన సదస్సు సదస్సులు ఉపయోగపడుతున్నాయి అన్నారు తదుపరి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు శ్రీధర్ రెడ్డి విపులంగా సమాధానాలు ఇచ్చారు కళాశాల యాజమాన్యం శ్రీధర్ రెడ్డిని సాలువ, మెమెంటో తో సత్కరించినారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శ్రీ కేవీ సీతారామరాజు , ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భాను, అధ్యాపకులు రాధా మాధవి, రాము,రాంబాబు,ఎన్. రవికుమార్, ఉషశ్రీ , ప్రసన్న నాగదేవి తదితరులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం
11
శనివారం 21 నవంబరు 2026

పోలవరం జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా వంతల రాజేశ్వరి

- వైస్ చైర్‌పర్సన్‌గా తీగల ప్రభ ఎన్నిక
- 12 మంది జడ్పీటీసీల ప్రమాణ స్వీకారం.. జిల్లా పరిషత్ పాలకవర్గం కొలువుదీరింది
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్‌గా వంతల రాజేశ్వరి, వైస్ చైర్‌పర్సన్‌గా తీగల ప్రభ ఎన్నికయ్యారు. రంపచోడవరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికతో పాటు 12 మంది జడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల సంఘం నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తి చేశారు. సభ్యుల తీర్మానాల మేరకు చైర్‌పర్సన్‌గా వంతల రాజేశ్వరి, వైస్ చైర్‌పర్సన్‌గా తీగల ప్రభ ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలుత 12 మంది జడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, జడ్పీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్‌పర్సన్ వంతల రాజేశ్వరి మాట్లాడుతూ.. 12 మండలాల జడ్పీటీసీ సభ్యుల సహకారంతో పోలవరం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని, ముఖ్యంగా మారుమూల గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండేందుకు రంపచోడవరంలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేసి పోలవరం జిల్లా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, జడ్పీ జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని వక్తలు ఆకాంక్షించారు.

12 మంది జడ్పీటీసీల ప్రమాణ స్వీకారం

రెండవ సాధారణ ఎన్నికలు వీూజ 2026లో భాగంగా ఎన్నికైన 12 మంది జడ్పీటీసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వై.రామవరం నుంచి గొర్లె అమ్మాజి, ఎటపాక నుంచి కాకా కామేశ్వరి, మారేడుమిల్లి నుంచి గొర్లె మురళీ కృష్ణ, దేవీపట్నం నుంచి చారపు వెంకటరాయుడు, గుర్తేడు నుంచి పల్లాల శిల్పారాణి, కూనవరం నుంచి పాయం వెంకయ్య, గంగవరం ఏజెన్సీ నుంచి తీగల ప్రభ, రంపచోడవరం నుంచి కుర్ల రాజశేఖర్ రెడ్డి, అడ్డతీగల నుంచి వంతల రాజేశ్వరి, రాజవొమ్మంగి నుంచి మరం విజయభాస్కర్, వి.ఆర్.పురం నుంచి బంధం విజయలక్ష్మి, చింతూరు నుంచి సవలం అమల సభ్యులుగా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, జడ్పీటీసీ సభ్యులను కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె. పురుషోత్తం, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సత్యనారాయణ మూర్తి, ప్రజాప్రతినిధులు, అధికారులు అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లా తొలి జడ్పీ బాడీ ఏర్పాటు చారిత్రాత్మక ఘట్టం

- జడ్పీ చైర్‌పర్సన్‌గా వంతల రాజేశ్వరి, వైస్ చైర్‌పర్సన్‌గా తీగల ప్రభా ఎన్నిక
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంతో పాటు, జిల్లాలో తొలి జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పాటు కావడం చారిత్రాత్మక ఘట్టమని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మీడియా తో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో జిల్లాలోని 12 మండలాలకు చెందిన 12 జడ్పీటీసీ స్థానాలకు ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా ఏర్పాటైన పోలవరం జిల్లా పరిషత్ పాలకవర్గానికి సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించినట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు.

పోలవరం జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా అడ్డతీగల నుంచి ఎన్నికైన జడ్పీటీసీ వంతల రాజేశ్వరి, వైస్ చైర్‌పర్సన్‌గా గంగవరం నుంచి ఎన్నికైన జడ్పీటీసీ తీగల ప్రభా ఎన్నికయ్యారని



కలెక్టర్ వెల్లడించారు.జిల్లా ఏర్పాటు తర్వాత తొలిసారిగా ప్రత్యేక జిల్లా పరిషత్ పాలకవర్గం అందుబాటులోకి రావడం వల్ల జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ద్వారా నిధులు రావాల్సి ఉండేదని, దీంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల సమస్యలను పరిష్కరించడంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవని వివరించారు. ప్రస్తుతం జిల్లాకు ప్రత్యేకంగా జిల్లా పరిషత్ కార్యాలయం, పాలకవర్గం ఏర్పాటు కావడంతో అభివృద్ధి నిధులు నేరుగా జిల్లాకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ప్రజాప్రతినిధుల సహకారంతో పోలవరం జిల్లాను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన జడ్పీటీసీ సభ్యులతో పాటు నూతనంగా ఎన్నికైన జడ్పీ చైర్‌పర్సన్ వంతల రాజేశ్వరి, వైస్ చైర్‌పర్సన్ తీగల ప్రభాలకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కె. పురుషోత్తం రావు పాల్గొన్నారు..

నేడే అభ్యర్థుల భవితవ్యం తేలేది!

రెబల్ అభ్యర్థులను బుజ్జగించే ప్రయత్నాల్లో కూటమి నేతలు



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నేడు కీలకంగా మారింది. బరిలో కూటమి బలపరిచిన అభ్యర్థులతో పాటు రెబల్, స్వతంత్ర అభ్యర్థులు ఉండటంతో గ్రామాల్లో రాజకీయ వేడి నెలకొంది.రెబల్ అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకునేలా కూటమి నాయకులు బుజ్జగింపులకు దిగుతున్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులు మాత్రం వెనక్కి తగ్గకుండా ఎన్నికల బరిలో కొనసాగేందుకు సిద్ధమవుతున్నారు.రెబల్ అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకుంటే తమ గెలుపు అవకాశాలు మెరుగుపడతాయని కూటమి అభ్యర్థులు భావిస్తున్నారు. అయితే నాయకుల బుజ్జగింపులకు ఎవరు అంగీకరిస్తారు? ఎవరు పోటీలో కొనసాగుతారు? అన్నది ఆసక్తికరంగా మారింది.నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల బరిలో మిగిలే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది. దీంతో గ్రామాల్లో ఎన్నికల పోటీపై ఉత్కంఠ నెలకొంది.

బోణీ కొట్టిన టీడీపీ.. తుమ్మిలేరులో సర్పంచ్‌తో పాటు 8 వార్డులు ఏకగ్రీవం!

- పాపికొండల అటవీ ప్రాంతంలో టీడీపీకి తొలి విజయం..
- నాగలక్ష్మి ఏకగ్రీవ ఎన్నికతో శ్రేణుల్లో నూతనోత్సాహం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

మండలంలో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొన్న వేళ తెలుగుదేశం పార్టీ బోణీ కొట్టింది. వి.ఆర్.పురం మండలంలోని తుమ్మిలేరు పంచాయతీలో టీడీపీ మద్దతుతో బరిలో నిలిచిన సర్పంచ్ అభ్యర్థి నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతేకాకుండా పంచాయతీ పరిధిలోని మొత్తం ఎనిమిది వార్డు సభ్యుల స్థానాలు కూడా ఏకగ్రీవం కావడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పాపికొండల నడుమ దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న తుమ్మిలేరు పంచాయతీ పూర్తిగా గిరిజన ప్రాంతం. ఇక్కడ



కొండరెడ్డి గిరిజనులు అధికంగా నివసిస్తున్నారు. మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న ఈ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు ఎనిమిది వార్డుల స్థానాలు కూడా ఏకగ్రీవం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రాంతం మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి రాజకీయ ప్రాబల్యం కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఆయన ఇలాకాలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నీ ఏకగ్రీవం కావడం టీడీపీకి మరింత బలాన్ని ఇచ్చినట్లయింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలోనే అన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో పార్టీకి లభిస్తున్న ఆదరణకు తుమ్మిలేరు ఏకగ్రీవ ఎన్నికలు నిదర్శనమని టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిణామంతో మండలంలోని ఇతర పంచాయతీల్లోనూ పార్టీ నాయకులు మరింత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. తుమ్మిలేరు పంచాయతీలో సర్పంచ్‌తో పాటు మొత్తం ఎనిమిది వార్డుల స్థానాలు ఏకగ్రీవం కావడం మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

జడ్పీ వైస్ చైర్మన్‌గా డాక్టర్ తీగల ప్రభ

పార్టీ కోసం ఏళ్ల తరబడి శ్రమించిన నాయకురాలికి దక్కిన అరుదైన గౌరవం

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

రాజకీయాల్లో గెలుపోటములు సహజం అయితే ఓటమి ఎదురైనా వెనకడుగు వేయకుండా నమ్ముకున్న పార్టీ కోసం నిరంతరం కష్టపడితే గుర్తింపు తప్పక లభిస్తుందని డాక్టర్ తీగల ప్రభ రాజకీయ ప్రస్థానం నిరూపిస్తోంది ఎన్నో ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ సాగిన ఆమె ప్రయాణం తాజాగా మరో కీలక మైలురాయిని చేరుకుంది నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా డాక్టర్ తీగల ప్రభ ఎన్నికై ప్రమాణ స్వీకారం చేయడంతో గంగవరం మండలంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి గతంలో గంగవరం మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) బాధ్యతలు నిర్వహించిన తీగల ప్రభ ఆ



తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమి ఎదురైనా రాజకీయంగా నిరాశ చెందలేదు. పదవులు ఉన్నా లేకున్నా పార్టీనే తన కుటుంబంగా భావిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశారు ఆ క్రమంలో జడ్పీటీసీగా ఎన్నికై ఇప్పుడు పోలవరం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం ఆమె రాజకీయ పట్టుదలకు దక్కిన గుర్తింపుగా పలువురు అభిప్రాయపడుతున్నారు ఇదిలా ఉండగా నూతన పోలవరం జిల్లా పరిషత్ చైర్మన్‌గా వందల రాజేశ్వరి ఎంపిక కాగా వైస్ చైర్మన్‌గా డాక్టర్ తీగల ప్రభ ప్రమాణ స్వీకారం చేశారు ఈ పదవులతో జిల్లా పరిషత్ పాలనలో ఇద్దరు కీలక బాధ్యతలు చేపట్టారు ఒకప్పుడు గంగవరం మండల ఎంపీపీగా సేవలందించిన నాయకురాలు ఇప్పుడు నూతన పోలవరం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ స్థాయికి ఎదగడం గంగవరం మండల రాజకీయాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది ఓటమి వచ్చినా ఆగని అడుగులు.. పదవి లేకున్నా తగ్గని పార్టీ సేవ చివరకు ఉన్నత పదవికి చేర్చిన రాజకీయ ప్రయాణం అంటూ ఆమెకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు

మూడు దశాబ్దాల పార్టీ సేవలకు గుర్తింపు.. వైస్ ఎంపీపీగా యడ్ల శ్రీదేవి

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సుమారు 30 ఏళ్లుగా కృషి చేస్తున్న యడ్ల శ్రీను కుటుంబానికి పార్టీ గుర్తింపు కల్పించింది. ఆయన సతీమణి యడ్ల శ్రీదేవికి మండల వైస్ ఎంపీపీ పదవి దక్కింది.యడ్ల శ్రీను 2000 సంవత్సరంలో అడ్డతీగల మండల టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా యడ్ల శ్రీదేవి అడ్డతీగల-2 ఎంపీటీసీగా పోటీ చేసి ప్రజల మద్దతుతో విజయం సాధించారు. తాజాగా పార్టీ నిర్ణయంతో ఆమె వైస్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు.మూడు దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న కుటుంబానికి ఈ పదవి దక్కడం పట్ల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా యడ్ల శ్రీదేవికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వైస్ ఎంపీపీగా మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

రామాపురంలో వైసీపీ జోరు పార్టీలోకి 32 కుటుంబాలు చేరికలు

పెద్దమట్టపల్లి పంచాయతీ రామాపురంలో వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణ



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

పోలవరం జిల్లా వి.ఆర్.పురం మండలం పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో సీపీఎం పార్టీకి చెందిన 32 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో పార్టీలో చేరిన వారికి పార్టీ నాయకులు స్వాగతం పలికారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని కొత్తగా పార్టీలో చేరిన కుటుంబాలు తెలిపాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ పిట్ట రామారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోటంజయరాజు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం, పార్టీ నాయకత్వంపై అభిమానంతో వివిధ పార్టీలకు చెందిన వారు తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రామాపురం గ్రామంలో 32 కుటుంబాలు ఒకేసారి వైఎస్సార్‌సీపీలో చేరడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని, రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని నాయకులు పేర్కొన్నారు. పార్టీలో చేరిన కుటుంబాలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామాపురం గ్రామ పెద్దలు కలుముల రాముడు, లచ్చయ్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గుంపెనపల్లి వీరస్వామి, ఉయక నాగేశ్వరరావు, చిలక హిరమరాజు, పూణే రమేష్, బంధం నాగేశ్వరరావు, ఎడమయ్య, దూలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని

-జిల్లా పంచాయతీ అధికారి జి భాస్కర రావు , డ్వామా పి డి రామ్ ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలనీ జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ హలులో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ వారి ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమం జిల్లా పంచాయతీ అధికారి జి భాస్కర రావు , డ్వామా పి డి రామ్ ప్రసాద్ నిర్వహించారు.ఈ సందర్భంగా డీపీవో జి. భాస్కర రావు మాట్లాడుతూ రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో నియమితులైన మైక్రో అబ్జర్వర్లు తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి అవగాహనతో అప్రమత్తంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతంగా విధుల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఏవైనా సమస్యలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.మైక్రో అబ్జర్వర్లు తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలని ఆయన పేర్కొన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో మైక్రో అబ్సర్వర్స్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధే లక్ష్యం..

సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎంపీపీ గొంది చంద్రయ్య కృతజ్ఞతలు



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండల ఎంపీపీగా ఎన్నికైన గొంది చంద్రయ్యకు సహకరించిన కూటమి నాయకులు, మిత్రపక్ష పార్టీల నాయకులు, మండల ప్రజానీకానికి, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎంపీపీ బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. మండలంలో రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ పథకాల అమలు, గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. మండల అభివృద్ధి కోసం కూటమి నాయకులు, మిత్రపక్ష పార్టీల ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వి.ఆర్.పురం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని గొంది చంద్రయ్య తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, నాయకులు, కార్యకర్తల సహకారంతో తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన సీపీఎం, జనసేన, బీజేపీ నాయకులు, కూటమి నేతలు, మండల ప్రజానీకానికి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

శనివారం, నవంబర్ 21, 2026

12



ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన!

ఎల్ఆర్ఎస్ సందేహాలకు ఓపెన్ ఫోరంలు!

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఏ. రవీంద్రరావు ఆదేశాల మేరకు ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)పై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేసేందుకు శుక్రవారం నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక ఓపెన్ ఫోరంలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ విధానం, దరఖాస్తు ప్రక్రియ, దరఖాస్తుల పరిశీలన, సంబంధిత నిబంధనలు తదితర అంశాలపై అధికారులు ప్రజలకు వివరించారు. ఇప్పటికే ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలు తమ దరఖాస్తులకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి తగిన వివరణలు అందించారు. దరఖాస్తుల స్థితిగతులు, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై కూడా అవగాహన కల్పించారు.నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన ఈ ఓపెన్ ఫోరంలకు సుమారు 70 మంది ప్రజలు హాజరై తమ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శ



ప్రజాభూమి రీజనల్ రిపోర్టర్ కృష్ణా:

మాజీ పార్లమెంటు సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు అనారోగ్య కారణాలతో మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కొనకళ్ల నారాయణరావు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

విక్కుర్తి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ భోగాది రమాదేవి



అవనిగడ్డ, ప్రజాభూమి ప్రతినిధి:

కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన భోగాది రమాదేవి, అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి విక్కుర్తి శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు భోగాది రమాదేవికి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. నూతనంగా జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన ఆమెకు అభినందనలు తెలియజేశారు.అనంతరం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు కూడా భోగాది రమాదేవిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగింది.

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో జనసేనలో చేరికలు

అవనిగడ్డ, ప్రజాభూమి ప్రతినిధి:



అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వల్లభదాసు మారుతీప్రసాద్, మత్తి బుజ్జి, బచ్చు శ్రీనివాసరావుతో పాటు పలువురు జనసేన తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వారికి జనసేన పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి నాయకులు స్వాగతం పలికారు.జనసేన పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీహరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బచ్చు వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్, ఎంపీపీ పండ్రాజు లంకమ్మ ప్రసాద్ తదితరులు నూతనంగా పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

తుది పోటీదారుల జాబితా రూపకల్పనలో ఎలాంటి తప్పులకు తావివ్వకూడదు

అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధిః రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తయిన నేపథ్యంలో, తుది పోటీదారుల జాబితాను అత్యంత జాగ్రత్తగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, డీఎల్‌డీఓలు, మండల ప్రత్యేక అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థుల ఉపసంహరణకు ముందే పోటీదారుల పేర్లు, సీరియల్ నంబర్లను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఖరారు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షరమాల క్రమంలో అమర్చేందుకు తెలుగు పండితుల సహకారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ఒకే పేర్లు ఉన్న అభ్యర్థుల విషయంలో నిబంధనల ప్రకారం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, మాస్టర్ ట్రైనర్లు స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులకు అవసరమైన హ్యాండ్ హోల్డింగ్ అందించాలని, పేర్లు, అక్షర దోషాలు, సీరియల్ నంబర్లలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు సమయం వృథా కాకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తాం

తీర ప్రాంత గ్రామాల్లో తుఫాను షెల్టర్లు, తాగునీటి సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత
కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన భోగాది రమాదేవి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తామని నూతనంగా ఎన్నికైన జడ్పీ చైర్ పర్సన్ భోగాది రమాదేవి తెలిపారు. కృష్ణా జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన భోగాది రమాదేవి శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆమెను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ భోగాది రమాదేవి మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులందరికీ అభినందనలు తెలియజేస్తూ కార్తీక మాస ఏకాదశి, పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు అభివృద్ధికి మద్దతుగా తీర్పునిచ్చారని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా పరిషత్ ద్వారా అభి వృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే విధ్వంసానికి తావులేకుండా అభివృద్ధి దిశగా పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారి కనెక్టివిటీ, భద్రత, శాంతియుత వాతావరణం అభివృద్ధికి కీలకమని తెలిపారు. అంత్యోదయ స్ఫూర్తితో సమాజంలోని అట్టడుగు వర్గాలు, చివరి వ్యక్తి వరకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా జిల్లా పరిషత్ కృషి చేయాలన్నది తమ లక్ష్యమన్నారు. ముఖ్యంగా కృష్ణా జిల్లాలో విస్తారమైన తీర ప్రాంతం ఉన్నందున తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తీర ప్రాంత గ్రామాలు తుపానులు, భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అనేక గ్రామాల్లో తుపాను షెల్టర్లు లేక ప్రజలు దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లి ఆశ్రయం పొందాల్సి వస్తోందన్నారు. ప్రతి తీర ప్రాంత గ్రామంలోనూ తుపాను షెల్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సముద్ర తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఉప్పునీటిగా ఉండటంతో ప్రజలు మంచినీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన తాగునీటి సరఫరా పనులను పూర్తిస్థాయిలో అమలు చేసి, తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని కృషి చేస్తానని జడ్పీ చైర్ పర్సన్ తెలిపారు.జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ దండమూడి పూజిత మాట్లాడుతూ, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారికి నిరంతరం అందుబాటులో ఉంటానని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ భోగాది రమాదేవితో కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.





కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రపరిచిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తరలించాలి

జాయింట్ కలెక్టర్

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి :

కృష్ణా జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. కృష్ణా జిల్లాలో ఖరీఫ్ 2026-27 పంట కాలంలో 4,10,248 ఎకరాల్లో వరి సాగు చేయగా, సుమారు 11,44,921 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసినట్లు తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 293 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. రైతు సేవా కేంద్రాల వద్ద 10,40,331 గోనె సంచులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ధాన్యం రవాణా కోసం 1,426 జీపీఎస్ అమర్చిన వాహనాలను కూడా సమకూర్చినట్లు పేర్కొన్నారు.ధాన్యం సేకరణ, తదనంతర చెల్లింపులకు సంబంధించి 137 రైస్ మిల్లుల నుంచి మొత్తం రూ.168 కోట్ల విలువైన బ్యాంకు గ్యారంటీలను స్వీకరించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,161 మంది రైతుల నుంచి రూ.48.84 కోట్ల విలువైన 19,979 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి రూ.38.73 కోట్ల మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో 24 గంటల్లోనే జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు.ధాన్యం సేకరణ సందర్భంగా రైతులు ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ఆరబెట్టి, పరిశుభ్రత ప్రమాణాలకు అనుగు ణంగా సిద్ధం చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు లేనందున రైతులు తొందరపడకుండా ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాతే విక్రయించాలని తెలిపారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మాత్రమే విక్రయించి, రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందేలా చూడాలని అధికారులకు సూచించారు.రైతులకు ధాన్యం విక్రయంలో ఎటువంటి సమస్యలు, సందేహాలు ఎదురైనా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయమై రైతులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కంట్రోల్ రూమ్ నంబర్: 8247693551.

బియ్యం నిల్వల వివరాలను ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి

నిల్వల వివరాలను ప్రతి శుక్రవారం అప్‌డేట్ చేయాలి
నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు




మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి :

బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా పెరగకుండా నియంత్రించడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా కృష్ణాజిల్లాలో బియ్యం నిల్వలు, విక్రయాల వివరాలను ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి టి. శివరామ ప్రసాద్ సూచించారు.ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో ప్రజ ల'కు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 26 కిలోల బస్తా బియ్యం రూ.1,300కే అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా ఉన్నప్పటికీ వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి ఒక్క కుటుంబానికి ప్రత్యేక ప్యాకింగ్ ద్వారా 26 కిలోల బియ్యం అందించబడుతోందని తెలిపారు. ఇప్పటివరకు 3,676 మంది వినియోగదారులకు కేఎన్ఎం రకం బియ్యం 919.36 క్వింటాళ్లు, బీపీటీ రకం బియ్యం 68.90 క్వింటాళ్లు, మొత్తం 988.26 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఈ నేపథ్యంలో జిల్లాలోని హోల్‌సేల్ వ్యాపారులు, బియ్యం మిల్లర్లు తమ వద్ద ఉన్న బియ్యం, ధాన్యం నిల్వల వివరాలను కేంద్ర ప్రభుత్వ ఫుడ్ స్టాక్ పోర్టల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం తమ వద్ద ఉన్న నిల్వల వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. నిల్వల వివరాలను ఖచ్చితంగా, వాస్తవానికి అనుగుణంగా నమోదు చేయ డంతో పాటు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం ధరలు, నిల్వలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. బియ్యం కొను గోలు, విక్రయాల్లో పారదర్శకత పాటించడంతో పాటు ప్రజల కు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బియ్యం రకాల వారీగా కిలో ధరలు బీపీటీ 3291 (సోనా) రూ.66, బీపీటీ 5204 (సాంబ) రూ.66, కేఎన్ఎం రూ.66, హెచ్ఎంటీ రూ.76, ఆర్ఎన్ఆర్ రూ.76, జై శ్రీరామ్ రూ.82గా ఉన్నట్లు వివరించారు.



రమాదేవికి జడ్పీ చైర్మన్ పదవి రావటం నియోజకవర్గానికి గర్వకారణం

నాగాయలంక మండల ప్రజలు ప్రధాని మోడీ రుణం తీర్చుకున్నారు
రమాదేవి విజయం ప్రధాని మోడీకి అంకితం...అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హర్షం...రమాదేవిని ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృషితోనే జడ్పీ చైర్మన్ పదవి : రమాదేవి
సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ లకు కృతజ్ఞతలు: రమాదేవి

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

బీజేపీ సీనియర్ నాయకురాలు, జడ్పీటీసీ భోగాది రమాదేవికి జడ్పీ చైర్మన్ పదవి రావటం నియోజకవర్గానికి గర్వకారణం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా పరిషత్ చైర్మనుగా ఎంపికైన నాగాయలంక జడ్పీటీసీ సభ్యురాలు భోగాది రమాదేవి శుక్రవారం ఉదయం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజానీకం కూటమికి అంకితమై ఉన్నారన్నారు. కూటమి బలంగా ఉండా లనే ప్రజల ఆకాంక్షలకు ఈ ఎన్నికల విజయాలే ప్రత్యక్ష తార్కాణం అన్నారు. వైసీపీ వినాశకర పాలనను మరోసారి ప్రజలు తిరస్కరించి, కూటమి ప్రభుత్వ అభివృద్ధిని కోరుకుని, ఈ ఎన్నికల్లోను కూటమి నిలబెట్టిన ప్రతి అభ్యర్థిని పార్టీల బలబలాలతో సంబంధం లేకుండా అఖండ మెజారిటీతో గెలిపించారన్నారు. జగన్ అరాచక పాలనను గద్దె దించేందుకు, రాష్ట్రానికి వెలుగులు ఇచ్చేందుకు నాడు చంద్రబాబు అరెస్ట్ సమయంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జైలులో చంద్రబాబును పరామర్శించి కూటమి ఏర్పాటును ప్రకటించడంతోపాటు, నరేంద్ర మోడీ, అమిత్ షా, జేపీ నడ్డాలను ఒప్పించి కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించారన్నారు. తద్వారా వైసీపీ పాలనకు అప్పులకుప్పగా మారిన రాష్ట్రాన్ని సేద తీర్చేందుకు పవన్ కళ్యాణ్ కేంద్ర నిధులు సాధించి రహదారుల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. అంతేకాకుండా రాష్ట్ర రాజధాని అమరావతి, రాష్ట్ర జీవనాడి పోలవరం నిర్మాణానికి కేంద్రం నిధులు సమకూర్చుతోందన్నారు. ప్రధానంగా అవనిగడ్డ నియోజకవర్గంలో కీలకమైన గుల్లల మోద క్షిపణి పరీక్ష కేంద్రం ఏర్పాటుకు నాటి వైసీపీ ప్రభుత్వం సహకరించకపోయినప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తిరిగి పట్టాలు ఎక్కించటంతో సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి వచ్చి వేలకోట్ల నిధులు మంజూరు చేసి తొలి విడత పనులకు శ్రీకారం చుట్టార న్నారు. నాగాయలంక మండలంతో పాటు దివిసీమ రూపురేఖలు మార్చే ఈ ప్రాజెక్టు మంజూరు చేసిన నరేంద్ర మోడీకి నాగాయలంక మండల ప్రజలు భోగాది రమాదేవి గెలుపును అంకితం చేశారన్నారు. తద్వారా దివిసీమ ప్రజలు కృతజ్ఞతా భావానికి బద్ధులై ఉంటారని మరోసారి నిరూపించారన్నారు. నాగాయలంక జడ్పిటిసి రమాదేవికి జిల్లా పరిషత్ అధ్యక్ష పదవి అప్పగించడం ఒక చరిత్రగా నిలిచిపోతుందన్నారు. అమెకు రాష్ట్ర కూటమి నాయకత్వం సముచిత ప్రాముఖ్యత ఇవ్వటం గర్వదాయకం అన్నారు. ప్రజలు కూటమిని కోరుకుంటున్న నేపథ్యంలో కూటమిలోని అన్ని పార్టీలకు సమాన ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీల బలాబలాలతో నిమిత్తం లేకుండా, కూటమిలోని అన్ని పార్టీలకు సమ ప్రాధాన్యతనిస్తూ, గుర్తింపునిస్తూ, వారి సేవలను అందిపుచ్చుకోవటం ద్వారా రాష్ట్ర ప్రగతికి బాటలు వేయటం మహోన్నత నిర్ణయం అన్నారు. పార్టీలో అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుంది అనేందుకు రమాదేవి ఎంపిక ఒక ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. పదవులు కోరుకోవటం తప్పు కాదని, పదవి రాకపోతే ఇక జీవితం అయిపోయిందని అనుకోకుండా సంయమనంతో వ్యవహరించాలన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన రమా దేవికి అఖండ విజయంతో పాటు జడ్పీ చైర్మన్ పదవి కూడా వరించడం ఇందుకు నిదర్శనం అన్నారు. దివిసీమ ఉప్పెన అనంతరం గ్రామాల పునర్నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు తరలివచ్చిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు ఆతిథ్యం ఏర్పాటు చేసిన రమాదేవి కుటుంబానికి ప్రజల హృదయాల్లో స్థానం ఉందని చెప్పేందుకు ఆమె విజయం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సామ్యు రాలు, వివాద రహితురాలు, పరిపాలన అనుభవం కలిగిన రమాదేవి కృష్ణాజిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతారనే విశ్వాసం వ్యక్తం చేశారు.జిల్లా పరిషత్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టనున్న భోగాది రమాదేవి మాట్లాడుతూ తనకు జడ్పిటిసి పదవి, జిల్లా పరిషత్ చైర్మన్ పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కు ధన్యవాదములు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి నాగాయలంక మండల ప్రజలు తనను గెలిపించారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వంపై విశ్వాసంతో తనను గెలిపించారన్నారు. జిల్లా పరిషత్ చైర్మనుగా తన తొలి ప్రాధాన్యత అవనిగడ్డ నియోజకవర్గానికి ఇస్తానని ప్రకటించారు. తనకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ లకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, అవనిగడ్డ, కోడూరు ఎంపీపీలు పండ్రాజు లంకమ్మ ప్రసాద్, రెడ్రౌతు కృష్ణబాబు, ఘంటసాల, మోపిదేవి జడ్పీటీసీలు దోవారి పవిత్ర, మురాల సీతమ్మ, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, కూటమి నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677

ప్రజాభూమి

జనరల్ 13

శనివారం 21 నవంబరు 2026

డిజిటల్ విధానంలో ఎరువుల కొనుగోలు.. రైతులకు ప్రయోజనకరం

-మండల వ్యవసాయాధికారి సీహెచ్. శివ శ్రీనివాస్





ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ డిజిటల్ ఎరువుల విక్రయ విధానం రైతుల కు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్. శివ శ్రీనివాస్ తెలిపారు.ఈ విధానం ద్వారా రైతులు తమకు అవసరమైన ఎరువులను ముందుగానే మొబైల్ యాప్‌లో బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఇందుకోసం రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఖీఖీూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏపీ ఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ నంబర్ లేదా ఆధార్ ఆధారంగా తమ భూములు, సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసి మ్యాపింగ్ చేసుకోవాలన్నారు.వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు పంటకు అవసరమైన ఎరువులను యాప్‌లో ఎంపిక చేసుకుని క్యూఆర్ కోడ్ ద్వారా ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. బుకింగ్ పూర్తయిన తర్వాత వచ్చే క్యూఆర్ కోడ్‌ను సంబంధిత అధీకృత ఎరువుల డీలర్‌కు చూపించి ఎరువులు కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు.ఈ డిజిటల్ విధానం వల్ల రైతులకు ఎరువుల కొనుగోలులో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ఈ విధానంపై మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మం డల వ్యవసాయాధికారి సూచించారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో విజయసాధన హైస్కూల్ విద్యార్థికి వెండి పతకం..



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం..

రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో రజత పతకంతో మెరిసిన విజయసాధన హైస్కూల్ విద్యార్థి గన్నవరం, నవంబర్:ఈ నెల 14, 15 తేదీలలో గన్నవరంలోని శ్రీ మల్లికార్జున హైస్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్-జూనియర్ జూడో పోటీలలో విజయసాధన హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ పోటీలలో పాఠశాలకు చెందిన కట్టం తేజ అభినవ్ (-55 కేజీల విభాగం) మరియు శీరపు నిత్యవర్ధన్ రెడ్డి (+66 కేజీల విభాగం) పాల్గొన్నారు. వీరిలో +66 కేజీల విభాగంలో పోటీపడిన శీరపు నిత్యవర్ధన్ రెడ్డి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి వెండి పతకం (సిల్వర్ మెడల్) సాధించాడు.రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న ఇద్దరు క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డి. రజిని ప్రధానోపాధ్యాయురాలు .రమాదేవి మాట్లాడుతూ.. నిత్యవర్ధన్ రెడ్డి తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయిలో పతకం సాధించడం పట్ల ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ పి. నాని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొని విజేతను అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం.. బచ్చల అక్కమ్మ

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



అడ్డతీగల మండలం డి. భీమవరం పంచాయతీ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బచ్చల అక్కమ్మ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు.గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధిలైట్ల ఏర్పాటు వంటి పనులకు ప్రాధా న్యత ఇస్తానని తెలిపారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు.అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బచ్చల అక్కమ్మ వెల్లడించారు.

పోలవరం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా వంతల రాజేశ్వరి..

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



అడ్డతీగల జడ్పీటీసీగా ఎన్నికైన వంతల రాజేశ్వరి పేరును తెలుగుదేశం పార్టీ పోలవరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి ఖరారు చేయడంతో అడ్డతీగల మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.తమ మండలానికి చెందిన వంతల రాజేశ్వరి పోలవరం జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో ఆనందంగా ఉం దని కూటమి నాయకులు తెలిపారు. అడ్డతీగల మండలానికి ఈ పదవి రావడం ప్రత్యేక గుర్తిం పుగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండల ప్రజలు నూతన జడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అడ్డతీగల మండలంతో పాటు పోలవరం జిల్లాలోని అన్ని మండలాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

గంగవరం ఎంపీపీగా బొగ్గుల రాజమ్మ..

వైస్ ఎంపీపీగా టీడీపీ రెబల్ అభ్యర్థి వినయ్ మాధవరెడ్డి

ఏడుగురు ఎంపీటీసీలకు గాను నలుగురి హాజరు.. పూర్తయిన అధ్యక్ష ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియ







ప్రజా భూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరిత రాజకీయ పరిణామాల మధ్య పూర్తయ్యాయి మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నిక ల్లో మోహనాపురం టీడీపీ ఎంపీటీసీ సభ్యు రాలు బొగ్గుల రాజమ్మ ఎంపీపీగా, మర్రిపాలెం టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేసిన తూరోతు వినయ్ మాధవరెడ్డి వైస్ ఎంపీపీగా ఎన్నిక య్యారు వాస్తవానికి గురువారమే జరగాల్సిన ఎంపీపీ,వైస్ ఎంపీపీ ఎన్నికలకు ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో ఎన్నికల ప్రక్రియను శుక్రవారానికి వాయిదా వేశారు ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు ఉదయం 11 గంటలకు ఆముదాలబంద బీజేపీ ఎంపీటీసీ సభ్యురాలు లోత సత్యవతి,11.30 గంటల సమయంలో మోహనాపురం టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు బొగ్గుల రాజమ్మ,సూరంపాలెం టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు గంగాభవాని, మర్రిపాలెం టీడీపీ రెబల్ అభ్యర్థి తూరోతు వినయ్ మాధవరెడ్డి సమావేశానికి హాజరయ్యా రు మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉండగా నలుగురు సభ్యులు సమావే శానికి హాజరు కావడంతో కోరం పూర్త యింది దీంతో ఎన్నికల అధికారి ఎన్నికల ప్రక్రియను కొనసాగించారు ఎంపీపీగా బొగ్గుల రాజమ్మ, వైస్ ఎంపీపీగా తూరోతు వినయ్ మాధవరెడ్డి ఎన్నికైనట్లు ప్రకటించి,వారితో ఎన్నికల అధికారి ఈశ్వరమ్మ ప్రమాణ స్వీకా రం చేయించారు ఎన్నికల నేపథ్యంలో ఎలాం టి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా రంపచోడవరం డీఎస్పీ పి.అష్రఫ్ అలీ,అడ్డతీగల సీఐ ఎం.గజేంద్ర కుమార్ పర్యవేక్షణలో గంగవరం ఎస్సై ఎస్.వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారులు,ఎంపీడీవో వై.లక్ష్మణరావు,తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ ఎన్నికల బరిలో

వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు.. నామినేషన్ల జోరు!

- రామవరం, శ్రీరామగిరి, చిన్నమట్టపల్లి పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు
- శ్రీరామగిరిలో సర్పంచ్ అభ్యర్థితో పాటు 8 మంది వార్డు సభ్యుల నామినేషన్లు





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలో పంచాయతీ ఎన్నికల సందడి ఊపందుకుంది. గ్రామాల్లో రాజకీయ వాతావ రణం వేడెక్కుతుండగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచేందుకు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ క్రమంలో రామవరం, శ్రీరామగిరి, చిన్నమ ట్టపల్లి గ్రామపంచాయతీలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్లను శు క్రవారం సమర్పించారు. రామవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మడకం జ్యోతి నామినేషన్ దాఖలు చేశారు. శ్రీరామగిరి గ్రామపంచాయతీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా కొండ్ల రవలి నామినేషన్ సమర్పించగా, ఆమెతో పాటు ఎనిమిది మంది వార్డు సభ్యుల అభ్యర్థులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే చిన్నమట్టపల్లి గ్రామపంచాయతీ వైఎస్సార్‌సీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా వేట్టి లక్ష్మి నామినేషన్ వేశారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం శ్రీరామగిరి గ్రామపంచాయతీ ఎంపీటీసీ సోడి చిరంజీవి, పంచాయతీ కార్యకర్తలు, పార్టీ నాయకులు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాదిరెడ్డి సత్తిబాబు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, గ్రామాల్లో పార్టీ అభ్యర్థుల విజయావకాశాలు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగుతూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. నామినేషన్ల దాఖలుతో ఆయా గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది. రానున్న రోజుల్లో ప్రచార కార్యక్రమాలు మరింత ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది.

గత అనుభవంతో ప్రజల్లోకి పెద్దిరాజు.. ప్రచారంలో టీడీపీ శ్రేణుల ఉత్సాహం

సర్పంచ్ అభ్యర్థిగా ఇంటింటి ప్రచారం.. మరోసారి అవకాశం కోరుతున్న గొల్లపూడి





ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి పంచాయతీ ఎన్నికల ప్రచారం లో టీడీపీ అభ్యర్థి గొల్లపూడి పెద్దిరాజు ప్రజల తో మమేకమవుతూ ముందుకు సాగుతు న్నారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన అనుభ వాన్ని ప్రస్తావిస్తూ మరోసారి తనకు అవకాశం కల్పించాలని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. స్థానికంగా ప్రజలతో ఉన్న పరిచయం, గ్రామస్థాయి సమస్యలపై అవగాహనను ప్రచారంలో వివరిస్తున్నారు. గతంలో టీడీపీ తరఫున సర్పంచ్‌గా విజయం సాధించి బాధ్యతలు నిర్వహించిన పెద్దిరాజు, ప్రస్తుతం అదే పార్టీ అభ్యర్థిగా మరోసారి ఎన్ని కల బరిలో నిలిచారు. గ్రామాల్లో రహదా రులు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, శ్మశానవాటికలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సర్పంచ్‌గా పనిచేసే



వ్యక్తికి స్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరాన్ని వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతు న్నారు.స్థానికంగా పలువురికి సుపరిచితుడైన పెద్దిరాజు ప్రచారంలో ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరోవైపు టీడీపీ కార్యకర్తలు కూడా ఆయనకు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. అభ్యర్థి అనుభవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో హామీలు చెప్పడం ఒక ఎత్తయితే, ప్రజల అవసరాలను అర్థం చేసుకుని అందుబాటులో ఉండటం మరో ఎత్తు. అభ్యర్థుల గత అనుభవం, భవిష్యత్తు కార్యాచరణను పరిశీలించి ఓటర్లు తమ నిర్ణయం తీసుకోనున్నారు. పెద్దిరాజు ప్రచారానికి ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుందన్నది ఎన్నికల ఫలితాల్లో తేలనుంది.

గంగవరం ఎంపీపీ ఎన్నికల్లో కూటమి కుమ్ములాట

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక కూటమి పార్టీల మధ్య అంతర్గత విభేదాలను బహిర్గతం చేసింది. ముందుగా కుదిరిన సీట్ల సర్దుబాటు ప్రకారం ఎంపీపీ పదవిని బీజేపీకి కేటాయించినట్లు ప్రచారం జరిగినప్పటికీ, ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థిని బరిలోకి దింపడంతో వివాదం రాజుకుంది. కూటమి ధర్మానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ బీజేపీ ఎంపీటీసీ సభ్యురాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎన్నికల కేంద్రం వద్ద కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు బీజేపీకి దక్కాల్సినట్లు భావించిన ఎంపీపీ పదవి టీడీపీ ఖాతాలోకి వెళ్లడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

వాయిదా పడిన ఎన్నికలు.. శుక్రవారం ఉత్కంఠ


గురువారం గంగవరం మండలంలో ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్ర మం నిర్వహించారు. అయితే అనివార్య కారణాలతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో శుక్రవారం ఎన్నికల అధికారులు తిరిగి ఎన్నికల ప్రక్రియ ను ప్రారంభించారు. ఈ క్రమంలో కూటమి పార్టీల మధ్య నెలకొన్న విభేదాలు బయటపడ్డాయి.

ఏడు స్థానాల్లో భిన్నమైన రాజకీయ బలాబలాలు

గంగవరం మండల పరిషత్‌లో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వైఎస్సార్‌సీపీ మూడు, టీడీపీ రెండు, బీజేపీ ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానంలో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో టీడీపీ, బీజేపీ మధ్య ముందు గా జరిగిన సీట్ల సర్దుబాటులో ఎంపీపీ పదవిని బీజేపీకి కేటాయించినట్లు సమాచారం. అయి తే ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న పరి ణామాలు ఈ అవగాహనపై ప్రశ్నలు లేవనెత్తాయి.

బీజేపీ అభ్యంతరం.. టీడీపీ అభ్యర్థి ప్రతిపాదనతో వివాదం

ఎంపీపీ ఎన్నికల సందర్భంగా టీడీపీ ఎంపీటీ సీ సభ్యులు తమ పార్టీకి చెందిన బొగ్గుల రాజమ్మ పేరును అధ్యక్ష పదవికి ప్రతిపా దించారు దీంతో బీజేపీ ఎంపీటీసీ సభ్యురాలు లోత సత్యవతి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది ముందుగా బీజేపీకి కేటాయించిన పదవికి టీడీపీ అభ్యర్థిని ఎలా ప్రతిపాదిస్తారని ఆమె ప్రశ్నించడంతో ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది ఈ పరిణామంతో కూటమి పార్టీల మధ్య ఉన్న



అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి సర్దు బాటుకు ప్రయత్నం పోలీసుల అప్రమత్తత వివాదాన్ని సద్దుమణిగించేందుకు ఎస్టీ కమిష నర్ సొల్ల బొజ్జి రెడ్డి అక్కడికి వచ్చినప్పటికీ వాగ్వాదం కొనసాగినట్లు సమాచారం.పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా సీఐ ఎం.గజేంద్ర కుమార్,ఎస్సై ఎస్.వెంకయ్య పోలీసు సిబ్బంది తో రంగంలోకి దిగారు.

ఎన్నికల కేంద్రం వద్ద మూడు ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి తనిఖీల అనంతరం ఎంపీటీసీ సభ్యులను మాత్రమే లోపలికి అనుమతించారు పోలీసుల అప్రమత్తతతో ఎలాంటి ఘర్షణలు చోటుచేసు కోకుండా ఎన్నికల ప్రక్రియ ముగిసింది ఎంపీపీగా బొగ్గుల రాజమ్మ, వైస్ ఎంపీపీగా వినయ్ మాధవరెడ్డి ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం మోహనాపురం టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు బొగ్గుల రాజమ్మ మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యా రు. మర్రిపాలెం ఎంపీటీసీ సభ్యుడు టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేసిన తూరోతు వినయ్ మాధవరెడ్డి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు ఎన్నికల అధికారి ఈశ్వరమ్మ వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు

కూటమి ధర్మం మాటల్లోనేనా?

ఎన్నికలకు ముందు కుదిరిన సీట్ల సర్దుబాటు పరస్పర అవగాహన ఎన్నికల సమయంలో ఎందుకు అమలుకాలేదన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి బీజేపీకి కేటాయించినట్లు సమాచారం ఉన్న ఎంపీపీ పదవికి చివరకు టీడీపీ అభ్యర్థి ఎన్నిక కావడం కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టం చేస్తోందనే చర్చ సాగుతోంది అధికారాన్ని పంచుకునే విషయంలోనే విభేదాలు బయటపడితే,భవిష్యత్తులో కూటమి పార్టీల మధ్య రాజకీయ సమన్వయం ఎలా ఉంటుందన్న ఆసక్తి స్థానికంగా నెలకొంది

ప్రజాభూమి
జనరల్ 14
శనివారం 21 నవంబర్ 2026


కుక్కునూరు మండల ఉద్యోగులకు

పక్క మండలాల్లోనే ఎన్నికల విధులు కేటాయించాలి

- మహిళా ఉద్యోగులకు పనిచేస్తున్న మండలంలోనే విధులు వేయాలి

ప్రజాభూమి కుకునూరు

నవంబర్ 26 గ్రామపంచాయతీ ఎన్నికల్లో కుక్కునూరు మండలంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సమీప మండలాల్లోనే ఎన్నికల విధులు కేటాయించాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కుక్కునూరు మండల ఉద్యోగులకు సుమారు 150 కిలోమీటర్ల దూరంలోని పోలవరం మండలంలో విధులు కేటాయించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. జిల్లాలోని ఇతర మండలాల



ఉద్యోగులకు సమీప మండలాల్లో విధులు కేటాయించి, కుక్కునూరు ఉద్యోగులకు మాత్రం రెండు మూడు మండలాలు దాటి సుదూర ప్రాంతాల్లో విధులు వేయడం వల్ల ముఖ్యంగా మహిళా ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారని అన్నారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో అంగన్వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులందరికీ కుక్కునూరు మండలానికి సమీపంలోని పక్క మండలాల్లోనే ఎన్నికల విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు వారు పనిచేస్తున్న మండలంలోనే విధులు కేటాయించాలని కోరారు.అనారోగ్య సమస్యలు, వైద్యపరమైన ఇబ్బందులు, ఇతర అనివార్య కారణాలతో ఎన్నికల విధులు నిర్వహించలేని ఉద్యోగులకు సైతం పీఓ, ఏపీఓ వంటి బాధ్యతలు కేటాయించడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అటువంటి ఉద్యోగులకు కేటాయించిన విధులను వెంటనే తొలగించి, వారి పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఇబ్బందులను పట్టించుకోకుండా సుదూర ప్రాంతాల్లో విధులు కేటాయించడం సరైన పద్ధతి కాదని, గత ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు పోచవరపు వెంకటేశ్వర్లు, చందు, మధు, పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడి, గుడితో పాటు గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి

- ఎఎంసి వైస్ చైర్మన్ కొండేపాటి రామకృష్ణ



ప్రజాభూమి, బుట్టాయగూడెం

ప్రతి గ్రామంలో బడి, గుడితో పాటు గ్రంథాలయాల ఏర్పాటుతో జ్ఞానవంతమైన సమాజాన్ని రూపొందించగలమని పోలవరం మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ కొండేపాటి రామకృష్ణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు గ్రంథాలయ అధికారి మడివి భీమరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు బాల్యం నుంచే గ్రంథ పఠనం చేయడం ద్వారా విషయపరిజ్ఞానాన్ని, జ్ఞానాన్ని పొందగలరని తెలిపారు తల్లిదండ్రులు విద్యార్థులను వార్తాపత్రికలు చదివే విధంగా ప్రోత్సహించాలని, తద్వారా సమకాలీన, సామాజిక పరిస్థితులపై అవగాహన పొందగలరని చెప్పారు. జ్ఞానవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి గ్రామంలో బడి, గుడితో పాటు గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు కావలసిన మెటీరియల్ తో పాటు శిక్షణా కార్యక్రమాలను కూడా గ్రంథాలయాల ద్వారా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీడర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు అనంతాత్మకుల రవిబాబు, బిజెపి మండల అధ్యక్షుడు కోసూరి నరేష్, బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా నాయకుడు గూట్ల ధర్మరాజు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వెలగా మాధవరావు, మసీదు అధ్యక్షుడు ఇమామ్, నందిన సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ భవిష్యత్తు ఉన్నతికి తోడ్పడుతుంది

- విద్యార్థులు కృషితో చదివి ఉన్నత స్థానాలను సాధించాలి : ఎక్సైజ్ సీఐ నరసింహారావు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

విద్యార్థుల్లోని ప్రతిభ భవిష్యత్తు ఉన్నతికి ఎంతగానో తోడ్పడుతుందని, పట్టుదలతో కృషి చేసి చదువుకుంటే ఉన్నత స్థానాలను సాధించవచ్చని కొత్తపేట ఎక్సైజ్ సీఐ ఆర్.వి.ఎల్. నరసింహారావు అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ శుక్రవారం కొత్తపేట ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకురాలు కుంచే సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్రాంత లైబ్రేరియన్ చామకూర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ సీఐ నరసింహారావు, ఎక్సైజ్ ఎస్సై జి. అభిన చంద్రిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతిభ ఎవరి సొత్తు కాదని, నిరంతర కృషి, పట్టుదలతో ఎవరైనా ప్రతిభను పెంపొందించుకుని విజయాలను సాధించవచ్చన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై అభిన చంద్రిక అన్నారు. పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు సీఐ నరసింహారావు నగదు బహుమతులు అందించారు. ముఖ్య అతిథులతో పాటు సీనియర్ పాఠకుడు ఏడిద సత్తిరాజును గ్రంథ పాలకురాలు కుంచే సునీత దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

24 గంటల్లోనే దొంగ దొరికాడు!

- ఇంటి దొంగతనం కేసును ఛేదించిన అనకాపల్లి టౌన్ పోలీసులు.. 40.590 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజా భూమి ప్రతినిధి:-అనకాపల్లి పట్టణం

ఇంటి దొంగతనం కేసులో అనకాపల్లి టౌన్ పోలీసులు మెరుపు వేగంతో స్పందించారు. ఫిర్యాదు అందిన కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించి, పాత నేర చరిత్ర కలిగిన నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన 40.590 గ్రాముల బంగారు ఆభరణాలను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ జి. ప్రేమ్ కుమార్ పర్యవేక్షణలో పోలీసులు ఈ కేసును విజయవంతంగా ఛేదించారు.

ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం చోరీ

అనకాపల్లి పట్టణంలోని శారదా నగర్ కాలనీ 15వ వీధికి చెందిన మొహమ్మద్ యాసుఫ్ ఇస్మాయిల్ ఈ నెల 14న ఇంటికి తాళం వేసి పండుగ నిమిత్తం నర్సీపట్నం సమీపంలోని కోటవురట్ల గ్రామానికి వెళ్లారు. తిరిగి నవంబర్ 19న ఇంటికి చేరుకోగా, ఇంటి తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలోని బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనకాపల్లి టౌన్ పోలీసులు నేరం నంబరు 212/2026, భారతీయ న్యాయ సంహిత 305(ఎ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్

టౌన్ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారాల సహాయంతో వేగంగా దర్యాప్తు నిర్వహించారు. ఈ క్రమంలో నవంబర్ 20న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అనకాపల్లి పట్టణంలోని పూడిమడక బైపాస్ జంక్షన్ సర్వీస్ రోడ్డు వద్ద నిందితుడు కోన రాకేష్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. విచారణలో నేరానికి సంబంధించిన వివరాలు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానంలో



హాజరుపరిచారు.

నిందితుడి వివరాలు

కోన రాకేష్ (23), తండ్రి లేటు శ్రీరాములు. వృత్తి క్యాటరింగ్ పని. అనకాపల్లి పట్టణంలోని శారదా నగర్ కాలనీ 10వ వీధిలో నివాసం ఉంటున్నాడు.

గతంలోనూ మూడు దొంగతనం కేసులు

నిందితుడు కోన రాకేష్‌పై గతంలో అనకాపల్లి టౌన్, ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు దొంగతనం కేసులు, మునగపాక పోలీస్ స్టేషన్ పరిధిలో మరో దొంగతనం కేసు నమోదయ్యాయని పోలీసులు వెల్లడించారు. ఆయా కేసుల్లో గతంలోనే అరెస్టయినట్లు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

– 31.330 గ్రాముల బరువున్న రెండు పేటల బంగారు గొలుసు. – 6.050 గ్రాముల బరువున్న ఒక జత బంగారు చెవి దిద్దులు. – 3.190 గ్రాముల బరువున్న ఒక బంగారు ఉంగరం.మొత్తం 40.590 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసు సిబ్బందికి ఉన్నతాధికారుల అభినందనలు

కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించి, నిందితుడిని అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావుతో పాటు సిబ్బంది పీసీ–2178 ఎం. సముద్రం, పీసీ–2291 ఆర్.పి. నాయుడు, పీసీ–2342 టి.ఎస్. నాయుడులను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

ఉపసంహరణలకు ముందే వేడెక్కిన పంచాయతీ ఎన్నికల ప్రచారం

- 11 గ్రామ పంచాయతీల్లో హోరాహోరీ పోరు.. కూటమిలోనూ రెబల్స్ బెడద
- ఏకగ్రీవాల కోసం నాయకుల ప్రయత్నాలు.. బుజ్జగింపులు, మధ్యవర్తిత్వాలు ముమ్మరం

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియక ముందే ఎన్నికల ప్రచారం వేడెక్కింది. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో కలిసి పనిచేసిన కూటమి పార్టీల్లోనే రెబల్ అభ్యర్థులు రంగంలోకి దిగడం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. అభ్యర్థుల సంఖ్యను తగ్గించేందుకు ప్రధాన పార్టీల నాయకులు రంగంలోకి దిగారు. మధ్యవర్తిత్వాలు, బుజ్జగింపుల ద్వారా పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమైన చోట్ల ఏకగ్రీవ ఎన్నికలకు మార్గం సుగమం చేసేందుకు నాయకులు పావులు కదుపుతున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో బుజ్జగింపులు ఫలించకపోవడంతో రాజకీయ ఒత్తిళ్లు, పరస్పర ఆరోపణలు కూడా తెరపైకి వస్తున్నాయి. జనసేన, వైసీపీ, టీడీపీ పార్టీలకు చెందిన నాయకులు తమకు అనుకూలమైన అభ్యర్థులను బరిలో నిలిపి గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఒకే పార్టీకి చెందిన అభ్యర్థులు పరస్పరం పోటీ పడుతుండటంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. మలకపల్లిలో ద్విముఖ పోటీ ఉండే అవకాశం ఉండగా, పెద్దేవంలో ముగ్గురికి పైగా అభ్యర్థులు బరిలో నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. మండల కేంద్రం తాళ్లపూడిలో సుమారు పది మంది పోటీలో ఉండగా, ప్రక్కిలంకలో ముగ్గురు మధ్య ప్రధాన పోటీ నెలకొనే అవకాశం ఉంది. గజ్జరంలో ఇద్దరు, తాడిపూడిలో ఇద్దరు, పోచవరంలో ముగ్గురు, అన్నదేవరపేటలో ఇద్దరు, తిరుగుడుమెట్టలో ఇద్దరు, వేగేశ్వరపురంలో ఇద్దరు, బల్లిపాడులో ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో మిగిలే అభ్యర్థుల సంఖ్యపై ఎన్నికల పోరు మరింత స్పష్టత రానుంది. అప్పటివరకు గ్రామాల్లో రాజకీయ ఉత్కంఠ కొనసాగనుంది.

చింతమనేని సాయి నవ్యశ్రీ ఏలూరు జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక

- వైస్ చైర్‌పర్సన్‌గా చలమయ్య బొర్రా బాధ్యతల స్వీకరణ

ప్రజాభూమి ఏలూరు

జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా చింతమనేని సాయి నవ్యశ్రీ, వైస్ చైర్‌పర్సన్‌గా చలమయ్య బొర్రా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు.ముందుగా జిల్లాలోని 27 మంది జడ్పీటీసీలు ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం చైర్‌పర్సన్ పదవికి చింతమనేని సాయి నవ్యశ్రీ పేరును ద్వారకాతిరుమల జడ్పీటీసీ సత్య శ్రావణి ప్రతిపాదించగా, కామవరపుకోట జడ్పీటీసీ జాహ్నవి మందలపు బలపరిచారు.మరో ప్రతిపాదన లేకపోవడంతో ఆమె ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు.వైస్ చైర్‌పర్సన్‌గా చలమయ్య బొర్రా పేరును జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ గొల్లమండల సంకీర్తన ప్రతిపాదించగా, టి.



నర్సాపురం జడ్పీటీసీ కూరపాటి సుజాత బలపరిచారు.ఆయన కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం కలెక్టర్ నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లకు ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, డాక్టర్



కామినేని శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జి. వెంకటనాయుడు, డిప్యూటీ సీఈఓ భీమేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాజులూరు కూటమి అభ్యర్థిగా యాళ్ళ వెంకటరమణ నామినేషన్

- మంత్రి వాశంశెట్టి సుభాష్ హాజరు

ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు.

మండల కేంద్రమైన కాజులూరు గ్రామ పంచాయతీ కూటమి అభ్యర్థిగా జనసేన నాయకులు మాజీ సోసైటి అధ్యక్షులు యాళ్ళ వెంకటరమణ కాజులూరు పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసారు.ఈ మేరకు శుక్రవారం ఆయన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాశంశెట్టి సుభాష్,తన అనుచరులతో కలిసి వెళ్ళి తన నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు,సలాది నానాజి, మాజీ ఎంపిటిసి సభ్యులు యాళ్ళ కాసులు,యాళ్ళ రవి, నీటి సంఘం అధ్యక్షులు ,కూటమి నాయకులు, జనసైనికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలతోనే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల వికాసం

- ముస్తాబాద సెయింట్ జోసెఫ్ పాఠశాలలో తొలి క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

ప్రజా భూమి గన్నవరం

విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎస్సై కె. శ్రీధర్ సూచించారు. ముస్తాబాద గ్రామంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శుక్రవారం తొలి క్రీడా దినోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ సిస్టర్ నిషా అధ్యక్షతన ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై కె. శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల కవాతు క్రమశిక్షణతో సాగి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనడం ద్వారా విద్యార్థులకు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదల, నాయకత్వ



లక్షణాలు అలవడతాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు, అతిథులను విశేషంగా అలరించాయి. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని



తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠశాలలో తొలిసారిగా క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ బ్రదర్ జోసెఫ్ కాకాడ, బ్రదర్ బాలశౌరి, కరస్పాండెంట్ లిల్లీ, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
జనరల్ 15
శనివారం 21 నవంబర్ 2026

ప్రభుత్వం న్యాయం చేయాలి : పరిహారం వెంటనే అందించాలి

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



తాళ్లపూడి మండలం పోచవరం పంచాయతీ శివారు గ్రామమైన తుపాకులగూడెం రెవెన్యూ పరిధిలోని 49/2పి సర్వే నంబరులో ఉన్న తమ పట్టా భూములను కొత్త పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం సేకరిస్తామని ప్రకటించినప్పటికీ, నేటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడంతో భూముల యజమానులు, వ్యవసాయ కూలీలు అయోమయానికి గురవుతున్నారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా తమ భూములను ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించడంతో వ్యవసాయ పనులు, భవిష్యత్తుపై స్పష్టత లేకుండా పోయిందని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలను కోరడంతో, క్రాప్ లోన్ కోసం ఇప్పటికే బ్యాంకుల్లో తనఖాలో ఉన్న పాసుపుస్తకాలను బాధితులు అధిక వడ్డీకి అప్పులు చేసి విడిపించుకున్నట్లు తెలిపారు. నెలకు నూటికి ఐదు రూపాయల వడ్డీ చొప్పున అప్పులు చేయాల్సి వచ్చిందని, భూసేకరణలో జాప్యం కారణంగా అప్పులపై వడ్డీ భారం రోజురోజుకూ పెరుగుతోందని వాపోతున్నారు. ప్రభుత్వం పరిశ్రమల కోసం తమ భూములను తీసుకుంటున్న నేపథ్యంలో తమకు రావాల్సిన నష్టపరిహారాన్ని వెంటనే అందించి ఆదుకోవాలని బాధిత పట్టాదారులు కోరుతున్నారు. అధికారులు తమ సమస్యపై దయతో స్పందించి భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ విషయంపై తహసీల్దార్ లక్ష్మీ లావణ్య వివరణ ఇస్తూ, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలి విడతలో తుపాకులగూడెం గ్రామంలో 36 ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ 36 ఎకరాల్లో పట్టా భూములు కూడా ఉన్నాయని, అయితే భూసేకరణ ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదని స్పష్టం చేశారు. భూసేకరణ పూర్తి అయిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

వైస్ చైర్మన్‌గా బొర్రాచలమయ్య

- ఏజెన్సీ మండలాలు వైసిపివైపు
- వైభవంగా జడ్పిటిసిల ప్రమాణ స్వీకారం

రీజనల్ బ్యూరో ప్రజాభూమి



జిల్లాపునర్విభజన తరువాత తొలిగా ఏలూరు జిల్లా పరిషత్ కొలువుతీరింది. నిర్ణీతసమయానికంటే అరగంట ఆలస్యంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏజెన్సీ మండలాలనుండి 3మండలాల్లో వైఎస్సార్ సిపి అభ్యర్థులు జడ్పిటిసిలుగా ఎన్నిక కావడంతో వారు ప్రమాణస్వీకారం చేశారు. ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏలూరు జిల్లాలో జడ్పీటీసీ లుగా ఎన్నికైన జడ్పీటీసీ లతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రమాణ స్వీకారం చేయించారు. అక్షర క్రమంలో వరుసగా జడ్పీటీసీ లను వేదికపైకి పిలిచి ఎన్నికల సంఘం నిబంధనలననుసరించి జడ్పీటీసీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. మండవల్లి మండలం నుండి కాట్రగడ్డ శంకర్ రావు జెడ్పిటిసిగా(టిడిపి) ప్రమాణస్వీకారం చేశారు. వేలేరుపాడు మండలం నుండి కుమారి కుంజా(వైఎస్ఆర్ సిపి), టి. నర్సాపురం మండలం నుండి కూరపాటి సుజాత (టిడిపి), నూజివీడు మండలం నుండి కొనకాల లక్ష్మీ (టిడిపి), కుక్కునూరు మండలం నుండి కోమలాదేవి బొంతు(టిడిపి), జంగారెడ్డిగూడెం మండలం నుండి గొల్లమందల సంకీర్తన(టిడిపి), ఏలూరు మండలం నుండి ఘంటసాల శ్రీనివాస్(టిడిపి), ముదినేపల్లి మండలం నుండి చలమయ్య బొర్రా (టిడిపి), పెదవేగి మండలం నుండి చింతమనేని సాయి నవ్యశ్రీ(టిడిపి), ఉంగుటూరు మండలం నుండి చింతల శ్రీనివాస్(టిడిపి), పెదపాడు మండలం నుండి చౌటపల్లి విక్రమ్ కిషోర్ (బిజేపి), చింతలపూడి మండలం నుండి జగన్నాధం అబ్బురం (టిడిపి), కామవరపుకోట మండలం నుండి జాహ్నవి మందలపు (టిడిపి), చాట్రాయి మండలం నుండి తేళ్లూరి శేఖర్ (టిడిపి), కలిదిండి మండలం నుండి నల్లగోపుల వెంకటచలపతిరావు (జనసేన), బీమడోలు మండలం నుండి నిమ్మకాయల గణపతి (జనసేన), దెందులూరు మండలం నుండి పెనుబోయిన మహేష్ బాబు(టిడిపి), కైకలూరు మండలం నుండి బలే ఏసురాజు(టిడిపి), బుట్టాయిగూడెం మండలం నుండి బాలకృష్ణ కొర్సా (వైఎస్ఆర్ సిపి), లింగపాలెం మండలం నుండి ముసునూరు వెంకట సరోజిని (టిడిపి), నిడమర్రు మండలం నుండి మైలవరపు రామలక్ష్మి (జనసేన), పోలవరం మండలం నుండి మొగళ్ల జానకీ సత్య గోవర్ధన సౌమ్య (జనసేన), ముసునూరు మండలం నుండి మౌనిశ్రీ గద్దే(టిడిపి), కొయ్యలగూడెం మండలం నుండి వాడపల్లి రమేష్(జనసేన), ఆగిరిపల్లి మండలం నుండి వీరాబత్తిన జోషిబాబు (టిడిపి), ద్వారకాతిరుమల మండలం నుండి సత్యశ్రావణి కరుటూరి(టిడిపి), జీలుగుమిల్లి మండలం నుండి సూరమ్మ కొరసా (వైఎస్ఆర్ సిపి) జెడ్పిటిసిలుగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, డా.కామినేని శ్రీనివాస్ జిల్లా పరిషత్ సీఈఓ జి. వెంకటనాయుడు, డిప్యూటీ సీఈఓ భీమేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఏలూరు తహసీల్దార్, ప్రభృతులు పాల్గొన్నారు. ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

కోరం లేక వాయిదా పడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించిన ఆర్వో

నాగాయలంక, ప్రజాభూమి ప్రతినిధి



కృష్ణాజిల్లా నాగాయలంక మండల ప్రజా పరిషత్‌లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహణకు అవసరమైన కోరం లేకపోవడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. నూతనంగా ఎన్నికైన 14 మంది సభ్యుల్లో నిర్ణీత సమయానికి కేవలం ఐదుగురు మాత్రమే హాజరుకావడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమంతో పాటు ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. సభ్యుల గైర్హాజరుతో సమావేశానికి అవసరమైన కోరం లేనందున ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ రిటర్నింగ్ అధికారి సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక రూపంలో సమర్పించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుని తమ ప్రతినిధులను ఎన్నుకున్న ప్రజలకు, ఎన్నికైన సభ్యుల గైర్హాజరుతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక జరగకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఎన్నికల ప్రక్రియ సకాలంలో పూర్తికాకపోవడంపై పలువురు ఓటర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహణకు మరో తేదీ ఎప్పుడు ప్రకటిస్తారు? అనే అంశాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. తదుపరి ఎన్నికల నిర్వహణపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



చివరిగా వార్డు సర్పంచ్ నామినేషన్లు..

ప్రజాభూమి యల్లనూరు

యల్లనూరు మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీలకు గాను మూడవ రోజున సర్పంచ్ నామినేషన్లు 90 మంది వేయగా వార్డు సభ్యులుగా నామినేషన్లు 356 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో మనోహర్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

కాజులూరు సర్పంచ్ అభ్యర్థిగా వట్టూరి పట్టాభి రామయ్య నామినేషన్

- పలువురు గ్రామ ప్రజలు హాజరు

ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు



మండల కేంద్రమైన కాజులూరు గ్రామ పంచాయితీ అభ్యర్థిగా జనసేన నాయకులు కాజులూరు పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసారు.ఈ మేరకు శుక్రవారం ఆయన తన అనుచరులతో కలిసి వెళ్ళి తన నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేసారు.అలాగే వట్టూరి పట్టాభి రామయ్య తనయుడు వట్టూరి వీర వెంకట రామభద్రరావు సర్పంచ్ అభ్యర్థిగా మరో నామినేషన్ దాఖలు చేసారు. ఈ కార్యక్రమంలో తొలిత సర్పంచ్ అభ్యర్థి పొట్టూరి పట్టాభి రామయ్య గృహం నుండి భారీ ఎత్తున జన సందోహంతో బయలుదేరి నామినేషన్ కార్యాలయం ముందుకు చేరుకున్నా రు. అనంతరం ఆయన తరుపున పంచాయతీ వార్డు మెంబర్లతో కలిసి వెళ్లి తమ నామినేషన్ దాఖలు చేశారు.

ఆత్రేయపురం సర్పంచ్ పదవికి కూటమి, వైఎస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్లు

- గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని అభ్యర్థుల వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.



ఆత్రేయపురం: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆత్రేయపురం గ్రామ సర్పంచ్ పదవికి కూటమి అభ్యర్థి ముదునూరి రామభద్రరాజు, వైఎస్సార్సీపీ అభ్యర్థి చిలువూరి రామకృష్ణంరాజు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. గ్రామ సచివాలయంలో ఎన్నికల అధికారులకు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. కూటమి అభ్యర్థి ముదునూరి రామభద్రరాజు నామినేషన్ సందర్భంగా ఆయనకు మద్దతుగా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదునూరి వెంకటరాజు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్‌గా గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని, ప్రజలకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగేందుకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో తన తమ్ముడు ముదునూరి రామభ ద్రరాజును సర్పంచిగా గెలి పించాలని ప్రజలను కోరా రు. మరోవైపు వైఎస్సా ర్సీపీ అభ్యర్థి చిలువూరి రా మకృష్ణంరాజు కూడా నా మినేషన్ దాఖలు చేశారు. గతంలో సర్పంచ్‌గా, జడ్పీ టీసీ సభ్యుడిగా వివిధ పద వులు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ ప్రజలు తనకు సేవ చేసే అవకాశం కల్పించారని, మరోసారి సర్పంచిగా గెలిపించి గ్రామ అభివృద్ధికి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సర్పంచి పదవికి ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో ఆత్రేయపురంలో ఎన్నికల సందడి నెలకొంది.





కాజులూరులో 683 నామినేషన్లు దాఖలు

- సర్పంచ్ పదవికి 122, వార్డు మెంబర్లకు 561

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు.

కాజులూరు మండల పరిధిలో గల 26 గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసేసరికి మండల పరిధిలో ఏర్పాటు చేసిన 5 కేంద్రాల ద్వారా మొత్తం 683 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో సర్పంచ్ పదవికి 122, వార్డు మెంబర్లకు 561 మంది ఆయాచోట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

వైదిక మంత్రోచ్చారణల నడుమ
వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆగిరిపల్లి శ్రీ శోభనాచల వ్యాఘ్రు లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి విశేష వైదిక పూజలు భక్తిశద్ధలతో నిర్వహించారు. ధ్రువమూర్తికి పంచామృత అభిషేకం, స్నపనాలంకరణ, అష్టోత్తర శత తులసీదళార్చన, నిత్య హోమం, భేరీపూజ, భేరీ తాండవం, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం నవకుంభారోహణం, సర్వదేవతా నీరాజనం, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి సీహెచ్. సాయి పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, రామ అనంతకృష్ణ, లీలా మనోహర్ ఆధ్వర్యంలో ఈ వైదిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి. స్వామివారి దివ్య దర్శనం, విశేష పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

కోరం లేక రెండో రోజూ ఎంపీపీ ఎన్నిక వాయిదా!

- ఒక్క ఎంపీటీసీ సభ్యుడే హాజరు.. మిగతా సభ్యుల గైర్హాజరులి
- ఉన్నతాధికారులకు నివేదిక పంపిన రిటర్నింగ్ అధికారిలి

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు



వాకాడు మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), ఉపాధ్యక్ష (వైస్ ఎంపీపీ) ఎన్నికల ప్రక్రియ రెండో రోజూ వాయిదా పడింది. ఎన్నిక నిర్వహణకు అవసరమైన కనీస కోరం లేకపోవడంతో శుక్రవారం నిర్వహించాల్సిన ప్రత్యేక సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు.గురువారం నిర్వహించిన తొలి సమావేశానికి కూడా ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం రెండోసారి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా, మండలంలోని ఎంపీటీసీ సభ్యుల్లో కేవలం ఒక్కరు మాత్రమే హాజరయ్యారు.మిగిలిన సభ్యులంతా గైర్హాజరు కావడంతో కోరం ఏర్పడలేదు.దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ మంజుల సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాల మేరకు మరో సమావేశ తేదీని ఖరారు చేసి ఎంపీటీసీ సభ్యులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.వరుసగా రెండో రోజూ కోరం లేక ఎంపీపీ ఎన్నిక వాయిదా పడటంతో మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలపై తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఉపాధి హామీ పనులపై
సామాజిక తనిఖీ బృందం సమీక్ష



ప్రజాభూమి యల్లనూరు

మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులకు సంబంధించిన కోఆర్డి నేషన్ సమావేశం యల్లనూరు చీఖ కాల్వ రోడ్డు గ్రామ సచివాలయం లో నిర్వహించారు 20,వ విడత (1.04.2025 నుండి 30.06.2026) వరకు మండల వ్యాప్తంగా చేపట్టిన పనుల నిమిత్తం సామాజిక తనిఖీ బృందం ఎస్ ఆర్పి, నీలకంఠ డిఆర్పీ, లు హాజరైనట్లు ఏపీవో ఓబిరెడ్డి తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు తెలియజేస్తూ సామాజిక తనిఖీ బృందం వారికి ఆయా తేదీలలో నిర్ణయించిన దాని ప్రకారం టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు కార్యక్రమానికి ఎంపీడీవో మనోహర్ బాబు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.